
తెలుగులో
వెలువడుతున్న
ఏకైక హాస్య
మాస పత్రిక


# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక


జూన్-2021
వెల: రూ.20





ముళ్ళపూడి
హాస్య కథల పోటీ
ఫలితాలు





# హహ్హహ్హహ్హహ్హ


నరక ప్రవేశ ద్వారము
చచ్చొచ్చారు కదా... ఎలాఫీలవుతున్నారు??
PRESS TV
యమలోకం


హమ్మయ్య.. ఇవ్వాళొకడు కోటి లంచం తెచ్చిస్తానన్నాడు దాంతో వంద కోట్లు కూడబెట్టేసినట్టే!!


ఇంటికొచ్చిన బిచ్చగాడు సడెన్‌గా నన్ను చూసి అనుష్క అనుకున్నట్టుండీ!!
అవసరానికొచ్చి పిచ్చి అబద్ధాలాడే అలాంటి వెధవల్ని తరిమికొట్టాలి!!


నేను రొట్టెలకాడ విసిరాను సరే.. తప్పుకోకుండా అక్కడే ఎందుకున్నాడో అడగండి ఆయన్ని!!


ఏ ప్రభుత్వమూ మన సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా కేటాయించిన పాపాన పోలేదు ఇప్పటివరకూ!!

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణహాస్య మాస పత్రిక


**సంపాదకులు: రాము.పి**

**జూన్-2021**

**19వ సంవత్సరం ✦ 204 వ సంచిక**


*Publisher& Editor-* Ramu.P

*FullPillar-* Bnim

*Well Wishers:*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Mallik, Sanku

*D.T.P:* P. Ramalakshmi, 9440304993

*Perpetuals:*
A.Dayakar, Lepakshi,
Bannu, Krishna
Bachi, Nagisetty,
Nagraj, Venkat

ముఖచిత్రం:
కలువబాల
(చిత్రకారులు: చైతన్య)

కార్టూన్: గోపాలకృష్ణ


| | |
|---|---|
| సంవత్సర చందా- | రూ.300/- (పోస్టల్ చార్జీలతో) |
| 2 సంవత్సరాల చందా- | రూ.500/- (పోస్టల్ చార్జీలతో) |
| జీవిత చందా- | రూ.5000/-లు |



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503,**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
**web: hasyanandam.com**



**Hyderabad & Secunderabad Distributors:**
M.Panduranga, **Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.


## హాయ్...హాసందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... సన్నిహితులకు హాస్యాభివందనాలు.**

ఈ కరోనా కాలం మనకి చాలా గుణపాఠాలు నేర్పించింది. క్రమపద్ధతిగా జీవనం సాగించడం అందులో ముఖ్యభాగం. అయితే ఈ విపత్కర పరిస్థితుల్లో మనం గమనించిన ఒక పరిణామం, జనాలు భయాందోళనకు గురిఅయి ప్రాణాలు కోల్పోవటం, ఇది నిజంగా బాధాకరం!

ఈ సందర్భంగా మనం ప్రాచుర్యంలో ఉన్న ఒక కథని గుర్తుచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది- ఒకతనికి అష్టలక్ష్ములు ప్రత్యక్షమై 'నీకు మాలో ఎవరు కావాలో కోరుకో'మంటే... అతను- 'ఒక్క 'ధైర్యలక్ష్మి' చాలు!... ఎందుకంటే ధైర్యం ఉంటే నేను జీవితంలో ఏదైనా సాధించుకోగలుగుతాను' అనంటాడు. అలాగే ఇప్పుడు మనమందరం కూడా 'ధైర్యాన్నే' ఆశ్రయిస్తూ... కొన్ని మామూలుగా పాటించే జాగ్రత్తలు(వైద్యులు చెప్పిన) పాటించి, ఈ కరోనా నుండి మనల్ని మనం కాపాడుకుందాం!...ముఖ్యంగా చెడు వార్తలు విని భయాందోళనకు లోనుకాకుండా ఉండండి! మనసుని ప్రశాంతంగా ఉంచండి! మనసుకి ఆహ్లాదంగా అనిపించే కథలు చదవండి... మైమరపించే సినిమాలు చూడండి... ఏవైన ఇష్టమైన వ్యాపకంతో బిజీగా ఉండండి! ముఖ్యంగా 'నవ్వు' మన ఇమ్యూనిటిని పెంచుతుంది.

కనుక హాయిగా నవ్వుదాం...
కరోనాను జయిద్దాం!
అందరూ ఆనందంగా...
ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ...



Ramu.P

**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# ఎక్కడెక్కడ ఏ ఏ నవ్వులున్నయో...

## కథ


తెలివి ఒకరి సొమ్మా! శింగరాజు శ్రీనివాసరావు -46


## సీరియల్స్




లక్ష్మీఫెలో- జి.రవికిరణ్ 10





ఇందు చందు-నవ్వులవిందు
కండ్లకుంట శరత్‌చంద్ర 42


## శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈ నెల ప్రోత్సాహక బహుమతులు | | -5 |
| అభినందనలు | | -7 |
| స్పెషల్ ఓపెనింగ్ | గుండు సుదర్శన్ | -8 |
| ఆ(కా)ర్టూన్లు | | -14 |
| లాఫింగ్ మాస్క్ | | -39 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -40 |
| తర్మారావు కథలు | గంగాధర్ వడ్లమన్నాటి | -49 |
| కరోనా కా(మెడీ)లం | | -50 |


## ఈ నెల ప్రత్యేకం

ముళ్ళపూడి హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు 15వ పేజీ నుండి 38వ పేజీ వరకు ప్రచురించడం జరిగింది. ఈ పేజీలు బయటకు తీసి ఒక చిన్న బుక్‌లెట్‌గా చేసుకొనే వీలుగా ఈ కథలు ఆయా పేజీల్లో సమకూర్చాం. ముళ్ళపూడి గారి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన సినిమాలకు రాసిన కొన్ని డైలాగుల్ని అక్కడక్కడ ఇవ్వటం జరిగింది. మీరి అనుబంధాన్ని ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాం!




## ఈ సంచికలో కార్టూనిస్టులు

- సరసి
- గోపాలకృష్ణ
- లేపాక్షి
- శేఖర్
- శర్మ
- అర్జున్
- తోపల్లి ఆనంద్
- టి.ఆర్.బాబు
- చక్రవర్తి
- దొరశ్రీ
- ప్రేమ్
- శంబంగి
- ప్రభాకర్
- భార్గ
- నూతి
- ప్రసిద్ధ
- వనజశ్రీ
- వందన శ్రీనివాస్
- పెండేల
- భగవాన్
- ఎమ్.ఎ.రవూఫ్
- కాజప్రసాద్
- శ్రీ
- సునీల్
- జైదాస్
- నాథ్
- టి.భాస్కర్
- జె.ఎన్.ఎమ్.
- నాగిశెట్టి, ధీరజ
- అత్తలూరి
- పిస్క
- ప్రభాకర్ అంతోటి
- జగన్నాథ్
- కన్నాజీరావు
- రంగాచారి
- శ్రీఅక్కెర
- సత్య
- శ్రీకర్

**కథలకు బొమ్మలు:** చైతన్య, దయాకర్, కృష్ణ, సంగ్రామ్.

**మహనీయులైన కళాకారుల సృష్టికి... కీర్తికి... వార్ధక్యమరణాలు ఉండవు...**
**మన నమస్సులు...మనస్సులో 'నివాళి'గా మారుతుంది... అంతే!**



**శ్రీ చంద్ర**
ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టు



**శ్రీ గోపి**
ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టు



**శ్రీ కె.బి.కృష్ణ**
ప్రముఖ హాస్య రచయిత



**శ్రీ కందికట్ల**
ప్రముఖ కార్టూనిస్టు




**శ్రీ చైతన్య**
ప్రముఖ చిత్రకారులు, కార్టూనిస్టు

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

**ది బెస్ట్ కార్టూన్ ఆఫ్ ది మంత్ ! / ప్రోత్సాహక బహుమతి: రూ.1000/-**

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.



ఈ నెల బెస్ట్ కార్టూనిస్ట్- **జెన్నా** **కార్టూన్ 51 వ పేజీలో**





కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం** కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-** ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు& ప్రశంసాపత్రం** **శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు** అందజేస్తున్నారు.




**ఈ నెల పురస్కార గ్రహీత - మోహన్ కుమార్**


కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్. (జె.శ్రీరామచంద్రమూర్తి గారు)** వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**













కార్టూనిస్టులపై ప్రేమతో, వాత్సల్యంతో **శ్రీకుప్పచ్చి సుందరేశయ్య, శ్రీమతి సత్యవతి (కోవూరు) వార్లు** కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి **ప్రతినెలా 500 రూపాయలు బహుమతిగా ఇస్తున్నారు.**






✦ **డా॥జయదేవ్, చెన్నై**

**సు**దర్శనంగారి సమాధానాలు నన్ను విస్తుపోయేలా చేసి నవ్వుల వర్షంలో తడిపి ముద్ద చేశాయి. ఆయన పెద్ద హ్యూమరిస్ట్, మన హాస్యానందంలో ప్రతినెలా వారి మేథో సంపదని మనకార్టూనిస్టులకు పంచి పెట్టి స్ఫూర్తి కలిగిస్తున్నారు. వారితో, శ్రీ శంకు గారి ద్వారా నాకు పరిచయ భాగ్యం ఇరవై ఏళ్ళక్రితం కలిగింది. అప్పట్నుంచి వారి అశేష అభిమానుల జాబితాలో నేనూ ఒకడినై పోయాను. హాస్యానందంలో వారితో ముచ్చటించుకునే అవకాశం కలిగించిన మీకు ధన్యవాదాలు. శుభాశీస్సులు.

✦ **ఆర్.గోపాలరావు, నెల్లూరు**

**వా**డినా వాడని నవ్వులు... సూపర్! ఇలాంటి ప్రయోగాలు చేసేది హాస్యానందం ఒక్కటే! మీ సృజనాత్మకతకు అద్దం పట్టే ఎన్నో ప్రయోగాలలో ఇదొక్కటి! మా అంచనాలకు అందకుండా ఎప్పటికప్పుడు కొత్తగా, వినూత్నంగా పత్రికని వెలువరుస్తున్న మీకు అభినందనలు.




✦ **వై.కామేశ్వరి, ముంబై**

**మే** హాస్యానందం అద్భుతంగా ఉంది. ఇన్ని కార్టూన్లు ఒక్క సంచికలోనే చూసి సంబరపడి పోయాము. కార్టూన్లు కూడా పెద్ద సైజులో ఉండి చూడముచ్చటగా ఉంది. పోటీల్లో గెలుపొందిన కార్టూన్లు మన కార్టూనిస్టుల ప్రతిభకు అద్దం పట్టాయి. సినిమా కార్మికులు కార్టూన్లు కూడా బావున్నాయి. సినీ పరిశ్రమలో పరిస్థితులు కళ్ళకు కట్టినట్లు చూపించాయి ఈ కార్టూన్లు. ముఖచిత్రం మీద తెలుగు కార్టూనిస్టు సూపర్‌మేన్‌లా అగుపించి, ముఖచిత్రానికే శోభ తెప్పించాడు. ఈ సంచిక తెలుగు పత్రికల్లోనే ఓ మణిమకుటం!

✦ **ఆకెళ్ళ శోభారాణి, హైదరాబాద్**

**మే** హాస్యానందం పూర్తిగా కార్టూన్లతో రూపొందించటం చాలా బాగుంది. ఆకాశంలో చుక్కల నడుమ చందమామలా మెరిసిపోయింది గుండు సుదర్శన్‌గారి 'సెంటర్ అట్రాక్షన్'. తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా జయదేవ్‌గారి ప్రశ్నలతో తయారయిన ఈ పేజీలు కార్టూన్లతో పోటీపడి నవ్వించాయి. పత్రిక మొత్తంగా ఓ నవ్వుల అల్బమ్. మీకు అభినందనలు.

✦ **శ్రీనివాస్ బమ్మిడి, విశాఖపట్టణం**

**తె**లుగు కార్టూనిస్టుల దినోత్సవం ప్రత్యేక సంచిక కార్టూన్లతో రూపొందించటం బావుంది. గతేడాది ప్రచురించిన కొన్ని మంచి కార్టూన్లను మరోసారి అందించడం బాగుంది. బహుమతి పొందిన కార్టూన్లు బావున్నాయి. ముఖ్యంగా తలిశెట్టి రామారావు అవార్డు మొదటి బహుమతి పొందిన కార్టూన్- 'తల కాయ లేకుండా ఓటింగ్ ప్రక్రియ' సూపర్!

✦ **బి.శ్రీరామ్‌ప్రసాద్, తెనాలి**

**మే** హాస్యానందం, కార్టూన్లతో కళ కళలాడింది. ఎన్ని నవ్వులో... 88 మంది కార్టూనిస్టులతో తయారయిన ఈ నవ్వుల తోటలో అన్ని పువ్వులు వికసించి నవ్వులు కురిపించాయి. జయదేవ్‌గారి ప్రశ్నలకు, గుండుగారి సమాధానాలు నవ్వించడంలో సఫలీకృతమయ్యాయి. మొత్తం మీద ఈ సంచిక దాచుకోదగినది.

✦ **కె.వి.గోవిందరావు, విజయవాడ**

**కా**ర్టూన్లతో కామెడీ చేసిన మే హాస్యానందం మా చేతికొచ్చేసరికి వారం పట్టింది. మా పిల్లలు మొత్తంగా నవ్వేసి... పుస్తకాన్ని నలిపేసి మా కందించారు. పత్రిక సూపర్!

**మనిషికి ఆకలి లేకపోతే...** అనే అంశంతో

**కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు హాస్యానందం** సౌజన్యంతో ప్రకటించిన ఈ కార్టూన్ పోటీలో కార్టూనిస్టులందరూ పాల్గోవాలని మనవి!

| | |
|---|---|
| మొదటి బహుమతి: | **రూ.1500/-లు** |
| రెండవ బహుమతి: | **రూ.1000/-లు** |
| మూడవ బహుమతి: | **రూ.700/-లు** |
| ప్రత్యేక బహుమతులు(10): | **రూ.300/-లు** |

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ- జులై,1, 2021.**

**శ్రీ అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీలు**



**హాస్యానందం** సౌజన్యంతో **శ్రీ ఎ. జయకుమార్‌గారు** తమ తండ్రిగారి పేరిట ఈ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్టూనిస్టులందరూ పాల్గోవాలని మనవి!

| | |
|---|---|
| మొదటి బహుమతి: | **రూ.1000/-లు** |
| రెండవ బహుమతి: | **రూ.800/-లు** |
| ప్రత్యేక బహుమతులు(10): | **రూ.300/-లు** |

**కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ- జూన్,20-2021.**

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపండి- **hasyanandampoteelu@gmail.com**

# అభినందనలు...

## 'హాస్యబ్రహ్మ' శంకరనారాయణ మీద పి.హెచ్.డి.





**'హా**స్యబ్రహ్మ శంకరనారాయణ జీవితం – రచనా విన్యాసాలు' అనే అంశం మీద గుంటూరు న్యాయవాది చొప్పరపు శ్రీనివాసరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేసింది.

హాస్యావధానిగా, హాస్య రచయితగా ప్రసిద్ధుడయిన సీనియర్ జర్నలిస్టు శంకరనారాయణ నాగార్జున యూనివర్సిటీ మొదటి బ్యాచ్ ఎం.ఏ తెలుగు విద్యార్థి కావడం విశేషం.


425 కి పైగా హాస్యావధానాలతో ప్రపంచమంతా దూసుకుపోయింది ఈయన 'పంచ్'శరం.

వివిధ వేదికల్లో, మీడియాలో ఈయన కలం, గళం కురిపించిన 'ఫన్' కాలాలు తెలుగు సాహితీవనాన్ని నవ్వులవసంతాలతో నింపేస్తూనే వున్నాయి. ఫన్ గన్, ఫన్ దేహాలు, టెలి ఫన్ ....వగైరా ఫన్ బాణాల్ని తన అక్షయ అక్షర హాస్య తూణీరంలోంచి గత నాలుగు దశాబ్దాలుగా సంధిస్తూనే శంకర నారాయణుడు తనదంటూ ఒక క్రొత్త సాహితీ స్థానాన్ని సృష్టించుకున్నారు. అందుకే 'ఎవరీ శంకరనారాయణ' దగ్గర్నుంచి, 'ఏమిటీయన విశిష్టత' దాకా శోధించి, మథించి సమర్పించిన థీసిస్‌ని పిహెచ్‌డికి ఎంపికయింది.

తన ఇంట్లో తనకే జాగా లేకుండా చేస్తున్న బిరుదులు (గౌరవ డాక్టరేట్లు సహా), అవార్డులు, సత్కారాల తాలూకు ఫోటోఫ్రేములు, శాలువాలు, ప్రశంసా పత్రాల మధ్య ఒదిగి కూర్చుంటూ కూడా, థీసిస్ లకి సరిపడేటంత ఫన్ గామాల్ని, (కొరోనా కాలంలో) మాస్కోడి గామాల్ని సృష్టిస్తున్న ఈ 'హాస్యబ్రహ్మ' శంకర నారాయణుడు – ఈనాడు, ఆంధ్రప్రభ వంటి పలు సంస్థల్లో పాత్రికేయుడిగా మాసిపోని, వెలిసిపోని, చెరిగిపోని పంచ్ ముద్రలు వేసిన 'కలం'కారుడు కావటం జర్నలిస్టులకు గర్వకారణం కాదా!

అమరావతిలోని ఆర్.వి.ఎన్.కళాశాల విశ్రాంత తెలుగుశాఖాధిపతి డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో శ్రీనివాసరావు పరిశోధన చేశారు. జర్నలిజంతో సహా ఎం.ఏ తెలుగుతో సహా 5 పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలున్న తాను తెలుగు సాహిత్యం, హాస్యం మీద ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో పరిశోధన సాగించినట్టు శ్రీనివాసరావు తెలియజేశారు.

## సి.బి.ఎఫ్.సి. సలహా సమితి సభ్యునిగా మన తెలుగు కార్టూనిస్ట్



**మ**న తెలుగు కార్టూనిస్టు, ప్రముఖ జర్నలిస్ట్– ఓంప్రకాశ్ నారాయణ వడ్డి (ఓనావ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సి.బి.ఎఫ్.సి) అడ్వయిజరీ కమిటీ సభ్యునిగా ఇటీవల నియమితులయ్యారు.

ఆయన ఈ పదవిలో రెండు సంవత్సరాలు ఉంటారు.

మచిలీపట్నంలో జన్మించిన ఓంప్రకాశ్ విజయవాడ ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. కాలేజీలో డిగ్రీ చేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. పట్టా పొందారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఎంసీజే చేశారు.

1989లో జర్నలిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన ఓంప్రకాశ్ రెండు దశాబ్దాలుగా ఫిల్మ్ రిపోర్టింగ్‌లో ఉన్నారు.

జాగృతి వార పత్రికతో పాత్రికేయునిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన ఆ తర్వాత క్యాపిటల్ మార్కెట్, సూపర్ హిట్, వార్త, ఆంధ్రజ్యోతి పత్రికలలో పనిచేశారు. ఆపైన సాక్షి, ఏబీయన్ ఛానెల్స్ లో సీనియర్ ఫిల్మ్ కరస్పాండెంట్‌గా సేవలు అందించారు.

ప్రస్తుతం ఎన్ టీవీ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్‌లో అసోసియేట్ ఎడిటర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఓంప్రకాశ్ ఇంటర్మీడియట్ రోజుల నుండి ఓనావ పేరుతో కార్టూన్లు వేస్తున్నారు. పేరెన్నికగన్న తెలుగు వార, పక్ష, మాసపత్రికల్లో వారి కార్టూన్లు ప్రచురితమయ్యాయి. ఆంధ్రజ్యోతి, మయూరి, ఆంధ్రభూమి, జాగృతి, హాస్యానందం తదితర పత్రికలు నిర్వహించిన కార్టూన్ల పోటీలలో బహుమతులు అందుకున్నారు.

'ఓనావ కార్టూన్లు' పేరుతో కార్టూన్ సంకలనం తీసుకొచ్చారు. కథా రచయిత కూడా అయిన ఓంప్రకాశ్ 'మనసు తడి ఆరనీకు' పేరుతో కథాసంపుటిని వెలువరించారు. జాగృతి వార పత్రికలో దాదాపు మూడు దశాబ్దాలుగా ఆయన చిత్రసమీక్షలు రాస్తున్నారు.

సునిశితమైన హాస్యాన్ని ఇష్టపడే కార్టూనిస్ట్ ఓనావ సెన్సార్ బోర్డ్ సభ్యులు కావడం పట్ల 'హాస్యానందం' హర్షం వ్యక్తం చేస్తోంది.





ప్రముఖ రచయిత

# కోలపల్లి ఈశ్వర్ ఫన్ ప్రశ్నలకు-
# సుదర్శనమ్ పంచ్ సమాధానాలు




*Cartoons: Krishna*




✦ భూలోకంలోనేనా హాస్యం... స్వర్గంలో లేదాండీ?

**దుఃఖం ఎరగని చోట... హాస్యం ఏముంటుందండీ! పాపం... పూర్ ఫెలోస్... ఐ పిటీ దెమ్ అండ్ దెయిర్ హెల్...సారీ...హెవెన్!!**




✦ మీరు స్వామిజీ అయితే మీ ప్రవచనాలు వినాలని ఉందండీ... నా గ్రహాలు చెప్పించుకోవాలని ఉందండీ...!!

**ఏదో నా వేషాలు నేను వేసుకుంటుంటే... నా మానాన నన్ను వదిలేయొచ్చుగా?! ఎంతోమంది ఉండగా... నాకే ఎందుకో ఈ డబల్ బంపర్ ఆఫర్...?!**

✦ బ్రహ్మచారి, సంసారి, సన్యాసి... వీళ్ళల్లో ఎక్కువగా నవ్వగలిగేది ఎవరు?

**పెళ్ళైన బ్రహ్మచారి... పెళ్ళికాని సంసారి... పెళ్ళాన్నొదిలి పరారైన సన్యాసి... ముగ్గురూ ఫెళ్ళున నవ్వగలరు! ఎవరెక్కువంటారా? ఛా... ఊర్కొండీ... మీకు తెలీదా ఏంటీ??**



✦ ఆడవాళ్ళు వయసుని దాస్తారెందుకండీ?

**ఇహ... దాచడానికి ఏమీ లేక !**

**లేకపోతే ఏంటండీ? అది దాచటం కాదు... వాళ్ళ 'కొ(కా)లమానం' వేరు! ప్రతి కొన్నేళ్ళకి ఓసారి పెరుగుతుంది...వాళ్ళ వయసు!... అర్థం చేసుకోరూ!!**






✦ మమ్మల్ని నవ్వించడానికి ఇంటిదగ్గర ఎక్సర్‌సైజులు ఏమైనా చేస్తుంటారా?

**ఇలాంటి 'వెయిట్' ఉన్న ప్రశ్నలు వచ్చినప్పుడు...తప్పదుమరి! 'బరువు'లెత్తే ఎక్సర్‌సైజులు చేస్తుంటా!!**



✦ హాస్య సినీరంగ వైభవంలో మీ స్థానం?

**పాపం... మీకు తెలీకుండానే ఓ అద్భుత ప్రయోగం చేసారు... నిజమే...'హాస్యసినీరంగమే'! ఇక...హాస్య వైభవంలో అంటారా? నాదీ ఒక స్థానమే! (చివర్లో ఉన్నది ఆశ్చర్యార్థకమే... ప్రశ్నార్థకము కాదు... గమనించగలరు)**

✦ ఒకప్పుడు రాజులు మారువేషాల్లో తిరిగేవారంటా!... ఇప్పుడు ప్రతి ఒక్కరు మాస్కుల్లో మారువేషం లాగే ఉన్నారు. మీరు కూడా! కానీ మీ గుండుని చూసి కనుక్కుంటున్నాంగా!

**అబ్బా... గుండును చూసి గుర్తు పట్టేసే మీ 'వింటిలిజెన్స్' చూస్తుంటే... నాకు ఖుళ్ళొచ్చేస్తోంది! 'మాస్క్ పెట్టుకుంటే మారు వేషం'... అంటూ పాత సినిమాల పీరియడ్‌లోనే ఉండి పోయినట్టున్నారు... నేను 'హేట్' పెట్టుకుంటే గుర్తు పట్టలేరేమో...!**






✦ ముద్దుమీద ముద్దు పెట్టు అని పాట రాస్తే సెన్సార్ వాళ్ళు మాస్కు మీద ముద్దు పెట్టు అని మార్చారేంటీ?

**సెన్సార్ అంటే అంతేమరి...! అన్నీ 'బూతద్దం'లోంచే చూస్తారు... వింటారు! మూతి అన్నా బూతే...ముద్దు అన్నా బూతే... పెట్టు అన్నా బూతే...! (వాళ్ళు పదాలే మార్చారు, గమ్మునుండండి! పాటనే మార్చేగల్రు!)**





✦ మురికిలో తిరిగే పందులకు కరోనా రాకుండా, రారాజు అయిన సింహాలకు రావటం ఏంటీ... ఛా!!

**పందులకి రాలేదనా?... సింహాలకి వచ్చిందనా?... ఇంతకీ మీ 'ఛా'... ఏ 'ఛా'?... పందులు 'మురికి'లోనే ఉంటాయి... అవిసేఫ్! సింహాలు 'జూ'లో ఉంటాయి(ఉంచుతారు)... అది రిస్క్! మీకేమర్థమయింది?... మడిసి కన్నా మురికే బెటరన్నది పాయింట్!**




✦ హాస్యాన్ని ముక్కుతో నశ్యంలాగా పీల్చి... నోటితో లాస్యం చేయాలా?

**'నశ్యం' మీద మీకు మంచి పట్టున్నట్టుంది...! అయినా నశ్యంలా పీలిస్తే వచ్చేది లాస్యం కాదు...హాచ్ఛ్... ఇదీ! ఈ టైంలో మరీ అంతలా పీల్చేయబాకండి...ప్రజలు 'పానిక్' అవుతారు!**




✦ ఇప్పుడు అమ్మాయిలకు భలే ఛాన్స్ కదండీ? మాస్కులతో ముఖాన్ని కవర్ చేస్తూ... మేకప్ డబ్బులన్నీ మిగుల్చు కుంటున్నారు...హమ్మా!

**మీది మాత్రం భలే ఛాన్స్ కాదా అండీ... మాస్కలతో మూతిని, ముక్కుని...కళ్ళనీ కూడా కవర్ చేస్తూ... చేసిన అప్పులన్నీ ఎగ్గొడుతున్నారు(అంట!)... హ(న్నా)య్యా!!**



✦ చీరకట్టు జారిపోతోంది ఆమెకు... ఉపాయం చెబుదురూ...?

**మీకా... ఆవిడకా... ఉపాయం!? అయినా, అంతలా జారి పోతుంటే... ఆవిడే చెప్తుంది ఏదో ఉపాయం... మధ్యలో నేనెందుకు... చెప్పటం?**



సీరియల్

# లక్కీఖెలో

జి. రవికిరణ్

**"ఆఫీసుకు వస్తున్నావుగా...నేను నీకు టిఫిన్ బాక్స్ తెస్తా. నువ్వు తినకుండా రా! " అంది స్వాతి.**

**"నువ్వు తినిపిస్తానంటే నేనొద్దంటానా..." అన్నాడు నవ్వుతూ కిషోర్.**

**"ఏం తెస్తావ్?" అడిగాడు.**

**"తెచ్చాకే తెలుసుకోవడాలు... బై! " ఫోన్ పెట్టేసింది.**

**మ్యూజిక్ పెట్టుకుని డాన్స్ వేస్తూ రెడీ అయ్యాడు కిషోర్.**

**కిషోర్‌ని చూసి అబ్బో అన్నట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు మహేష్.**

✦ ✦ ✦

కిషోర్ ఆఫీసుకు వెళ్ళేసరికే స్వాతి ఎదురు చూస్తోంది.

వెళ్ళగానే "ఫాస్ట్ ఫాస్ట్ బ్రేక్‌ఫాస్ట్" అంటూ ఆత్రంగా అడిగాడు కిషోర్.

భుజంమీద ఒక్కటిచ్చింది స్వాతి.

"అంత తొందరెందుకు?... ఆగు!" అంది స్వాతి.

ఇద్దరూ కూర్చున్నారు.

బాక్స్ ఓపెన్ చేసింది స్వాతి.

"హేయ్ పులిహోరా?!" ఆనందంగా అరిచాడు కిషోర్.

"థాంక్యూ వెరీమచ్. చాలా కాలమైంది నిజంగా! బయట జనరల్‌గా దొరకదు. రూమ్‌లో చేసుకోలేం. అందుకని!" ఆశ్చర్యంగా చూస్తున్న స్వాతికి ఎక్స్‌ప్లనేషన్ ఇచ్చాడు.

స్పూన్ తీసుకుని తినటం మొదలెట్టాడు.

మధ్యలో ఆగి "అవును... నువ్వు తిన్నావా?" అడిగాడు కిషోర్.

ఆ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్న స్వాతి లేదన్నట్లు తల అడ్డంగా ఊపింది.

"అవునా! మరి తిను!" అంటూ స్పూన్ అందించాడు కిషోర్.

**ఇంతకు ముందు...** మహేష్, కిషోర్ ఇద్దరు స్నేహితులు. ఒకే ఆఫీసు, ఒకే ఇల్లు. కానీ ఇద్దరి మనస్తత్వాలు వేరు వేరు. మహేష్ చాలా స్పీడు. కిషోర్ నెమ్మదస్తుడు, భయస్తుడు కూడా! ఆఫీసులో బాసు పి.ఎ. అంటే ఇష్టం కానీ చెప్ప లేదు. కలల్లో ఆమెతో విహరిస్తుండం, కబుర్లు చెప్పడం లాంటివి చేస్తుంటాడు. మహేష్ అలా కాదు. రోజుకో అమ్మాయితో షికార్లు, కాలక్షేపాలు చేస్తుంటాడు. **తర్వాత...**

అప్పుడే అటుగా వచ్చిన ఎండీ పీఏ అదే... పొటాషియం సెనేడ్ "ఓరీ వీళ్ళ వేషాలూ..." అనుకుంటూ వెళ్లిపోయింది

"అవును!? పల్లీలా? జీడిపప్పులా మెత్తగా తగులుతున్నాయి. టేస్ట్ వేరేగా ఉందే?" అడిగాడు కిషోర్.

"ఏం మనిషివి బాబూ? అది కూడా తెలియదా? అవి చికెన్‌ముక్కలు!!" అంది స్వాతి.

"ఏంటీ చికెనా!?" అరిచాడు కిషోర్.

"ఎందుకలా అరుస్తావ్? అది చికెన్ పులిహోర!" అంది స్వాతి.

"చికెన్‌ను కొబ్బరిలా తురిమి చేసా!... బాగుందా?" అడిగింది స్వాతి.

"నీకు కూడా మగధీరలా 300 ఏళ్ళ ఫ్లాష్ బ్యాక్ ఉండుంటుంది... నువ్వు కాజోల్ అయితే... అవతల రామ్‌చరణ్ బదులు...." అని ఆపి స్వాతి మొహంలోకి చూసాడు.

"అవును రామ్‌చరణ్ బదులు నువ్వుండుంటావు!" అంది నవ్వుతూ స్వాతి.

"అదే మరి నేను కాదు!" అన్నాడు కిషోర్.

"మరి?!" అంది స్వాతి.

"కోడి....కోడిపుంజు వుండుంటుంది..." అన్నాడు కిషోర్ సీరియస్‌గా.

స్వాతి కోపంగా చూసింది.

ఫక్కున నవ్వాడు కిషోర్.

"అప్పుడు అది నీకు హ్యాండిచ్చుంటుంది.

అందుకే నువ్వు ఈ జన్మలో దాని లెగ్స్ కూడా తినేస్తున్నావ్!" అన్నాడు.

"నిన్నూ..." అంటూ కిషోర్ వీపు మీద చేతులతో కొట్టింది స్వాతి.

ఇంతలో సడెన్‌గా చతుర్వేది వచ్చాడు.

"హాయ్! కంగ్రాట్స్ టు బోత్ ఆఫ్ యూ..." అన్నాడు.

కిషోర్ వంక చూసి– "లక్కీ ఫెలో!..." అన్నాడు. స్వాతి వంక తిరిగి "యూ ఆర్ ఆల్ సో లక్కీ" అన్నాడు .

ఇద్దరూ సిగ్గుపడ్డారు.

చతుర్వేది వెళ్లిపోయాడు.

"పాపం చాలా మంచోడు. వీడిని అనవసరంగా తిట్టుకున్నా!" అన్నాడు కిషోర్.

"ఎందుకు?" అంది స్వాతి.

"ఇప్పుడు అవసరమా? పద పద టైమైంది." అన్నాడు కిషోర్.

ఆ రోజు ప్రాజెక్ట్‌వర్క్‌లో బిజీ అయిపోయారు. కాని కోమలి రాలేదు. చతుర్వేదిని అడిగాడు కిషోర్.

"హేడ్డేక్. షీ ఈజ్ ఎట్ రూమ్ ఓన్లీ..." అన్నాడు చతుర్వేది.

"వీడి బొంద! అది మహేష్‌గాడితో అవుటింగ్‌కి వెళ్ళుంటుంది!" అనుకున్నాడు కిషోర్.

ఆఫీసు అయిపోయాక కిషోర్, స్వాతి బయల్దేరారు.

"ఆఁ! స్వాతి....అప్పుడే వెళ్లి ఏం చేస్తావ్? మా ఫ్లాట్‌కి వస్తావా?" అడిగాడు కిషోర్.

"ఆఁ" అని కిషోర్ మొహంలోకి చూసింది స్వాతి.

"ఏం లేదు ఊరికే!... వాట్సప్‌లో బటన్స్ నొక్కుకునే బదులు డైరెక్ట్‌గా మాట్లాడుకోవచ్చు కదా అని!" అన్నాడు కిషోర్.

ఒక్క క్షణం ఆలోచించి–

"సరే పద!" అంది స్వాతి.

ఇద్దరూ బైక్ మీద వెళ్తుండగా అడ్డంగా వచ్చారు ల్యాబ్‌డాగ్స్ బ్యాచ్.

"ఏంటి బ్రదర్ బాగున్నావా?... బాగానే కన పడుతున్నావులే. ఆ రోజేదో కొలీగ్ అన్నావ్. ఇవాళేంటీ కొంగు పట్టుకుని తిరుగుతున్నావ్. ఫీజు బాగా ఎక్కువవుతుందమ్మా" అన్నాడొకడు.



*హాస్యానందం పాఠకులకు సుపరిచితులైన చిత్రకారులు శ్రీ చైతన్య కరోనా బాధితులై మే,24న కన్నుమూసారు.*

*హాస్యానందంలో కథలకు,లక్కీఫెలో సీరియలకు బొమ్మలు వేయడంతో పాటు ఈ నెల ముఖచిత్రం ప్రత్యేకంగా హాస్యానందం కోసం చిత్రీకరించి ఇచ్చారు.*

*చాలాకాలంగా చిత్రకారుడిగా సాహితీ ప్రపంచానికి చిర పరిచితులు. సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాలను గీయడంలో ఎంతో ప్రతిభ కనబరిచేవారు. చైతన్య మృతికి హాస్యానందం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుంది.*

**–ఎడిటర్**


"చూడు గురూ... ఇప్పటికే మీవల్ల నాలుగు వేలు బొక్క.. ఇంక నావల్లకాదు!" చెప్పాడు కిషోర్.

"ఏంట్రా సౌండింగ్ తేడాగా వుంది. కావాలంటే క్రెడిట్ ఇస్తాం... ఇప్పుడు ఎంతుంటే అంత ఇయ్యి! తర్వాత మిగతాది సెటిల్ చేసుకుందాం!" అన్నాడు వాడు.

కోపంగా చూసాడు కిషోర్.

పబ్‌లో ఫైట్ గుర్తొచ్చింది స్వాతికి.

"వద్దు కిషోర్. ఇప్పుడు అనవసరంగా ఫైట్ దేనికి? వాళ్ళకి నీ వర్షన్ ఛేంజ్ అయిన సంగతి తెలియక అలా మాట్లాడుతున్నారు! వదిలేయ్.



పద పోదాం!!' అంది స్వాతి.

"ఏంటి వర్షమా....అదేంటి?"

"హేయ్! నీకు తెలియదులేరా!!... నోర్మూసుకో!" అంది స్వాతి.

"కిషోర్ నువ్వు పద" అంది స్వాతి.

కిషోర్ మాత్రం అప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేసాడు.

బైక్ దిగి స్టాండ్ వేసాడు.

అవతలవాడికి తిక్కరేగింది.

"అరేయ్. అది పోదామంటోంది. వీడేమో హీరోలా బిల్డప్ ఇస్తున్నాడు... ఇక లాభం లేదురా... వీడికి మన పవర్ వాసన చూపించాల్సిందేరా" అన్నాడు.


కిషోర్‌ని చొక్కా పట్టుకుని లాగి ఒక పంచ్ ఇవ్వబోయాడు. కిందకు వంగి పైకి రివ్వున లేచిన కిషోర్ పంచ్ వాడి మొహానికి తగిలింది.

'అబ్బా!' అంటూ పడిపోయాడు. ఐదుగురూ ఒక్కసారే చుట్టుముట్టారు. అప్పటికే పబ్ ఫైట్ కిక్‌లో ఉన్నాడు కిషోర్. పైగా స్వాతి పక్కనే ఉంది. ఇక రెచ్చిపోయాడు... దెబ్బలు తగులుతున్నా పట్టించుకోలేదు. వాళ్ళను కుమ్మేసాడు.

పారిపోతున్న వాడిని పట్టుకుని వాడి జేబులో పర్సు తీసుకుని అందులో నాలుగు వేలు తీసుకున్నాడు.

"అరేయ్! మన బాకీ సెటిల్ అయిపోయింది." అంటూ వాడిని ముందుకు తోసాడు.

"హే" అరిచింది స్వాతి. "మోచేతికి బ్లడ్" అంది.




"ఏం కాదులే!" అన్నాడు కిషోర్.

కిషోర్ చెబుతున్నా వినకుండా పక్కనే ఉన్న క్లినిక్‌కి తీసుకెళ్లింది.

"ఏమైంది?" సిస్టర్ వచ్చి అడిగింది.

"ల్యాబ్‌డాగ్స్" అన్నాడు పళ్ళు కొరుకుతూ కిషోర్.

"డాగ్స్. అయితే ఇంజక్షన్ వేయాల్సిందే. పదండి!" అంది.

"డాగ్స్ కాదు మేడమ్! డాగ్‌ను పట్టుకోబోయి రోడ్డుమీద పడి దెబ్బ తగిలింది అంతే!" సర్ది చెప్పింది స్వాతి.

కట్టు కట్టింది. టీటీ వేయించింది. కాసేపటికి ఇద్దరూ బయటికొచ్చారు.

బైక్ స్టార్ట్ చేసాక- "కిషోర్ నన్ను హాస్టల్‌లో దింపేయ్!" అంది స్వాతి.

"అదేంటి ఫ్లాట్‌కు వస్తానన్నావుగా!'...' గారంగా అన్నాడు కిషోర్.

"ఇప్పటికే చాలా టైమైంది. అయిన ఫైటింగ్ చాలు పద!" అంది స్వాతి.

"ఆఁ! ఫైటింగ్‌దేముంది. నేను నీతో ఫైటింగ్ చేద్దామనుకుంటుంటే..." అన్నాడు కిషోర్.

సిగ్గుతో నవ్వుతూ- "చాలు చాలు పద పద'!' అంది స్వాతి.

అయిష్టంగానే హాస్టల్‌వైపు పోనిచ్చాడు.

హాస్టల్ దగ్గర దింపి- "బై" చెప్పి బయల్దేరాడు కిషోర్.

అలా వచ్చాడో లేదో ఫోన్ మోగింది. స్వాతి.

"ఏంటి స్వాతి! మనసు మార్చుకున్నావా? మా ఫ్లాట్‌కే వెళదామా?... నాకు తెలుసులే!!" అన్నాడు కిషోర్.


"నీ మొహం వెనక్కిరా! మదాలస సూసైడ్ అటెంప్ట్ చేసిందంట... స్టార్ హాస్పిటల్‌లో ఉందంట... వెళ్దాంరా!"

✦ ✦ ✦

మహేష్‌కి చాలా నెర్వస్‌గా వుంది.

ఎదురుగా కోమలి కోక్ తాగుతోంది.

"ఇంతమంది అమ్మాయిలను డీల్ చేసాను. కాని ఈ అమ్మాయి ఎంత బాగుంది. ముట్టుకుంటే కందిపోయేలా ఉంది. ఎవరినైనా ట్రాప్ చేసి తెచ్చేవాడిని. ఇదేంటో అదే అడిగి మరీ వచ్చింది. ఎంతైనా నార్త్ కదా ఫాస్టే!" తెగ ఆలోచిస్తున్నాడు మహేష్.



"కోమలి, డిడ్ చతుర్వేది నో అబౌట్ ఇట్!" అడిగాడు డౌట్‌గా.

"ఎస్! అఫ్‌కోర్స్" అని మళ్ళీ "నో... నో..." అంది సిగ్గుపడుతూ.

"ఇంతకీ కితనే బజే తక్ ఇదర్ బజాయింగే హమ్" అడిగాడు కొంటెగా మహేష్.

"నో ప్రాబ్లెమ్! తేరీ మర్జీ" అంది సూటిగా కళ్ళల్లోకి చూస్తూ కోమలి.

ఫ్లాట్ అయిపోయాడు మహేష్... అదృష్టం దరిద్రం పట్టినట్టు పట్టడమంటే ఇదేనేమో అనుకున్నాడు.

"ఓకే! వి విల్ హావ్ డిన్నర్ ఆల్‌సో హియర్. ఓకే?..." అన్నాడు మహేష్.

"ఓకే!" అంది కూల్‌గా కోమలి.

"స్విమ్మింగ్?" అడిగాడు.

"యా!...." అంది కోమలి.

ఇద్దరూ స్విమ్మింగ్ పూల్‌లోకి దిగారు.

మహేష్ కూల్‌వాటర్‌లో స్విమ్ చేస్తున్నా బాడీ మాత్రం హీటెక్కిపోయింది. చూపులతోనే కోమలిని తినేస్తున్నాడు. చూస్తూనే చూడనట్లుగా కోమలి బిహేవ్ చేస్తోంది.

కాసేపయ్యాక రూమ్ తీసుకున్నాడు మహేష్.

"వి విల్ గో టు రూమ్ అండ్ టేక్ రెస్ట్. ఓకే?!" అన్నాడు మహేష్.

"ఓకే!" అంది కోమలి.

"అయ్‌బాబోయ్! ఓకే అంట!!" అనుకుంటూ కోమలి అటు తిరగగానే... 'ఒరేయ్ మహేష్ నీకు తిరుగు లేదహే!" అనుకుంటూ జబ్బలు చరుచుకున్నాడు.

ఇద్దరూ రూమ్‌లోకి వెళ్లారు.

✦ ✦ ✦

హాస్పిటల్‌లో మదాలస ఐసీయూలో వుంది.

బయట టెన్షన్‌గా కిషోర్, స్వాతి కూర్చున్నారు.

"ఏం తాగింది?" అడిగాడు కిషోర్.

"నెయిల్ పాలిష్, ఇంకేదో తాగిందంట!" అంది స్వాతి.

"ఆ మహేష్‌గాడి వల్లే అయుంటుంది!!" అన్నాడు కోపంగా కిషోర్.

ఇంతలో డాక్టర్ వచ్చాడు.

"షీ ఈజ్ అవుటాఫ్ డేంజర్! మీరు కలవొచ్చు!" అన్నాడు.

ఇద్దరూ లోపలికి వెళ్లారు.

వీళ్ళను చూసి మదాలస ఏడవటం మొదలెట్టింది.

"ఏయ్! ఎందుకే ఏడుస్తావ్? ఏడవకు. కిషోర్ వచ్చాడుగా నీ ప్రాబ్లెమ్ సాల్వ్ చేస్తాడు!" అంది స్వాతి ధైర్యం చెబుతూ.

కిషోర్ టెన్షన్‌గా మొహం పెట్టాడు.


'నేను సాల్వ్ చేసేదేంటో నా బొంద...' అనుకున్నాడు.

"లేదే! వాడు రాడు... వారం నుంచి ఫేస్‌బుక్‌లో లైక్‌లు కొట్టడంలేదు...నాలుగు రోజుల నుంచి వాట్సప్‌లో మెసేజ్‌లు లేవు. నా మెసేజ్‌కి రెస్పాన్స్ లేదు. రెండు రోజుల నుంచి ఫోన్ ఎత్తడంలేదు. నిన్నటి నుంచి కాల్ కట్ చేస్తున్నాడు. వాడు ఇంకెవరితోనో తిరుగుతున్నాడు. నాకర్థమైపోయింది." అంటూ ఏడ్చింది మదాలస.

"డైహార్డ్ సినిమాలో హ్యాకింగ్ అపరేషన్‌లా నెట్‌వర్క్ ఒక్కొక్కటి తెగిపోయిందన్నమాట!" అన్నాడు కిషోర్.

కోపంగా చూసింది స్వాతి.

తల దించుకున్నాడు కిషోర్. **(సశేషం)**




***అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం (మే,22) సందర్భంగా, తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖ, రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సంయుక్తంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ కార్టూన్ పోటీలో ప్రథమ బహుమతి పొందిన కార్టూన్. కార్టూనిస్ట్-ఎమ్.రాము, బందారులంక***




నా జీవిత సహచరి ఉద్దగిరి శ్రీదుర్గకి


జన్మదిన శుభాకాంక్షలు


-బాలాజి


Life member Scheme


# కార్టూన్లు


ఒరేయ్.. ఎగ్జామ్స్‌లో చదవకనే కాపీకొట్టి రాసే వాడినని... ఇప్పుడు కరోనాలో ఆ అవసరం కూడా లేకుండా పాసై పోతున్నా... హ్హ..హ్హ..


ఛీ.. వీడి బతుకు చెడ..! మొన్న 'మా టీవీ'లో ఒకామెను చేసుకున్నాడు,
ఈరోజు 'ఈ టీవీ'లో ఒకామెనుచేసుకొని, ఇంకోకామెనుంచుకున్నాడు.
రేపెవర్ని పెళ్లాడతాడో..? ఎందర్నివుంచుకుంటాడో..ఎదవ..?!!


లాఫింగ్ క్లబ్ అంటే ఇదా...!?
LAUGHING CLUB


తక్కువ తక్కువ ఎక్కువ సార్లు తినడం అంటే ఇలా కాదేమో!? అత్తయ్యా!!


సంబంధం తెచ్చావు బాగుంది. ఫోటో ఇలాంటిది తెస్తే అమ్మాయి ముఖం ఎలా ఉందో తెల్సి చచ్చేది ఎలా!!


అప్పుడెప్పుడో దిష్టి బొమ్మను చూస్తే బాగా కలిసొచ్చిందని
రోజూ ఈ దణ్ణాలేమిటండీ బాబూ ?

# హాస్యానందం నిర్వహించిన ముళ్లపూడి సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో బహుమతి పొందిన కథల అనుబంధం



**ము**ళ్ళపూడి వెంకటరమణ గారి పుట్టిన రోజు సందర్భంగా కథల పోటీ పెట్టాలని నేను, బ్నింగారు అనుకున్నాం.

ఇంకా అక్కడి నుంచి హాస్యానందం రాము గారికి ఫోన్ చేయడం... రాముగారు ఆనం దంగా చేద్దామని అంగీకరించడం జరిగింది.

పోటీకి వచ్చిన రెండు వందల కథలు నేను కూడా చదివాను.

అన్నీ బాగున్నాయి అనిపించింది. ఇలా లాభం లేదని... ముళ్ళపూడి వారి రచనల మీద పీహెచ్‌డి చేసిన డా॥సి.హెచ్. సుశీలమ్మ గారిని న్యాయనిర్ణేతగా అభ్యర్థించాం.

పది కథలూ అనుకున్నది ఆమె 15 కథలు బాగున్నాయి అన్నారు.

అలాగే పదిహేను కథలకి గౌరవ పారితోషికం ఇద్దామని అన్నాను.

అందుకు ఆనందంలో వున్న బ్నిం తో... ఈ కథలకి నువ్వే బొమ్మలు వెయ్యాలని ఒప్పించాను... ఈ ఐడియా మాత్రం హాస్యానందం రాము గారిదే.

రాము గారికి, సుశీలమ్మ గారికి, రచయితలకి, చిత్రకారునికి కృతజ్ఞతలు.

**-ఏ.వి.కృష్ణమూర్తి,**
**నిర్వాహకులు**

**శ్రీ**ముళ్లపూడి వెంకటరమణ గారి రచనలపై పరిశోధన చేశానన్న అభిమానంతో మీరు హాస్య కథల పోటీకి నన్ను న్యాయ నిర్ణేతగా ఉండమని అడిగినందుకు చాలా సంతోషం.

కథల పట్ల, ముఖ్యంగా హాస్య కథల పట్ల నాకున్న ఆసక్తి వల్ల నేను అంగీకరించాను.

నేను వచ్చిన రెండు వందల పైచిలుకు కథలు చాలా ఇష్టపూర్వకంగా చదివాను... వాటిలో కొన్ని హాస్యమే లేక పూర్తిగా సీరియస్ కథలు. కొన్ని అయితే అర్థం లేకుండా ఏవో ప్రకటనల మాదిరిగా ఉన్నాయి.

అయితే నిర్దేశించిన పరిధిని మించి పేజీల సంఖ్య పరిగణనలోకి తీసుకోకుండా ప్రవాహంగా సాగించిన రచనలు బాగున్నా, వాటిని ఎంపిక చేయటానికి వీలు కాక పోయింది.

ఈ పోటీలు, రచయితలను ప్రోత్సహిస్తూ వాళ్లని రచన వైపు కొనసాగించేలా చేయటం, చాలా మంచి పని.

ముఖ్యంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఇలా వర్గ భేదాలు లేకుండా బాగున్న కథల రచయితల అందరికీ ఇవ్వదలచిన పారితోషికాన్ని విభజించి అందించటం కొత్త ప్రక్రియగా భావిస్తున్నాను. ఈ విషయంలో సంపాదకుల నిర్ణయానికి సంతోషిస్తూ అభినందిస్తున్నాను.

నా అభిరుచికి తగిన పని నేను చేసినందుకు ఆనందిస్తున్నాను.

ఈ అవకాశం నాకు ఇచ్చిన సంపాదక మండలికి ధన్యవాదాలు.

**-డా॥ సుశీల**
**న్యాయనిర్ణేత**

**తె**లుగువారి అభిమాన రచయిత శ్రీ ముళ్లపూడి వెంకటరమణగారి పుట్టిన్రోజు జూన్ 28 సందర్భంగా శ్రీ ఎ.వి.కృష్ణమూర్తిగారి సౌజన్యంతో 'ముళ్ళపూడి సింగిల్ పేజీ హాస్యకథల పోటీ' హాస్యానందం నిర్వహించింది. ఈ పోటీలో పాల్గొన్న రచయితలకు అభినందనలు మరియు బహుమతి పొందిన రచయితలకు శుభాకాంక్షలు. నిర్వహకులు శ్రీ ఎ.వి.కృష్ణమూర్తి గారికి, న్యాయనిర్ణేతగా వ్యవహరించిన శ్రీమతి డా॥ సుశీలగారికి, ఎంపికైన కథలు, ప్రచురణలో మరింత అందాన్ని సంతరింపజేసిన బొమ్మలు వేసిన హాస్యానందం 'ఫుల్‌పిల్లర్' శ్రీబ్నింగారికి కృతజ్ఞతలు. **-సంపాదకులు**

## బహుమతి పొందిన కథలు

✦ నట్టింట్లో నెట్టు చదువులు ✦ సూపర్ హిట్ 'కథ' ✦ సర్వెంట్ మెయిడ్ ✦ లెక్క సమం
✦ ఇదేం న్యాయం ✦ ఎందరో మహానుభావులు! ✦ పాదయాత్ర ✦ ఓ జుట్టు కథ ✦ ఇదేం న్యాయం
✦ పేరులో ఏముంది! ✦ మాయింటికి రారండోయ్ ✦ కోమలరావు ✦ బెడ్‌రూమ్‌లో బెర్ముడా ట్రయాంగిల్
✦ గ్రాండ్ ట్రంక్ ✦ అమ్మ నా పెళ్ళమా! ✦ లాక్‌డౌన్




# నట్టింట్లో నెట్టు చదువులు

కలవల గిరిజా రాణి,
9959948223

**"రాధా!** కడుపుబ్బిపోతోంది... అర్జంటుగా వాష్‌రూమ్ కి వెళ్ళాలి. ఈ బెడ్‌రూమ్‌లో చిన్నూగాడు, ఆ బెడ్రూమ్‌లో ఈష ఇద్దరూ చెరో కంప్యూటర్ లో ఆన్‌లైన్ క్లాస్‌లోనూ... హాల్లో అమ్మ, తన భాగవతం గ్రూపులో జూమ్ మీటింగ్లో ఉంది.నా ఖర్మ కాలి అన్ని కెమెరాలూ సరిగ్గా బాత్‌రూమ్‌కి ఎదురుగా కనపడుతున్నాయి. అటేపు వెళ్ళానంటే ఎదురుగా కనపడిపోతానే. ఇప్పుడెలా?" అన్నాడు గోపాలం.

"ఇందాకా నేను ఆ కెమెరా కంటపడకుండా నేలమీద పాక్కుంటూ వెళ్ళాను. మీరూ అలాగో లేకపోతే గోడకి వీపు రాసుకుంటూనో, ఆనుకుంటూనో గబుక్కున వెళ్లి పనికానిచ్చుకురండి. ఇంకా మూడు గంటలుంటాయి ఆ క్లాస్‌లు. ఎంతసేపుంటారు అలా?"

" ఆఁ... మొన్న టవల్ కట్టుకుని అటు వెడుతోంటే చిన్నూగాడి ఫ్రెండ్స్ చూసి.. నవ్వారట... అప్పటినుంచి ఆ రూమ్ లోకే రావద్దని వార్నింగ్ ఇచ్చాడు." అన్నాడు.

"మరి అలా కౌపీనంతో వెడితే నవ్వరా మరి? ఆ మాత్రం ఆలోచన లేకపోతే ఎలా? ఇంతకీ పిల్లలేనా?... లేక ఆ టీచర్ కూడా చూసిందా?"

" ఏమో! మరి రేపు అడిగి కనుక్కుంటాలే! ఇప్పటి సంగతి చూడు!" మెలికలు తిరిగిపోతూ అన్నాడు గోపాలం.

ఈష రూమ్‌లో నుంచి పకపకా నవ్వులు వినపడడంతో రాధ–

"ఏంటి ఈషా ఆ నవ్వులూ?" అంది.

"మమ్మీ! ఇక్కడ చూడు... చిత్ర వాళ్ళ తమ్ముడు ఇక్కడేం చేస్తున్నాడో... ఓన్లీ డైపర్ వేసుకుని డాన్స్ చేస్తున్నాడు. మేడమ్ , చిత్రని అరుస్తున్నారు... వాడిని అక్కడ నుంచి పంపేయమని. అయినా వాడు వినిపించుకోవడం లేదని చిత్ర వాడిని కొడుతోంది"అంటోంటే... రాధ కూడా ఆ కెమెరా ఆన్‌లోనే ఉందనే సంగతి మర్చిపోయి, తలకి హెన్నా వేసుకుంటూ చేతిలో హెన్నా గిన్నెతోనే వచ్చి చూడసాగింది.

ఇక పిల్లలందరితోపాటు టీచర్ కూడా రాధ అవతారం చూసి పగలబడి నవ్వులు.

సిగ్గుతో గబుక్కున బయటకి వచ్చింది రాధ.

ఇంతలో స్నేహితురాలు ఉమ దగ్గర నుంచి ఫోన్... కుశల సమాచారాలు అవగానే సంభాషణ పిల్లల చదువుల మీదకి మళ్ళింది.



"అబ్బబ్బబ్బబ్బా!!! వీళ్ల ఆన్ లైన్ చదువులు కాదు కానీ ఓ పెద్ద ప్రహసనం గా ఉంది. ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించి, ఏడిపించుకు తింటున్నారు... స్కూళ్లు ఉన్నపుడే హాయిగా ఉండేది.. కాస్త హడావుడి అయినా, టైము ప్రకారం స్నానాలూ, టిఫిన్లూ, బాక్స్‌లు అయిపోయేవి. వాళ్ళని బయటకి తరిమేసి, హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుందికి అవకాశం ఉండేది. ఇప్పుడు లేపడానికి ఎన్ని రకాల సుప్రభాతాలు ఉన్నాయో, అన్నీ ఆలపించాక ఆఖరికి అట్లకాడ బ్రహ్మాస్త్రం ప్రయోగించాక ఫలితం కనిపిస్తుంది. ఆ తర్వాత పళ్ళ ప్రక్షాళన మమ అన్నాక.... 'హారేయ్, వంటి ప్రక్షాళనరా!' అంటే... క్లాసు అయ్యాక అంటారు.

క్లాసు రూమ్‌లో అందరూ ఒకేసారి గుడ్ మోర్నింగ్ అనేస్తే ఆ టీచరో, మేడవో, సారో.. కామన్‌గా ఒకే మోర్నింగ్, మోర్నింగ్ అనేసేవారు. ఇహ ఇక్కడ ఇప్పుడు ఒకొక్క పిల్లా, పిల్లాడూ.. గూడ్.... మో...ర్నింగ్ మే...మ్..' అంటూ రాగయుక్తంగా అధమం పదినిము షాలపైనే అవుతుంది. అవన్నీ తప్పించుకుని... ఆ పంతులమ్మగారు క్లాసు మొదలెట్టగానే, మళ్లీ మొదలు...


ఈరోజు ఏం పుస్తకాలూ?... అంటూ కొశ్చెన్లు... పాపం అప్పటికీ ఈ రోజుకి ఏవేం పుస్తకాలు రెడీగా ఉంచుకోవాలో అమ్మలకీ మెసేజులు పెడతారు ఆ టీచర్లు. మరి మనకీ బోలెడు గ్రూపులుకదా!... చీరలు, కూరలు, కిట్టీలు, ఎక్స్‌ట్రా ఎక్స్‌ట్రా.... ఆ వరద ప్రవాహాలలో ఈ టీచర్ మెసేజులు కొట్టుకుపోయింటాయి.

ఇంతలో కొంపతీసి నెట్ కాస్తా ఆఫ్ అయిపోయిందంటే, వీళ్ల మూడాఫ్ అయిపోతుంది.

వెంటనే కొంపపీకి నెట్ (పందిరి) వేసే కార్యక్రమం ఆన్ అయిపోతుంది. రోజూ ఛస్తున్నానుకో రాధా!" అంటూ తన కష్టాలన్నీ వెళ్ళబుచ్చుకుంది.

"సరేలే! రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్టుంది. మా ఇంట్లో కూడా దీనికి భిన్నంగా ఏం లేదు.

ఇన్ని బాలారిష్టాలు దాటుకుని మాస్టారు చెప్పే పాఠాల దగ్గరకి, ముక్కుతూ మూలుగుతూ పిల్లాడేమో టాబూ, పిల్లదేమో కంప్యూటరూ చెరో రూమ్ లోనూ... సినిమా డైరెక్టర్.. స్టార్ట్... రెడీ... కెమెరా ఆన్ అనగానే షూటింగ్ మొదలయినట్లు... ఒకడు గూగుల్ మీట్ అంటాడు... మరోడు ఇంకేదో మైక్రోసాఫ్ట్ టీమ్స్ అంటాడు... మొత్తం మీద బిల్ గేట్స్‌లా పెద్ద బిల్డప్‌తో మొదలెడతారు. నిద్ర మత్తు వదలక ఆవలిస్తోంటే టీచర్ తిడుతుందని కాసేపటికే కెమెరా ఆఫ్ చేయడం.



ఆన్ చేయమని టీచర్ ఓ పక్క మొత్తుకుంటూనే ఉంటారు పాపం.

'కెమెరా పనిచేయడం లేదు టీచర్! నెట్ సరిగ్గా లేదు టీచర్' అనడాలు. ఆవిడేం చెపుతోందో, వీళ్ల బుర్రకి ఏం ఎక్కుతుందో నాకైతే అనుమానమే. క్లాసురూమ్‌లో టీచర్ చూడకుండా గుసగుసలు చెప్పుకున్నట్లే.. వేలెడంత లేరు బుడతలు... మధ్య మధ్యలో క్లాస్‌మేట్స్‌తో ఛాటింగ్లూ, మెసేజులూ.. మా చిన్నూగాడు ఇంకో అడుగు ముందుకివేసి... క్లాస్ అయిపోయాక ఐపాడ్ లాగేసుకుంటామని ఈలోపులో కక్కుర్తి... వీడియో గేమ్స్ ఆడేసుకుంటూ వుంటాడు.

నాకైతే చిన్నప్పుడు స్కూల్ పుస్తకాల మధ్య నవలలు పెట్టుకుని చదువుకున్న రోజులు గుర్తొచ్చాయి. ఆ సంగతులు ఇప్పుడు బయట పెడితే... అమ్మో! చెలరేగిపోరూ వీళ్లు!"

ఆయాస పడుతూ మధ్యలో ఆపింది రాధ.

"ఇవి చాలవన్నట్టు.. ఆ ఆన్‌లైన్‌లోనే... సంగీతం, డాన్సూ, డ్రాయింగూ,కీ బోర్డూ, క్లాడింగూ, గాడిదగుడ్డూ, కంకరపీసూ... ఏ రోజు ఏ క్లాసో గుర్తుపెట్టుకోలేక అల్లాడి పోతున్నానే రాధా!...

ఇంకా నయం స్విమ్మింగ్ క్లాసులు ఎక్కడా పెట్టినట్టు లేదు. ఉండుంటే కనుక ఆ టాబ్ పట్టుకుని... వీళ్ళిద్దరూ ఈతలు కొడుతోంటే, స్విమ్మింగ్‌పూల్ గట్టు మీద నేను పరుగులు తీయాల్సివచ్చేది.

మా చంటిదానికి క్లాస్ అయేదాకా నా పని మానుకుని పక్కనే కూర్చోవాలి. హోమ్ వర్క్ ఏం రాయాలో నాకు వాట్సాప్ చేస్తారు ఆ టీచర్. అవన్నీ చూసి అవి నోట్స్‌లో ఎక్కించాలి. కళ్ళు చిట్లించుకొని చూసి చూసీ కళ్ళజోడు వచ్చేసింది. ఈ ఫోన్లు, టాబ్లూ అలవాటు మాన్పిద్దామనుకుంటే ఇప్పుడు ఇవే తప్పనిసరి అయ్యాయి...

మా ఆయనకేమో వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు కానీ... గంట గంటకి ఆ నోరు మర ఆడిస్తూనే ఉంటాడు... టిఫిన్లు, స్నాక్స్, కాఫీలు, టీలు... ఎటైనా పారిపోదా మనిపిస్తోంది..." దీర్ఘంగా నిట్టూర్చింది ఉమ.

ఇంతలో పక్క నుంచి రాధ అత్తగారు–

"అమ్మాయ్, రాధా! ఈ భాగవతం జూమ్ మీటింగ్ అయిపోయిందమ్మా! తర్వాత లలితా సహస్ర నామంకి... ఇదిగో పాస్‌వర్డ్.. కోడ్ నెంబర్ పంపారు... ఇది కాస్త కొట్టమ్మా!... చెప్పడం మర్చిపోయా! ఇప్పుడు కొత్తగా జూమ్ చీరలని వస్తున్నాయట. సుమతి గారు ఇప్పుడే చెప్పారు... కొంగు కనపడేవరకూ జరీ బోర్డర్ భారిగా ఉంటుందట... మిగతా చీరంతా మామూలుగా ఉంటుంది. ఖరీదు సగానికి సగమేఅట. ఆన్‌లైన్‌లో చూసి నాలుగు చీరలు తెప్పించు. రోజూ ఈ జూమ్‌లలో కట్టినవే కట్టాలంటే విసుగ్గా ఉందమ్మాయ్!" అంటూ పిలవడంతో...

"వినపడిందా ఉమా!... ఈ లాక్ డౌన్ పూర్తిగా ఎత్తేసి... స్కూళ్ళు, ఆఫీసులు తెరిచే దాకా మన మధ్య ఈ ఆన్‌లైన్ కబుర్లు తప్ప ఇక వేరేవి ఏవీ ఉండవుగాక ఉండవు! మా అత్తగారికి జూమ్ కోడ్ నెంబర్ కొట్టాలిక... ఉంటా! బై!!" అంటూ రాధ ఆన్‌లైన్ డ్యూటిలోకి దిగింది.




- ✦ నిద్ర పోతున్న ఊరిని మనం మేలుకొలపాలి. ఊరి చెవులు, కళ్ళు, నోరు మేలుకోవాలి. ఆ తరవాత పని ఊరే చక్కపెట్టుకుంటుంది.
- ✦ మేలుకున్న ఊరు దేవుడి విశ్వరూపం లాటిది. దేవుడినెవరూ శాసించలేరు.
- ✦ ధర్మాన్ని తొక్కేవాళ్ళు ఇంతవరకూ పుట్టలేదు. అధర్మం తలెత్తినప్పుడల్లా ధర్మదేవత పాదం దాన్ని అణిచివేస్తుంది. రావణుడు పుడితే రాముడు ఎప్పుడూ వస్తాడు.
- ✦ జీవితంలో చాలామందికి దొరికిన బొమ్మలు నచ్చవు. నచ్చిన బొమ్మలు దొరకవు. ప్రేమ కథలన్నీ ఇంతే.
- ✦ డబ్బుతో చాలా కొనచ్చు గాని అన్నీ కొనలేం. ఒక్కొక్కప్పుడు పుట్టెడు డబ్బు పట్టెడన్నం పెట్ట లేదు.
- ✦ చీకట్లో దీపానికి అసలు పేరేమిటో తెలుసా? ఆశ ! హోప్ !




# సూపర్ హిట్ 'కథ'

పేట యుగంధర్,
9492571731

రియలెస్టేట్ ద్వారా కోట్లు సంపాయించిన గౌరీశంకరానికి సినిమాలంటే విపరీతమైన పిచ్చి. మంచి 'కథ'తో సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టి, సక్సెస్‌ఫుల్ నిర్మాతగా పేరు తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

తనకున్న పలుకుబడితో స్టార్ హీరో 'గిగాస్టార్ గంగాధర్' గారి డేట్లను దొరకబుచ్చుకున్నాడు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న దొరబాబుగారు, గిగాస్టార్ గారిని డైరెక్ట్ చెయ్యడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.

హీరోగారు, డైరెక్టర్‌గారు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో నలభైఎనిమిది గంటలు గడవక ముందే ఇరవైనాలుగు క్రాఫ్ట్సుకు కావాల్సిన అతిరథ మహారథుల కాల్షీట్లు కూడా సంపాదించగలిగాడు గౌరీశంకరం.

అప్పటికే కమిట్ అయిన తమ తమ సినిమాలతో బిజీగా ఉండడం మూలాన కొంత కాలం తరువాత ఉన్నట్టుండి ఒకరోజు సినిమా గురించి అనౌన్స్ చేయడానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా గౌరీశంకరానికి కబురు పంపారు గిగాస్టార్ గంగాధర్.

"కథ లేకుండా నటీనటులను, టెక్నీషియన్లను బుక్ చేయడం ఏంటో!... ప్రెస్ మీట్ పెట్టిసినిమా గురించి అనౌన్స్ చెయ్యడం ఏంటో..." అంటూ తనలో తానే మధన పడ్డాడు గౌరీశంకరం.

అనుకున్నట్టే సాయంత్రం ఆరు గంటలకు స్టార్ హోటల్లో ప్రెస్‌మీట్ మొదలైంది.

ముందుగా డైరెక్టర్ దొరబాబు మైక్ అందుకొన్నాడు– "గిగాస్టార్ గంగాధర్‌గారిని దృష్టిలో పెట్టుకొని ఈ కథను తయారుచేశాను. సింగిల్ సిట్టింగ్లోనే హీరోగారు ఈ కథను ఒకే చేశారు." అంటూ గొప్పగా చెప్పాడు.

"బాలీవుడ్లో కూడా ఇప్పటివరకూ ఇలాంటి కథతో సినిమా రాలేదు. అంతటి గొప్ప కథతో తీసే సినిమాలో నాకు అవకాశం రావడం నా అదృష్టం." వచ్చీ రాని తెలుగులో వయ్యారంగా చెప్పింది హీరోయిన్.

"కథ విన్నాక... కథకు సరిపడే ట్యూన్లు వాటంతట అవే తన్నుకొచ్చాయి." ఆవేశంగా అన్నాడు సంగీత దర్శకుడు.

"డైరెక్టర్ చెప్పిన కథ విని చాలా ఎగ్జైట్ అయ్యాను. ఈ కథ ఒక ట్రెండ్ సెట్టర్ అవుతుంది. సినిమా తప్పకుండా 'ఇండస్ట్రీ రికార్డు'లను తిరగరాస్తుంది." అంటూ ఆత్మవిశ్వాసంతో ముగించాడు గిగాస్టార్.



ప్రెస్‌మీట్లో తనకు మాట్లాడే అవకాశం రాకున్నా తను నిర్మించబోతున్న సినిమా గురించి వారందరూ చెప్పిన గొప్పలు విని గౌరీశంకరం ఉబ్బితబ్బిబ్బైపోయాడు. ఆ కథేమిటో తనకు కూడా చెప్పాల్సిందేనంటూ డైరెక్టర్‌ను బతిమలాడాడు.

గౌరీశంకరాన్ని చూసి దొరబాబు చిన్నగా నవ్వి– "కథ ఇంకా ఫైనలైజ్ కాలేదు. ప్రస్తుతం నా అసిస్టెంట్లు అందరూ కథ మీదే కసరత్తు చేస్తున్నారు." అంటూ హాలీవుడ్ సినిమాలను మార్చి మార్చి చూస్తున్న తన అసిస్టెంట్లను చూపించాడు.

"ప్రెస్‌మీట్‌లో మీరందరూ పోటీపడి మరీ 'గొప్ప కథ' అంటూ కోతలు కోశారు?"

"అదే అసలైన ప్రమోషన్ టెక్నిక్" కన్ను గీటుతూ చెప్పాడు డైరెక్టర్.

నిరాశతో వెనుతిరుగుతున్న గౌరీశంకరాన్ని ఆపి– "నెక్ట్ వీక్ నుండి మనం షూటింగ్ మొదలుపెడుతున్నాం. ఆ ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూసుకోండి." అన్నాడు.

"కథ లేకుండా షూటింగ్ ఏంటి?" మనసులోనే అనుకొన్నప్పటికీ పైకి వినిపించేటంత గట్టిగానే అనేసాడు గౌరీశంకరం.

"ఏ సినిమాకైనా ఆరు పాటలు, నాలుగు ఫైట్లు, ఒక కామెడీ ట్రాకు ఉండాల్సిందే కదా! ముందుగా వాటిని షూట్ చేద్దాం. ఈ లోగా ఏదో ఒక కథ దొరక్కపోదు!" నమ్మకంగా చెప్పాడు డైరెక్టర్.

అనుకున్నట్టే షూటింగ్ మొదలైంది. కథ తెలుసుకోవాలన్న కుతూహలం ఎప్పటికప్పుడు వ్యక్తపరిచినప్పటికీ కథేమిటన్నది గౌరీశంకరానికి ఎవ్వరూ చెప్పనే లేదు. ఆర్నెల్లలో సినిమా పూర్తై ప్రపంచ వ్యాప్తంగా రిలీజయ్యింది.

"అద్భుతమైన కథ... అత్యద్భుతమైన సినిమా" అంటూ విమర్శకులు సైతం ప్రశంసించారు.

కానీ సినిమా చూసిన గౌరీశంకరం మాత్రం కథేమిటో అర్థం కాక తల గోక్కున్నాడు. గుడ్డిలో మెల్లలా 'మంచికథ'తో సినిమా తీయలేక పోయానన్న బాధ ఉన్నప్పటికీ, 'సూపర్ హిట్' సినిమా తీయగలిగినందుకు కాస్తో కూస్తో సంతోషపడ్డాడు గౌరీశంకరం.

ముళ్లపూడి హాస్యకథల పోటీలో **1000 రూపాయలు** బహుమతి పొందిన కథ

# సర్వెంట్ మెయిడ్

బలభద్రపాత్రుని ఉదయ శంకర్,
9494536524

**“మొ**గుడు, పెళ్ళాలు సమానమే కానీ... మొగుడు కొంచెం ఎక్కువ సమానమని మీరేగా అన్నారు... ఇంటిపనిలో కొంచెం ఎక్కువ సాయం చేయండి చాలు. నేనా లెక్చరర్ ఉద్యోగంలో చేరుతాను!” అంది మంజుల.

తన మాటలు తనకే చెప్తున్న పెళ్ళాంకేసి గుడ్లప్పగించి చూస్తూ–“వాడిచ్చే పదివేల కోసం నువ్వు చెప్పే పాఠాలు... నాకు గుణపాఠాలు అవుతాయి మంజూ!” దీనంగా అన్నాడు మోహన్, రాబోయే ప్రమాదాన్ని పసిగడుతూ.

“నాకు తెలుసు. మీరు తప్పించుకోవటంలోనే ఎక్కువ సమానమని! అందుకే పని మనిషిని చూడమని మా అమ్మకు చెప్పాను!” అలా అంది కానీ ఆమెకు తెలుసు ఇరవై వేల జీతం కోసం భర్త రోజంతా కష్టపడతాడని.

పెరట్లో బట్టలు ఆరేస్తున్న మంజుల, హఠాత్తుగా తన ముందు ప్రత్యక్షమైన స్త్రీని చూసి–


“ఎ..ఎ..ఎవరు?” అంది ఉలిక్కిపడి.

ఆమె దర్పంగా చూస్తూ “సర్వెంట్ మెయిడ్ కావాలన్నారట?” అంది.

ఎరుపు రంగు షిఫాన్ చీర, వైడ్ నెక్ బ్లౌజ్, పోనీ టైల్లో నాజూగ్గా ఉన్న ఆమెనే చూస్తూ – “అవునండీ. మీకు తెలిసిన వాళ్ళున్నారా?” అంది చీర సర్దుకుంటూ.

ఆమె పెద్దగా నవ్వి “ఆ సర్వెంట్ మెయిడ్ నేనే. నా పేరు స్మిత” అని గాగుల్స్ తుడుచుకుంటూ “చెప్పండి. ఏయే పన్లు చేయాలి? ఎంతమందికి చేయాలి? చుట్టాలెక్కువ వస్తుంటారా? వాషింగ్ మెషిన్ ఉందా?” అంటూ ప్రశ్నలతో దాడి చేసింది.

ఆ ధాటికి తత్తరపడిన మంజుల– “మేము నలుగురం... మాకిద్దరు... మొత్తం ఇద్దరం...” అని, వెంటనే సర్దుకుని “ఛా..! మేమిద్దరం, మాకు నలుగురు” అని, నెత్తి మీద కొట్టుకుని “ఛీ! కాదు...కాదు...మేము ఇద్దరం, మాకిద్దరు” అని గబగబా చెప్పేసింది.



మంజుల తొట్రుపాటు చూసి ‘ఆ మాత్రం భయం ఉండాలి’ అని నవ్వుకుంది స్మిత.

ప్రశ్నల పరంపరలో రెండో రౌండు మొదలైంది... “సార్ ఏం చేస్తుంటారు? ఆయన జీతం ఎంత? మీరు కూడా జాబ్ చేస్తున్నారా? లేక హోమ్ మేకరా?” అని స్మిత చకచకా అడుగుతుంటే మంజుల ఈసారి జాగ్రత్తగా క్విజ్ రాపిడ్ రౌండులో ఆన్సర్లు చెప్పినట్లు టకటకా చెప్పేసింది.

స్మిత ఐఫోన్ చూసుకుంటూ– “మీ వర్క్ ఉదయం ఐదు, ఆరు గంటల మధ్య చేస్తాను. మనిషికి నెలకు రెండు వేలు చొప్పున, నలుగురికి ఎనిమిది వేలివ్వాలి... ఓ నెల జీతం అడ్వాన్స్ ఇవ్వాలి. ఏడాదికి రెండు కొత్త చీరలు పెట్టాలి. నెలకు రెండు లీవులు తీసుకుంటాను. సండేస్ రాను!” అంది నిక్కచ్చిగా.

నోరు తెరిచి అలా చూస్తుండి పోయిన మంజుల మొఖం మీద చిటికె వేసి– “అలా అయిపోయారేంటి మేడమ్?” అంది స్మిత.

మంజులకు మైండ్ బ్లాక్ అయింది.

“మరీ అంత పొద్దున్నే అంటే ఎలాని ఆలోచిస్తున్నాను” అంది తడారిపోయిన గొంతుతో.

టీవీలో యాంకర్లా ముంగురుల్ని సుతారంగా వెనక్కి తోసుకుంటూ, “టైమ్ స్లాట్స్ ఖాళీ లేవు మేడమ్! ఇప్పటికే ఐదు కొంపల్లో చేస్తున్నాను!” అంది నిర్లక్ష్యంగా.

అయోమయంగా చూస్తున్న మంజులతో “మీరు ఓకే అనుకుంటే నాకో రింగివ్వండి!” అని తన విజిటింగ్ కార్డ్ ఇచ్చి, హోండా యాక్టివా వైపు వెళ్ళింది స్మిత.

ఆ రాత్రి మోహన్ అడిగాడు– “పనిమనిషి కుదిరినట్టేగా! రేపు జాయిన్ అవుతావా?” అని. మంజుల నవ్వుతూ “మనుషులందరూ సమానమే కానీ, పని మనుషులు కొంచెం ఎక్కువ సమానం. నాకు కూడా ఓ నాలుగిళ్ళు చూసి పెట్టండి. రోజూ నాలుగ్గంటలు పని చేసుకొని, కాలేజీ వాళ్ళు ఇచ్చే దానికన్నా ఎక్కువే సంపాదిస్తాను దర్జాగా!” అంది కన్ను కొడుతూ.

మంజుల– ఎమ్మే, ఎమ్ఈడీ వంక పిచ్చెక్కినట్టు చూసి కుర్చీలో కూలబడ్డాడు, మోహన్– ఎమ్మెస్సీ, ఎంఫిల్.

ముళ్లపూడి హాస్యకథల పోటీలో 1000 రూపాయలు బహుమతి పొందిన కథ

# లెక్క సమం

గంగాధర్ వడ్లమన్నాటి,
9908445969

**కా**రు డ్రైవరు గన్నారావ్, అన్నవరం బస్ స్టాప్ దగ్గర కారు ఆపి...

"విశాఖపట్నం... విశాఖపట్నం... విశాఖ పట్నం..." అంటూ ఇన్నోవా కారులోంచి జోరుగా అరుస్తున్నాడు.

అప్పటికి రాత్రి పది దాటింది.

ఆ అరుపు వింటూనే పరుగున వచ్చిన మధు– "విశాఖపట్నం అని నొక్కి మరీ అరుస్తున్నావ్ సరే, కానీ విశాఖలో ఎక్కడిదాకా వెళ్తావో అది కక్కు ముందు!..." అడిగాడు డ్రైవరుని.

"కాంప్లెక్స్ సార్! రెండు వందల యాభై అవుద్ది!"

"విశాలాక్షి నగర్ వరకూ వస్తావా? ఎక్కువ చార్జి ఇస్తాను!"

"చస్తే రాను! మొన్న ఇక్కడికే...ఇక్కడికే అని ఒకతను, సందుగొందుల్లోకి తీసుకెళ్ళాడు. దాంతో వచ్చేప్పుడు దారితప్పి, తిరిగి హైవే పట్టుకోడానికి తల బొప్పి కట్టింది. కనుక అందర్నీ కాంప్లెక్స్ దగ్గర దించేసి, నేను పోస్టాఫీస్ సెంటర్‌కి వెళ్ళిపోతాను. మా ఇల్లు అక్కడే లెండి" చెప్పాడు విసుగ్గా.

"సరే" అని ఎక్కి కూర్చున్నాడు. అప్పటికే లోన ముగ్గురు పాసింజెర్లు ఉన్నారు. కారు ముందుకు కదిలింది. రోడ్ మీద ఎవరైనా బ్యాగులతో కనపడ్డమే ఆలస్యం... స్పీకర్ మింగినట్టు "విశాఖపట్నం...విశాఖపట్నం..." అంటూ బిగ్గరగా అరుస్తున్నాడు డ్రైవరు.

మధు అతని పక్కనే కూర్చున్నాడేమో, ఆ అరుపులకి చెవులు గళ్ళు పడిపోతున్నై.

కారు స్లో చేసి, డ్రైవరు అరవడానికి సిద్ధ పడుతుండగానే, "అమ్మబాబోయ్ అరవబోతున్నాడు" అని చేతులతో చెవులు మూసుకునే వాడు మధు.

కొంచెం ముందుకు వెళ్ళగానే ఇద్దరు చేతు లూపి కారు ఆపారు.

విశాఖపట్నం అని వారు చెప్పగానే, కప్పులా నోరు తెరిచి, "అలాగా!ఎక్కండి సార్ ఎక్కండి" అన్నాడు డ్రైవరు ఉత్సాహంగా.


వారు ఎక్కగానే కొంచెం మందు వాసన వచ్చింది.

ఆ తరువాత,"ఏవిటయ్యా డ్రైవరు ఇది, మేం ఏవైనా ఓసీగా ఎక్కావా ఏంటి? కార్లో ఏ.సి లేదు. పాటలు కూడా పెట్టలేదు. ఇలాగైతే ఇక ప్రయాణం సునాయాసంగా ఎలా చేస్తాం? విశాఖ కంటే ముందు విసుగొచ్చేస్తుంది..." అన్నాడు ఆ ఇద్దరిలో ఒకడు.

"అవున్రా! కనీసం మాట కలుపుదామను కుంటే ఓ అందమైన భామని కూడా ఎక్కించ లేదు మనోడు. అందరూ ఎక్స్‌పైయిరీ డేట్‌కి దగ్గరైన వాళ్ళే. ముసలి కంపు!" అన్నాడు రెండో వాడు ముక్కు మూసుకుని కక్కుకోబోతూ.

"అలా అనకండి సార్! భామ లేకపోతే ఏం, బామ్మ గారితో మాట కలపండి సార్! విలువైన విషయాలు చెబుతారు!"

"ఏం వద్దు!... ఆవిడని చూస్తేనే నాకేదో భయంగా ఉంది. ఆ ముసలావిడకి మమ్మల్ని



మసాలా వడల్లా ఎరేయాలని చూస్తున్నావా?" చెప్పి ఆ ముసలావిడకి దూరం జరిగి...

"ఇదిగో డ్రైవరు! దార్లో ఎవరైనా భామ కనబడితే ఆపి ఎక్కించవోయ్!" అన్నాడు ఇద్దరిలో మొదటివాడు.

"కార్లో ఖాళీ లేదు కదా సార్!" చెప్పాడు డ్రైవరు అసహనంగా.

"బామ్మ గారిని డిక్కీలో పెడదాంలే..." అన్నాడు హి...హి... హి... అని నవ్వేస్తూ.

ఇలా వాళ్ళిద్దరూ ఎక్కినప్పటినుండీ నసతో కసిగా విసిగిస్తున్నారు.

దాంతో అందరూ విసిగిపోయారు.

ఇంతలో మధు–

"ఏవిటీ ఉన్నట్టుండి ఇంజన్ అరిగినట్టు గరగరమని శబ్దం వస్తోంది?" అడిగాడు డ్రైవరుని.

"అది ఇంజన్ శబ్దం కాదు సార్! నేనే అసహనంతో పళ్ళు కొరుకుతున్నాను!" చెప్పాడు.

దాంతో విషయం గ్రహించి... వారిని నెమ్మదిగా వారించే ప్రయత్నం చేసినా ఏం ప్రయోజనం లేకుండా పోయింది.

చివరికి విసిగిపోయిన మధు, కారు ఆపమని దిగాడు.

"అన్నవరం నుండి చూస్తున్నా! ఇపుడు గాజువాక. ఇక నాకు సహనం లేదు!" అని వాళ్ళిద్దరినీ కిందకి దిగమన్నాడు.

వారిని మూడు తిట్లు తిట్టి, రెండు చెంప దెబ్బలు కొట్టి, ఓ నీతి చెప్పి, కారెక్కి పోనిమ్మన్నాడు.

డ్రైవర్ ముఖంలో ఓ తృప్తి.

మిగతా ప్రయాణికులు కూడా మంచి పని చేశారని అభినందించారు.

మధు విశాఖ కాంప్లెక్స్ దగ్గర కారు దిగి పోయాడు. తర్వాత, రింగవుతున్న ఫోన్ లిఫ్ట్ చేసాడు.

"ఏంట్రా! ఈ సారి మరీ గట్టిగా కొట్టేసావ్"అడిగాడు ఇందాక చెంప దెబ్బలు తిన్న వాళ్ళలో ఒకడు.

"కొత్తగా అడుగుతావేంటి? ప్రతిసారి లానే మీకు ఈసారి కూడా డబ్బులు మిగిల్చానని సంతోషపడు. నా వాటా ఫోన్ పే చెయి!" ఫోన్ పెట్టేసాడు మధు.


ఇల్లు చేరిన డ్రైవరు, కార్ ఆపి దిగబోతూ...

"అరె! అతని పర్సు కారులో పడేసుకున్నాడే!.." అని క్షణం ఆలోచించి... "అయినా ఆ ఇద్దరిని పేద్ద మొన గాడిలా మధ్యలోనే దించేసాడు. ఆ నష్టం... ఇలా కలిసొచ్చిందనుకుంటాను" ఆ పర్సుతో కారు దిగా డతను.

ముళ్లపూడి హాస్యకథల పోటీలో **1000 రూపాయలు** బహుమతి పొందిన కథ

# ఇదేం న్యాయం

బుద్ధవరపు కామేశ్వరరావు,
9848047322



**"నే**ను ఉదయం లేవగానే గదులన్నీ శుభ్రంగా ఊడ్చేస్తాను."

"నేను ఊడ్చను."

"తర్వాత వంటింట్లోకి వెళ్లి రాత్రి మిగిలిన అంట్లు అన్నీ తోమేస్తాను."

"నేను తోమను."

"ఆ తరువాత మా నలుగురికీ ఉదయం టిఫిన్ రెడీ చేసేస్తాను."

"నేను చేయను!"

"అందరి బట్టలు శుభ్రంగా వాషింగ్ మెషిన్ లో వేసేస్తాను."

"నేను వేయను!"

"తర్వాత... మా అందరికీ మధ్యాహ్నం భోజనం వండేస్తాను."

"నేను వండను!"

"మా నలుగురికీ కూడా వాటర్ బాటిల్స్ అలాగే కేరేజీలు సర్దేస్తాను."

"నేను సర్దను!"

"తరువాత... ఉతికిన అందరి బట్టలు ఎండలో ఆరబెట్టేస్తా"

"నేను పెట్టను!"

"సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే ఆ ఎండిన బట్టలన్నీ తీసేస్తా!"

"నేను తీయను!"

"మళ్ళీ... రాత్రి భోజనాలకు కావలసిన ఏర్పాట్లు చూస్తాను."

"నేను చూడను!"

"నువ్వు నిజంగా అదృష్టవంతురాలివే చెల్లాయ్... అన్ని పనులు చేసే భర్త దొరికాడు!"

"ఔను! అది నిజమే! నీదే దురదృష్టం! నీకు అలాంటి భార్య దొరకలేదురా అన్నాయ్!"

"ప్చ్!!!"

ముళ్ళపూడి హాస్యకథల పోటీలో 1000 రూపాయలు బహుమతి పొందిన కథ

# ఎందరో మహానుభావులు!


డాక్టర్ ఎమ్. సుగుణ రావు,
9704677930

**అ**ది 2019 వ సంవత్సరం, ఫిబ్రవరి నెల. తమ అపార్ట్‌మెంట్ పక్కనే ఉన్న కూరగాయల దుకాణం ముందు నుంచున్నాడు ఆదినారాయణ.

ఆరోజు ఉదయమే తీసుకొచ్చినట్టున్నాయి కూరలు. అయినా ఏదో సందేహం! ఆ కూరగాయలు అమ్మే వ్యక్తి మాత్రం చెమటలు కక్కుతున్నాడు. మనిషి స్నానం చేసినట్టు లేదు. కూర గాయలు తాజాగా ఉన్నా అతను తాజాగా లేదు. కొంచెం దూరంలో ఒక షాపింగ్ మాల్ వుంది.

అక్కడ అంతా శుభ్రంగా వుంటుంది. మనుషులతో పాటు పరిసరాలు. అయినా టైము లేదు. భార్య కుముదవల్లి అతడిని అత్యవసరంగా కూరగాయలు తెమ్మని పంపింది. భార్య మాటలు గుర్తుకొచ్చి కూరగాయలు ఏరడం ప్రారంభించాడు. తనకు కావలసిన మూడు రకాలు బేరమాడి, అతను తూకం వేయడం అయిన తర్వాత తన సంచీలో వేసుకున్నాడు... మొత్తం ఎనభై రూపాయలు అయింది. అతను చిల్లర ఇవ్వబోతుంటే తీసుకోకుండా క్షణం సేపు ఆలోచనలో పడ్డాడు.

చెమటతో తడిసిన అతడి చేయి, మాసిన చొక్కా జేబు లోపలికి వెళ్ళి, చిల్లర నోట్లతో బైటకు వచ్చింది.



ఆ దృశ్యం చూసిన ఆదినారాయణ– "వద్దు. నువ్వే వుంచుకో!" అన్నాడు.

ఆ షాపు వ్యక్తి ఆశ్చర్యపోతూ...

"బేరం కూడా ఆడారుకదా సార్!" అన్నాడు.

"ఫరవాలేదు!" అంటూ గబగబా అక్కడ నుంచి కదిలాడు.

"మహానుభావుడు!" అంటూ ఆ కూరగాయల ఆసామి రెండు చేతులు జోడించాడు.

అంతలో "మహానుభావుడవేరా" అనే పాట రింగ్ టోన్లా వినిపించింది. చుట్టూ చూసాడు. ఎవరూ లేరు... పాట మళ్ళీ వినబడలేదు... ముందుకు నడిచాడు. పాల పాకెట్లు అమ్మే చోటుకు వచ్చాడు.

అక్కడ ఒక ముసలాయన. జుట్టు, గడ్డం బాగా పెరిగి వున్నాయి. దగ్గుతున్నాడు. రోజూ పాల పాకెట్లు అమ్మేది వేరే వ్యక్తి.

"ఈయన ఎవరో!" అనుకుంటూ... "రెండు పాల పాకెట్లు కావాలి" అన్నాడు.

ఎదురుగా వున్న ట్రే చూపించి "తీసుకోండి" అన్నాడు ఆ పెద్దాయన. తీసుకుని సంచీలో వేసుకుని వంద రూపాయల నోటు ఇచ్చాడు. అతను చిల్లరకోసం తన పంచెకు కట్టిన గుడ్డ సంచి తీసాడు. చుట్టలు, నలిగిన పాత నోట్లు, చిల్లర డబ్బులు ఉన్నాయి. అతను లెక్కబెట్టి ఇవ్వబోతుంటే... "వద్దు! నువ్వే వుంచుకో!!" అంటూ వెను తిరిగాడు.

"మహానుభావుడు" అంటూ అతనూ నమస్కారం చేసాడు.

మళ్ళీ 'మహానుభావుడవేరా!' అనే పాట చెవి దగ్గర జోరీగలా చికాకు పెట్టింది.

చుట్టూ చూసాడు... ఎవరూ లేరు!

'ఏమిటో తనకు భ్రమ. ఆ పాట ఎవరో తన కోసం వినిపిస్తున్నట్టు. ఇదీ ఏదైనా జబ్బా! ఆలోచిస్తూనే తమ అపార్ట్‌మెంట్ గేటు దాటి ముందుకు వెళుతుంటే... "హలో ఆదినారాయణగారూ బావున్నారా?!" అంటూ ఆ అఅపార్ట్‌మెంట్లో ఉండే శంకరం పలకరిస్తూ షేక్ హేండ్ ఇవ్వబోతుంటే... రెండు చేతులూ జోడించాడు.

మళ్ళీ 'మహానుభావుడవేరా!' అనే పాట

వినిపించింది లీలగా. జుట్టు పీక్కోవాలను కున్నాడు. లిఫ్ట్ ఎక్కి నాలుగో ఫ్లోరులో వున్న తన ఇంట్లోకి వచ్చి కూలబడ్డాడు.

భార్య వచ్చి చేతిలోని సంచీ అందుకుంది.

"డాడీ" అంటూ ఐదేళ్ళ కూతురు పరిగెత్తు కుంటూ వచ్చి అతడి ఒళ్ళో కూర్చోబోయింది.

"ఆగు" బైట తిరిగొచ్చాను అనుకుంటూ, బాత్రూమ్లోకి వెళ్ళాడు. కాళ్ళు, చేతులు శుభ్రం గా కడుక్కుని వచ్చాడు.

"బాగా తలపోటుగా వుంది. కాఫీ ఇవ్వు" అన్నాడు. ఆమె కాఫీ కలుపుతుంటే తను తెచ్చిన కూరగాయలను గిన్నెలో వేసి కడగడం ప్రారంభించాడు.

"నేను కడుగుతాను" అన్న ఆమె మాటలు నోటి వరకూ వచ్చి ఆగిపోయాయి. కారణం తను కడిగినా, అతనికి సంతృప్తి వుండదు. మళ్ళీ మళ్ళీ కడుగుతాడు. అందుకే ఆమె మౌనం అయింది. ఆదినారాయణ బాల్కనీలోని ట్యాప్ దగ్గరకు వెళ్ళి మళ్ళీ కాళ్ళు, చేతులు రెండోసారి కడుక్కుంటుంటే... పాట వినిపిం చింది. అదే అదే... పదే పదే!

"నో"అంటూ గట్టిగా అరిచాడు. ఇంకా ఆ పాట వినిపిస్తూనే వుంది. అతను అరిచిన అరుపు విని ముందు అపార్ట్మెంట్ బాల్కనీలో పిల్లలు పారిపోయారు. పాట వేసింది వారే! అతను కనబడగానే ఆ పాట వినిపిస్తారు. అలా వినీ వినీ ఆ పాట చెవిలో రింగుటోన్ అయి పోయింది ఆదినారాయణకు!

భర్త అరిచిన అరుపుకు పరిగెత్తుకుంటూ వచ్చింది. అతని వంక జాలిగా చూసింది.

అతడికి అబ్సెస్సివ్ కంపల్సివ్ డిజార్డర్ వుంది. దాన్నే ఓసిడి అంటారు. ఆ మానసిక రోగం వున్నవారు రకరకాల చేష్టలు చేస్తారు. ఐతే ఆదినారాయణ మాత్రం అతి శుభ్రత పాటి స్తాడు. కడిగినవే కడుగుతాడు. చేతులైనా, పరిసరాలైనా...

అరగంట క్రితం అతను చిల్లర తీసుకో కుండా వచ్చినపుడు ఆ కూరగాయలవాడూ, పాల పాకెట్ల పెద్దాయన అతడిని మహానుభావు డవేరా! అని పొగిడారు. వారి దృష్టిలో అతను అంతే!

ఐతే ఆదినారాయణ దృష్టిలో నువ్ ఓసిడి




- కష్టమ్స్ అండ్ సుఖమ్స్... ద కాంబినేషన్ ఆఫ్ లైఫ్!
- నవ్వొచ్చినప్పుడు ఎవడేనా నవ్వుతాడు... ఏడుపొచ్చినప్పుడు కూడా నవ్వేవాడే హీరో!
- పెళ్ళంటే పాలల్లో పాలలా కలిసి పోవటం, పంచదారా కరిగిపోవటం!
- పెళ్ళంటే నమ్మకం. ఆ నమ్మకం తిరుగు లేనిది. అది దీపం లాంటిది. దానిమీద అనుమానం నీడలు పడవు.
- అసూయ ఘాటైన ప్రేమకి థర్మామీటరు.

గాడివి. మా మురికి చేతులతో చిల్లర తీసుకో లేక దానం ఇచ్చావ్ అనుకుంటారేమో అనే భావన అతడిది.

ఆలోచనల్లోంచి బైటకొచ్చి "నాకు మెంటల్ అంటావా?" అన్నాడు ఆదినారాయణ.

"ఛ! ఛ!! ఇదేం పెద్ద మానసిక రోగం కాదు. మనం డాక్టర్ని కలిసాం కదా! ఆయన కౌన్సి లింగ్ చేసారు. మందులు వాడమన్నారు... ఓసిడిలో ప్రమాదకరమైన దశలున్నాయి. మీకు అవేమీ లేవు. అతి శుభ్రత తప్ప. మెల్లగా అదే తగ్గుతుంది. ప్రశాంతంగా ఉండండి" అంది కుముదవల్లి.

అలాగే అంటూ తన గదిలోకి వెళ్ళాడు ఆది నారాయణ.

ఏదో శబ్దం అవడంతో ఆ గది కిటికీ దగ్గ రకు వెళ్ళాడు ఆదినారాయణ. కూతురు బైట బొమ్మతో ఆడుకుంటోంది.

"పాపా నీ పేరేంటి?!" కూతురు మాట్లాడ లేదు. పక్కింటి కుర్రాడు అడుగుతున్నాడు.

"పంజరంలో పసిపాప!" ఇంకో కుర్రాడు చెప్పాడు.

"అదేం పేరు?!"

పక్కింటి కుర్రాడప్పుడు "అంతే! ఈ పాప తండ్రిగారు ఈమెను అలాగే పెంచుతున్నారు అపురూపంగా, బైట తిరిగితే రోగాలు అంటు కుంటాయని!"

"నిజమా!!..." ఇంకో కుర్రాడు ఆశ్చర్య పోయాడు.

"బట్టలు ఉతకడం మనం చేస్తాం, ఈయన పచ్చనోట్లు ఉతుకుతాడు. పదిమందినీ దాటు కుని వస్తాయని!"

ఆ మాటలకు తన గదిలో టేబుల్ మీద కడిగిన పచ్చనోట్లపై ఆరడానికి పేపర్ వెయిట్లు పెట్టిన దృశ్యం కనిపించింది ఆదినారాయణకి.

"ఇంకో విషయం... ఆయన ఇంటిముందు తొట్టె చూసారా?! దాంట్లో సబ్బు, ఏంటి సెప్టిక్ లోషన్ కలిపిన నీళ్ళు. ఆ ఇంట్లోకి వెళ్ళాలంటే, ఆ తొట్లో కాళ్ళు కడుక్కుని వెళ్ళాలి, కోళ్ళ ఫారా లోకి వెళ్ళినట్లు!" చెపుతూ కిసుక్కున నవ్వాడు పక్కింటి కుర్రాడు.

ఆ మాటలకు తల కొట్టినట్టయింది ఆది నారాయణకు.

"ఇంతకీ ఆ మహానుభావుడి పేరేంటో!!" ఇంకో అబ్బాయి ప్రశ్నించాడు.

"భలే చెప్పారు! అదే పేరు!!"

మళ్ళీ 'మహానుభావుడవేరా!' అనే రింగ్టోన్ వినిపించింది.


ఆదినారాయణ 'దేవుడా' అంటూ బాధతో కుమిలిపోయాడు.

✦ ✦ ✦

సరిగ్గా సంవత్సరం తర్వాత ఫిబ్రవరి నెల 2020 వ సంవత్సరం. ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకు టీవీలో వార్తలు వస్తున్నాయి.

"రాష్ట్రంలో కరోనా కేసులు మొదలైనాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వ్యక్తిగత పరి శుభ్రత ముఖ్యం. ప్రతీ అరగంటకు సబ్బుతో చేతులు కడుక్కోవాలి. విధిగా శానిటైజర్ ఉప యోగించాలి. తుమ్మినపుడు, దగ్గినపుడు చేతు ల్ని అడ్డంగా వుంచుకోవాలి." ఆ సమాచారం విన్న ఆదినారాయణ చిన్నగా నవ్వుకొన్నాడు.

ఇప్పుడు తానొక్కడే మహానుభావుడు కాదు, ప్రపంచమంతా మహానుభావులే. 'ఎందరో మహానుభావులు' అన్న త్యాగరాజ స్వామి కీర్తన గుర్తుకొచ్చింది.





# పాద యాత్ర

ఆర్.సి.కృష్ణస్వామిరాజు,
9393662821.

**పం**చాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి.

రెండు వందల పై చిలుకు ఓట్ల మెజారిటీ తో దామోదరం గెలుపు సాధించాడు.

సాంప్రదాయ బద్ధమైన డోలు, సన్నాయి వాయిస్తూ వాద్యకారులు కొత్త సర్పంచ్‌ను ఊరేగింపుగా ఇంటికి తీసుకు వచ్చారు. వీరాభిమానులు పులి అడుగులు వేశారు. ఈలలు అరుపులు కేకలు జేజేలుతో ఇంటి ముందర పండుగ వాతావరణం నెలకొంది.



భార్య బంగారి దిష్టి తీసి ఇంట్లోకి ఆహ్వానం పలికింది. వేసిన పూలమాలలు కుప్ప చేస్తే ట్రాక్టరు నిండిపోయింది.

మొగుడు రేంజి మారిందని మురిసిపోయింది.

వచ్చిన వారందరికీ స్వీటు హాటు కాఫీలు అందించింది. ఇంతలో పార్టీ పెద్దలు వచ్చారు. కొత్త నాయకుడికి పూలగుత్తులిచ్చారు.

గంట సేపు గుసగుసలాడి వెళ్లిపోయారు.

అప్పటికే రాత్రి పది అయ్యింది.

సర్పంచ్ గబగబా ఫోన్ ఎత్తుకుని తెల్లారి ఆరింటికంతా తన అనుయాయులను రమ్మని ఫోన్ చేశాడు.

ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఆరింటిదాకా పంచాయతీలోని అన్ని గ్రామాలలో పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించాడు.

ఇంటింటికీ వెళ్లాలని వీధివీధి తిరగాలని వారికి చెప్పాడు.

భార్య ఆశ్చర్యంగా-

"నిన్నటివరకూ పంచాయతీలోని గడప గడపా ఓట్ల కోసం తిరిగారు కదండీ, వెంటనే తెల్లారేసరికి పాదయాత్ర మొదలు పెడతానంటున్నారు...ఇప్పుడంత అవసరం ఏముంది?" అని అడిగింది.

"తిక్కల పెళ్ళామా! ఎలక్షన్లకు ముందు ఓట్ల మీదనే గురి ఉండేది. నిలబడి నాలుగు క్షణాలు కూడా అన్ని వీధులూ మనసు పెట్టి చూడలేదు. మన పంచాయితీలో ఎక్కడెక్కడ ఖాళీ జాగాలు, డికేటి పట్టాలు, డిస్ప్యూట్ లే అవుట్‌లు ఉన్నాయో చూసి పెట్టుకుంటే కదా! రేపు నాలుగణాలు సంపాదించుకోవడానికి...

నేను యాభై ఏళ్ళకి కానీ స్వంత ఊర్లో సర్పంచ్ పదవి సంపాదించుకోలేకపోయినాను. మన కొడుకు అలాంటి కష్టాలు పడకూడదు. వాడు పల్లె నుంచి జిల్లాకి ఎదగాలి. చిన్న వయసులోనే పెద్ద పదవులు సంపాదించాలి. కనీసం జిల్లా పరిషత్ చైర్మన్ అయినా అవ్వాలి.

అంతేకాదు, నాతో పాటు నా పార్టీ ఎదగాలంటే వారి పర్సు కూడా టైటుగా ఉండకూడదు. వారి జెండా పెట్టుకుని గెలిచిన వాణ్ణి. పార్టీ ఋణం తీర్చుకోవాలి. ఇవన్నీ జరగాలంటే నేల తల్లిని నమ్ముకుంటేనే జరుగుతుందని పార్టీ పెద్దలు చెప్పారు.

వేడిలో వేడి... గెలిచిందే కృతజ్ఞతా యాత్ర పేరుతో వీధివీధి నడిచామంటే అన్ని విషయాలూ బ్రెయిన్‌లో స్టోర్ అవుతాయి.

ఇప్పుడు గడపగడపా తిరగడం వల్ల క్లారిటీ వస్తుంది. రోడ్ మ్యాప్ తయారు చేసుకుని ప్లాన్ ఆఫ్ యాక్షన్ కి ప్రిపేర్ కావచ్చు. చిన్నగా స్టెప్ బై స్టెప్ ఎదగవచ్చు.

అన్నిటికీ మేము ఉంటాము... తగాదాలు కేసులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాము, ప్రాఫిట్స్‌లో ఫిఫ్టీ ఫిఫ్టీ.. అని పార్టీ పెద్దలు భరోసా ఇచ్చారు!" అని ఎగిరెగిరి చెప్పాడు.

సందు దొరికితే చావడికొట్టం చంక బెట్టే రాజకీయాలు ఒంటబట్టిన మొగుడిని చూసి బంగారి ముక్కు మీద వేలేసుకుంది.





# ఓ జుట్టు కథ

శ్రీమతి మంజీత కుమార్,
9849649594

**"నా**న్న ఇదిగో ఇప్పుడే చెబుతున్నా... ఆస్థి లేకున్నా పర్వాలేదు గానీ... తలనిండా నల్లని జుట్టు ఉన్న అబ్బాయినే పెళ్లి చేసుకుంటా!" హీరోయిన్ సమంతాలాగా బుంగమూతి పెట్టి చెప్పిన గారాలపట్టి వక్రేశ్వరీ తలను ప్రేమగా నిమురుతూ- "నాకు తెలుసు తల్లీ!" అన్నాడు తండ్రి బురదేశ్వరరావు.

"చాల్లెండి మీ సంబరం. ఆస్థి లేకుంటే ఆ జుట్టుకు నూనె, షాంపు గట్రా ఎలా పెడతావే పిచ్చితల్లి!" అని భవిష్యత్తును తలుచుకుని బెదిరించింది కన్నతల్లి సుత్తమ్మ.

"నాకది తెలీదమ్మా... నా ప్రాణ స్నేహితురాలు వ్యాకుల గుర్తుందా దానికెంత పొడవు జుట్టో దాని మొగుడికి బట్టతల. ఇంకో మిత్రురాలు భస్మాసురి దానికి మోకాలి దాటి ఉండేది జుట్టు! పాపం భర్తకేమో తలపై నాలుగు వెంట్రుకలు లేవు. అందరూ వారిని ఏడిపిస్తుంటారు. నాక్కూడా అలాంటి మొగుడిని తెచ్చారో... పెళ్లి పందిరి లోంచే పారిపోతాను జాగ్రత!!" హెచ్చరించి మరీ లోపలికి వెళ్లిపోయింది.



ఈలోగా పెళ్లి చూపుల కోసం పెళ్లికొడుకు సంత దిగనే దిగింది. ఏ ఐదారుగురో వస్తారనుకుంటే ఏకంగా పాతికమంది పిల్లాజెల్లాతో కలిసి ఇల్లు పీకి పందిరేసేద్దామా అన్నట్టుగా వచ్చారు.

"ఇంతకీ మీ గుంపులో పెళ్లికొడుకు ఎవరు?..." అనుమాన నివృత్తి కోసం అడగనే అడిగాడు బురదేశ్వరరావు.

టక్కున చేయి పైకి లేపి- "నేను! నేనండి!!" అంటూ పైపైకి వచ్చాడు అర్భేశ్వర్.

"సరే బాబు! కాస్త పైనుంచి తప్పుకుని అదిగో ఆ కుర్చీపైన కూర్చో!" అని చెప్పి బురదేశ్వరరావు- "అమ్మాయిని తొందరగా తీసుకురా లేకపోతే వీళ్లు ఇక్కడ మకాం వేసేలా ఉన్నారు" అని గుసగుసగా భార్యకు చెప్పాడు.

అమ్మాయి రావడం... అబ్బాయిని చూసీ చూడగానే మనసు పారేసుకోవడం చకచకా జరిగిపోయాయి. అందుక్కారణం అబ్బాయికి ఉంగరాల నల్లని జుట్టు. పైగా మాటిమాటికి సినిమాహీరో శోభన్‌బాబులాగా రింగు జుట్టును వెనక్కి అనుకుంటూ భలే స్టైల్‌గా ఉన్నాడు అర్భేశ్వర్.

"మేమింటికి వెళ్లి కబురు చేస్తాం!" అని గుంపులోంచి ఎవరో టక్కున అన్నారు.

ఈ లోగా వచ్చిన బృందం పది లీటర్ల కూల్ డ్రింకులు, రెండు కిలోల సమోసాలు, ఐదారు కిలోల బూందీ, ఎనిమిది కిలోలకు పైగా స్వీట్లు, లీటర్ల కొద్దీ నీళ్లు ఖాళీ చేసి... టాయిలెట్లను తెగ వాడేసి, సోఫాలలోంచి దూదిని పీకి పారేసి, కాలింగ్ బెల్‌ను నొక్కి నొక్కి పాడు చేసి మొత్తానికి బయల్దేరారు.

ఆశగా ఎదురుచూస్తున్న బురదేశ్వరరావు కుటుంబానికి అమ్మాయి నచ్చినట్టు కబురు రావడం... పదిహేను రోజుల్లో పెళ్లి పెట్టుకోవడంతో అంతా హడావుడి హడావుడి.

వక్రేశ్వరీ ఆనందానికి హద్దులే లేవు. తన స్నేహితుల మందలో తన మొగుడికే ఉంగరాల జుట్టు ఉందని ఓ తెగ చెప్పుకుంటోంది అందరికీ అడిగినా అడగకపోయినా.

పెళ్లిరోజు రానే వచ్చింది. బంధుమిత్రుల హడావుడి. కోలాహలం. వక్రేశ్వరీ అర్భేశ్వర్ పెళ్లి అంగరంగ వైభవంగా జరిగిపోయింది.

కొత్త దంపతులను అందరూ ఆశీర్వదించి వెళ్లిపోయారు. అప్పగింతలు అయిపోయి వక్రేశ్వరీ భర్తతో ఆనందంగా అత్తారింటికి వెళ్లిపోయింది.

తెల్లారి రాత్రి శోభనం. ఆనంద డోలికల్లో తేలుతూ కొత్త జంట మంచంపై కూర్చున్నారు. ముందుగా అర్భేశ్వర్... "నువ్వు చాలా అందంగా ఉంటావు వక్రా!" అంటూ చేయి పట్టుకున్నాడు.

"మీ ఉంగరాల జుట్టుతో మీరే ఇంకా బాగుంటారు... అచ్చు తెలుగు సినిమా హీరో లాగా!" అని వక్రేశ్వరీ సిగ్గుపడుతూ చెప్పింది.

"దానిదేం భాగ్యం! నా దగ్గర చాలా స్టైల్స్ ఉన్నాయి. ఎప్పుడు ఏ హీరోలాగా కావాలంటే ఆ హీరోలాగా కనిపించగలను. ఈ అదృష్టం ఎంతమందికి ఉంటుంది చెప్పు!" అంటూ విగ్గు తీసేశాడు.

అంతే వక్రేశ్వరీ అష్టవంకర్లుపోతూ కళ్లు తేలేసి విగ్గునే వింతగా చూసింది.

"నాకు చిన్నప్పట్నుంచి జుట్టు సరిగ్గా మొలవ లేదు అంటే పెరగలేదు. అప్పటినుంచి ఇలా విగ్గులు పెట్టుకుంటాను. ఇదిగో ఎన్ని ఉన్నాయో..." అంటూ బోడిగుండుతో భర్త పెట్టె తెరిచి చూపించే సరికి వక్రేశ్వరీ తలపట్టు కూర్చుంది.

ముళ్లపూడి
హాస్యకథల పోటీలో
**1000 రూపాయలు**
బహుమతి పొందిన
కథ

# పేరులో ఏముంది!

రాధిక మంగిపూడి,
9029409696

**"క**రీనా!" అన్నాడు హరి.

"కాదు. 'కరుణ'!" అరిచింది అరుణ.

"కాదు. 'కరీనా'! నేను ముందే చెప్పాను." అన్నాడు హరి.

"ఏంటి చెప్పేదీ! నేను బిడ్డ కడుపులో పడగానే డిసైడ్ అయిపోయాను, మా తాతయ్య కరుణాకర్రావు పేరు పెట్టుకోవాలని." మూతి ముడుచుకుంది అరుణ.

"కుదరదు. మా అమ్మకి కరీనాకపూర్ అంటే ఇష్టం. తనకు కరీనా లాంటి మనవరాలే పుట్టాలని ఆశ పెట్టుకుంది. ఆ పేరు పెడితేనే మా అమ్మ సంతోషిస్తుంది." మళ్లీ రెట్టించాడు హరి.

"ఏడ్చినట్టు ఉంది! మా తాతయ్య మీకు ఇచ్చిన మూడెకరాల పొలం ఉండబట్టేగా నన్ను చేసుకున్నారు! ఏమైనా సరే! మా తాతయ్య పోగానే ఈ బిడ్డ నా కడుపులో పడింది. కనుక ఆయన పేరు పెట్టి తీరాల్సిందే" తీర్మానించింది అరుణ.

"అది కాదే! 'కరుణ' అంటే పాత పేరు లాగా ఉంది. 'కరీనా' అంటే కొత్త ఫ్యాషన్ గా ఎంత బాగుందో చూడు!..." అనునయించడానికి ప్రయత్నించాడు హరి.

మూతి ముడుచుకుని కూర్చుంది అరుణ.

గత రెండు వారాలుగా ఈ ఇంట్లో రోజూ ఈ వాదన జరుగుతూనే ఉంది.

పెళ్లయిన ఐదేళ్లకు గర్భవతి అయింది అరుణ. ఇంటిల్లిపాది ఆనందపడ్డారు.

నెలలు నిండుతున్న కొద్దీ పక్క ఇంటి మామ్మగారు 'నీకు ఆడపిల్లే పుడుతుంది' అని పదేపదే చెప్పడంతో, ఆవిడ నోటివాసిని నమ్మిన అరుణ తన ఇంట మహాలక్ష్మి పుట్టబోతోందని ముందే మనసులో రాసేసుకుంది. అప్పటినుండి పుట్టబోయే బిడ్డకు పేరు ఎంచడానికి రోజూ భార్యాభర్తలిద్దరూ విభేదిస్తూనే ఉన్నారు. నెలలతోపాటు పంతాలు కూడా పెరుగుతూనే వచ్చాయి.


ఏడవ నెల వచ్చాక అరుణను పుట్టింటికి పంపడానికి హరి ఇష్టపడలేదు.

"ఆ పల్లెటూరులో పురుడుపోసుకుంటే ఏ సమస్య వచ్చినా సమయానికి సరైన వైద్యం అందదు. అసలే తొలి కాన్పు." అంటూ అత్త మామల అర్జీలను తిరగ్గొట్టాడు.

ఇంటి దగ్గరలో కొత్తగా కట్టిన సూపర్ స్పెషాలిటీ 'ఆర్బిట్' ఆస్పత్రిలోనే చేర్చాలని పట్టు పట్టుకుని కూర్చున్నాడు.

నిజానికి పల్లెటూర్లో కాన్పు అయితే తను వెళ్ళే లోపలే, అక్కడ అందరూ కలిసి అరుణ తాత పేరు పెట్టించేస్తారేమోనని భయం హరికి.

"అదేం పేరండి! ఆసుపత్రికి పేరు 'ఆర్బిట్' ఏమిటీ! నాకు నచ్చలేదు. ఒకసారి వెళ్తే, ఇంకా ఆస్పత్రి చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉండా



లేమో అన్నట్లు ఉంది.” విసుక్కుంది అరుణ
“వాడి ఆసుపత్రి. వాడి పేరు. వాడి ఇష్టం అందరి పేర్లు నువ్వే డిసైడ్ చేస్తానంటే కుద రదు.” వెక్కిరించాడు హరి.

“ఎంచక్కా మా ఊళ్లో ఐతే డాక్టర్ ధైర్యలక్ష్మి గారు మంచి హస్తవాసి ఉన్న డాక్టరమ్మ. మ ఇంకోసారి ఆలోచించు అల్లుడూ!” బతిమ లింది అత్తగారు.

“వీల్లేదు. నాకు మీ ఊరి మీద నమ్మకం లేదు. నేను నిన్నే వెళ్లి ఆర్బిట్‌లో అన్నీ కనుక్కు న్నాను. అక్కడ డాక్టర్ బ్రేవ్ గారని, ఇంగ్లాం డాక్టర్‌గారు ఉన్నారు పెద్దాయన. మీ ధైర లక్ష్మికి తాతలాంటి అతని దగ్గరే చేరుస్తా” అ తీర్మానించేశాడు హరి.

హరి మొండితనం తెలిసిన ఇంట్లో వాళ్ళం దరూ నోరు మూసుకుని ఊరుకున్నారు.

మొత్తానికి అనుకున్నట్లుగానే ఒకరోజు ఆర్బిట్ ఆసుపత్రిలోనే అరుణకు సుఖప్రసవం అయింది.

కానీ అమ్మాయి పుడుతుందనుకున్న ఇంటి పాది అంచనాలను తారుమారు చేస్తూ.. అబ్బాయి పుట్టాడు.

సరే ఎవరైతేనేం అని సరిపెట్టుకున్నాడు హరి.

కరీనా పేరు తప్పినందుకు సంతోషించిం అరుణ.

హరికి దూరపు బంధువులలో జ్యోతిష శాస్త్ర ప్రావీణ్యం గల పెద్దాయన ఒకరున్నారు. అతని మాటపై నమ్మకంతో హరి అతనికి వెంటనే ఫోన్ చేసి పిల్లవాడు పుట్టిన నక్షత్రం సమయం వివరాలన్నీ చెప్పాడు.

అతను వెంటనే రెండు క్షణాలు ఏవో లెక్కలు వేసి–

“ఇంకేం!... మహజ్జాతకుడు పుట్టాడోయ్ నీకు! పెద్దయి సకల కళాకోవిదుడు అవు తాడు. ‘క’ అనే అక్షరంతో మొదలయ్యే పేరు పెట్టుకోండి.” అని చెప్పి శుభం కార్డు వేసే శాడు.

దానితో హరి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

రెండు రోజుల తర్వాత డాక్టర్ ఇంటికి వెళ్ళ వచ్చు అన్నాడు.

బిల్లు కట్టే సమయానికి హాస్పటల్ రికార్డులలో వారి రూల్స్ ప్రకారం పిల్లాడి పేరు కూడా రాసి తీరాలన్నారు. అసలే మగ పిల్లవాడి పేర్లు ఏవి ముందుగా ఆలోచించుకుని లేక పోవడంతో ఇంటికెళ్లాక అరుణ కరుణాకరం అనే పేరే పెట్టేస్తుందనే భయంతో హరి అయో మయంలో పడ్డాడు.

ఇంతలో జ్యోతిష్యం పెద్దాయన ఫోనులో పిల్లాడు పెరిగి సకల కళా కోవిదుడు అవుతాడు అని చెప్పడం గుర్తొచ్చింది.

ఇక్కడే ఏదో ఒక పేరు ఖాయం చేసి రాసేసి, ఆసుపత్రి వారు అర్జెంట్‌గా పేరు రాయమ న్నారని నేరం వారి మీదకి తోసేస్తే, ఇంటికెళ్లాక అరుణ గొడవ చెయ్యలేదు అనుకుని, వెంటనే ‘క’ అనే అక్షరం కూడా సరిపోయేలా ఆస్పత్రి ఫారం మీద ‘కోవిద్’ అనే రాసి సంతకం పెట్టి ఇచ్చేసాడు కౌంటర్లో దొరసానికి.

ఆమె హరి ముఖాన ఒక చిరునవ్వు పడేసి, తమ ఆస్పత్రి రికార్డుల నుండి అన్ని వివరాలు మునిసిపల్ కార్పొరేషన్ ఆఫీస్‌కి వెళ్లిపోతా యని, బర్త్ సర్టిఫికెట్ కోసం ఇంకో ఫారం మీద హరి సంతకం తీసుకొని, పది రోజుల తర్వాత ఫోన్ మీద మెసేజ్ రాగానే, ఫలానా ఆఫీసులో సర్టిఫికెట్ వెళ్లి తీసుకొమ్మని చెప్పింది.

హరి బిల్లు కట్టేసి ఆనందంగా భార్యాబిడ్డ లతో ఇంటికి వచ్చేశాడు.

పది రోజుల తర్వాత ఫోన్‌లో వచ్చిన మెసేజ్ చూసుకొని బర్త్ సర్టిఫికెట్ తీసుకురావడానికి, వాళ్ళ ఆఫీసుకి వెళ్ళాడు హరి. చలానా కట్టి సర్టిఫికెట్ చేతిలోకి తీసుకుని చూసిన హరికి ఒక్కసారి గుండె ఆగినంత పని అయింది.

సర్టిఫికెట్లు మీద పిల్లాడి పేరు ఆంగ్లంలో ‘Covid’ అని రాసి ఉంది.

## ముళ్ళపూడి ముత్యాలు



- ✦ కాకి ఏమంటుంది ?
  కావ్ కావ్ !
  పిల్లి ఏమంటుంది ?
  మావ్ మావ్!
  ఆ జంతువులకి ఒకటే కూత వచ్చు. నువ్వు అడ్డమైన కూతలూ కుయ్య గలవు. అబద్ధాలు చెప్పి అవి నిజమని నోటికొచ్చినట్టు ఒట్టు పెట్టగలవు.
- ✦ మంచీ చెడ్డలు రాసులు పోసినట్టు వేరు వేరుగా ఉండవు. అవసరాన్ని బట్టి మంచితనం, అవకాశాన్ని బట్టి చెడ్డతనం పెరుగుతాయి.
- ✦ మడిసి కోడిగురు, మేక పలావు, గొర్రె పులుసు తింటాడు గాని పెద్దపులి కూర, సిమ్మం ఇగురు ఎవడేనా అడుగుతాడా? ఎందుకనీ! అయ్యే తనని తిని అవతల పారేస్తాయని.
- ✦ దేవుళ్లకి కోపాలు రావు గౌరీ! వస్తే వాళ్ళు దేవుళ్ళు కారు.
- ✦ బిడ్డని తినే బొమ్మ అమ్మెలాగవుద్ది!
- ✦ కన్నెత్తి సూసేది అమ్మ... పన్నెత్తి పలికేది అమ్మ!
- ✦ ఆడపిల్లంటే సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి కదా! అవును. వచ్చే మహాలక్ష్మి కాదు, వెళ్లే మహాలక్ష్మి!
- ✦ నిద్ర పటే వేళకన్నా, మేలుకునే వేళ చదువుకుంటే మనసుకు బాగా హత్తుకుంటుంది!
- ✦ ఎందరో మహానుభావులయితే, ఇంకెందరో మామూలుభావులు. మనం ఆ రెండో జాతిలో ఉందాం. చచ్చిపోయేదాకా హాయిగా నిండుగా బతుకుదాం.
- ✦ అందరూ గొప్పవాళ్ళు కాదు, కాలేరు, కానక్కరలేదు కూడా.
- ✦ మన జీవితం మన కోసం కొన్నాళ్ళు బతికితే, మన బిడ్డ కోసం ప్రాణం విడిచేదాకా బతకాలి. నారు పోసిన దేవుడు నీరు పోయడమంటే ఇదే!

ముళ్లపూడి హాస్యకథల పోటీలో **1000 రూపాయలు** బహుమతి పొందిన కథ

# మాయింటికి రారండోయ్

శ్రీమతి పి.వి.శేషారత్నం
9492925291

**“**ఇదిగో అలివేలూ...ఎవరొచ్చారో చూడు! త్వరగా రావోయ్...” భర్త వెంకట్ కేకలకు హడలిపోయి బయటికొచ్చి వదినగారు కనక మాలక్ష్మిని చూసి సంబరపడిపోయింది అలివేలు.

“ఏవమ్మా మరదలా! బావున్నావా?... తమ్ముడూ అలా చిక్కిపోయావేరా?... పిల్లలు వేసవి సెలవులొచ్చిందగ్గర్నుంచీ ఒకటే గోల... చిన్న మావయ్య ఊరికి వెళ్దామే అమ్మా... అంటూ...ఏదీ ఇప్పటిదాకా మీ బావగారికి తీరితేనా?” భారీ శరీరాన్ని సోఫాలో కూలేసింది కనకమాలక్ష్మి.

“అబ్బ! ఇవాళ ఎంత మంచిరోజు!వదిన గారూ! మీ ఆరోగ్యం ఎలావుంది? అన్నయ్య గారూ లోపలికి రండి!”

“ఏం బాగోలే... లిఫ్ట్ లేకపోవడం మూలాన నాలుగంతస్థులు ఎక్కాల్సి వచ్చేసరికి ఇదిగో మెట్లెక్కే సరికి ఇలా ఆయాసం...నిస్త్రాణగా వుందిరా వెంకట్! ఒరేయ్ పిల్ల పిడుగులూ... అప్పుడే ఇల్లంతా కలియతిరిగేయడం మొదలెట్టారూ... అబ్బబ్బబ్బ! ఈపిల్లలకి అక్కర్లే నిది లేదు కదా!”

“పోనీండి వదినా! పిల్లలు కాకపోతే మనం అల్లరి చేస్తామా ఏమిటి?”

“అబ్బ! అబ్బ... ఏం ఎండలు?...ఈ ఏడాది మరీ ఎక్కువగా ఉన్నాయిలెండి బావగారూ!...” వెంకట్‌కి అంతకంటె ఏం మాట్లాడాలో తెలిసిందికాదు.

“ఒరేయ్ వెంకట్! నాకు నువ్వంటే ప్రాణం. పైగా వేసవి సెలవులు. పిల్లల అల్లరి తట్టుకో లేక ఎప్పట్లాగే సకుటుంబ సమేతంగా సిద్ధమయి పోయానురా!... క్రితంసారి మాయదారి చైనా రోగం కోవిడ్ మూలాన రాలేక పోయారా! ఇపుడు వచ్చేసాగా... పాపం అలివేలుకి నెల్లాళ్లపాటు నడుం విరిగే చాకిరీ... నీకు ఆరునెలల బడ్జెట్ కాస్తా నెల్లాళ్లలో ఖాళీ.” అంటూ జోకేసి గారపళ్లికిలించింది కనక మాలక్ష్మి.

“అవేం మాటలక్కా! అయినా మళ్లీ కోవిడ్ విజృంభిస్తోందంటున్నారు...మీరంతా ఎలా వచ్చారోగానీ...”

‘దానికి మనం భయపడేదేంట్రా...మనల్ని చూసి అదే జడవాలిగాని...ఒరేయ్! ఎన్నాళ్ల యిందిరా నాచేత్తో నీకు నేతిగారెలు చేసిపెట్టి! ఇదిగో మరదలమ్మా!... ఓ రెండుకేజీల మిన ప్పప్పు నానెయ్! నువ్వు వంట పూర్తి చేసేసరికి నేను వేడివేడి గారెల వాయిలు, ఎడం చేత్తో చేసిపారేస్తాను. ఏరా కన్నబాబూ! మావయ్య ఇంటికి వచ్చాక నేతిగారెలు చేసిపెడతానని చెప్పానా?... కరువుతీరా తిందురుగాని... ఏం పిల్లలో? అన్నాలక్కర్లేదుగాని ఇలాంటివంటే మాత్రం ప్లేట్లకి ప్లేట్లు ఊదిపారేస్తారు...”



వదినగారు ముసి ముసినవ్వులు నవ్వుతూంటే అలివేలు గుండెల్లో రాయిపడింది.

"ఇదిగో కనకం! నీ నోటికి లాగే, చేతికీ హద్దు లేదోయ్!! అందుకే పెద్దాడబడుచు వస్తుందంటే మీ మరదళ్ల గుండెల్లో రాయే సుమా!"

"ఏం మాటలన్నయ్యగారూ! అలా చేసి పెట్టే వాళ్లు మాత్రం ఈ కాలంలో ఎవరుంటారు చెప్పండి." మొహమాటంగా అంది అలివేలు.

"నువ్వలా వెనకేసుకొస్తావు కనకనే మీ పెళ్లయి ఆరేళ్లయినా ప్రతి ఏడాదీ ఏ వంకబెట్టి తప్పించుకోవడానికీ వీల్లేకుండా సెలవులిచ్చేసరికి వాలిపోతున్నాం మరి. ఇక మా పిల్లలు సుందోపసుందులే. మేం వెళ్లాక సర్దుకోడానికే నీకు వారంపడుతుంది. నాకు తెలుసుగా... ఈలోగా చిరిగి పోయే సోఫాకవర్లూ... ఊడి పోయే ఫ్రిజ్‌డోరూ... పగిలిపోయే అద్దాలూ... విరిగిపోయే ఫాన్‌రెక్కలూ... చిరిగిపోయే పుస్తకాలూ... అబ్బో! కిష్కింధా కాండే మరి" వెంకట్ బావగారు సుబ్బారావు బొజ్జ కదిలింది నవ్వుకి.

"మీకంతా వేళాకోళం... మా అలివేలు అలా అనుకోదులెండి. వట్టి భోళా మనిషి!"

"బాగా చెప్పారు వదినా!... ఎప్పుడనగా ఎంగిలి పడ్డారో భోజనాలకి లేవండి. పిల్లలూ! కాళ్లూ చేతులూ కడుక్కోండ్రా!..." అంది అలివేలు.

✦ ✦ ✦

"అదేమిటోయ్ పంకజం!... నీ నేస్తం పక్కిం టి అలివేలు వాళ్ల చుట్టాలు కరోనా వలస కార్మికుల్లా నెత్తిన పెట్టెలు పట్టుకుని వారం తిరక్కుండా అలా పారిపోతున్నారు దొంగల్లా!" అన్నాడు వెంకట్ పక్క అపార్టుమెంటు కవితల కాళోజీరావు.

పంకజం ముసిముసిగా నవ్వింది.

"ఏంచేస్తారు పాపం! బయటికి పోదామంటే కరోనా సెకండ్‌వేవ్ మళ్లీ మొదలవుతోందం టున్నారాయె... కవితలతో తమ్ముడు వెంకట్... కొత్త కొత్త వంటల ప్రయోగాలతో మరదలు అలివేలు ఎడాపెడా వాయించే స్తోంటే తట్టుకో లేక పోతున్నారు కాబోలు." రహస్యంగా అంది పంకజం మొగుడితో.

"అదేమిటోయ్! వెంకట్ కవితలు రాయడం ఎప్పుడు మొదలెట్టాడు?... పైగా అలివేలు వంటకాలు బ్రహ్మాండంగా చేస్తుందని ఆమధ్య నువ్వే చెప్పినట్టు గుర్తు." హాశ్చర్యపోయాడు కవితల కాళోజీ.

"ఆమాట నిజమేననుకోండి! మీ తిరిగొచ్చిన దిక్కుమాలిన కవితలు వారం క్రితం చేబదులు డిగింది అలివేలు... దానితోబాటే మొన్న మహిళా దినోత్సవం నాడు రిలీజు చేసిన నా కొత్త చెత్త వంటల పుస్తకాన్ని కూడా ఎరువిచ్చానులెండి."

పక్కన దబ్ మన్న శబ్దానికి పంకజం పక్కకి తిరిగి చూసింది.

అప్పటికే అమాంతం కింద పడిపోయిన కవితల కాళోజీ గిలగిలా తన్నుకుని మూర్ఛబోవడం చూసి తను అప్పుడే తయారు చేసిన కొత్త డ్రింక్ చికిబుకి భంభం రసాన్ని గొంతులో పొయ్యడానికి ఉద్యుక్తురాల యింది పంకజం.

దాని పిచ్చిఘాటుకి మొగుడికి తప్పక తెలి వొస్తుందని అనుభవం నేర్పినపాఠం ఆవిడకి.



## ముళ్ళపూడి ముత్యాలు

ప్రభాకర్: తెలియని వారికి చెప్పడం నా పని, మరి తెలుసుకోవడం నా డ్యూటీ కదండీ. చదువుకున్న వాళ్లని అడిగి అన్నీ తెలుసు కున్నాను. మీబోటి పెద్దలతో మాట్లాడి ఇంకెన్నో తెలుసుకున్నాను. ఎవరు ఏం చెప్పినా ఒక్కసారి వింటే చాలు యిట్టే పట్టేస్తాను.

మిక్కిలినేని: ఆ కోతుల బొమ్మ ఏమిటి?

ప్రభాకర్: కోతులు మన తాత ముత్తాతల తాతలు. వాటిలోంచే మన రూపం వచ్చిందంటారు. చూడండి, తల్లికోతి పిల్లకోతికి పాలిస్తోంది, తండ్రి కోతి ఆమె తలలో పేలు నొక్కుతోంది. మగ వాడికీ ఆడదానికీ ఇష్టమైనది బిడ్డ. ఆ బిడ్డకోసం వాళ్ళు కలిసి ఉంటారు. అందరూ ఇలాగే ఒకరికొకరు సాయంచెయ్యాలన్నదే ఆ బొమ్మనీతి. కోతి మనకి రూపం ఇచ్చింది, గుణం ఇచ్చింది, కాని ఒక్కటి మాత్రం ఇవ్వలేదు సార్... ఐకమత్యం. అది కూడా ఇచ్చి ఉంటే ఇన్ని కొట్లాటలు యుద్ధాలు రావు కదండీ!

✦✦✦

రాము: ప్రేమపాశం రెండు రకాలు, ఒకటి కన్నవారి మీద, మరొకటి కట్టుకునే వాడిమీద. ఒకరిని నొప్పించలేక , మరొకరిని ఒప్పించలేక... జీవితం లో చాలామందికి దొరికే బొమ్మలు నచ్చవు, నచ్చే బొమ్మలు దొరకవు ప్రేమ కథలన్నీ ఇంతే. చీకట్లో దీపానికి అసలు పేరేమిటో తెలుసా?...ఆశ! హోప్!

✦✦✦

ప్రభాకర్: పైసాలో ఉందిరా జగత్తు, పైసాలో ఉందిరా గమత్తు, పైసాలో ఉందిరా మహత్తు!!

✦✦✦

పుష్పకుమారి: మోసాలు చెయ్యటానికి సిగ్గు లేక పోయినా పాపాలు చెయ్యటానికి బయమన్నా ఉండాలి.




# కోమలరావు

డా॥ అంబల జనార్ధన్,
8850349858

**కో**మలరావు! ఔను!! అదే అతని పేరు.

ఇప్పుడిలా ఉన్నాడు కానీ, ఒకప్పుడు అతను, తన పేరుకు తగ్గట్టు కోమలంగానే ఉండేవాడు. వయసు మీద పడడంతో కొంత, చింతతో మరింత ముదురుగా కనిపిస్తున్నాడిప్పుడు. ఇంతకీ అతన్ని కలిచివేసే అంశం ఏమిటంటే అది పెళ్ళి. నలభై దాటినా, బెండ కాయలా ముదిరినా అతనికి ఇంతవరకు వివాహ యోగం ప్రాప్తించలేదు. అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుని నోట్లో శని ఉందన్నట్టు, అతనికి ఉన్నత చదువు, దిన దిన ప్రవర్ధమానమౌతున్న వ్యాపార సామ్రాజ్యం, తర్వాతి ఐదు తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తులు, అన్నీ ఉన్నాయి కాని ఆ వివాహ ఘడియే అందినట్టే అంది, చేతికి చిక్కకుండా, దూరం దూరం పోతోంది. ఎందుకలా అంటారా? దానికి పెద్ద ఫ్లాష్ బ్యాక్ ఉంది. వింటానంటే చెబుతాను. ఇక మీ ఓపిక.


✦ ✦ ✦

కోమలరావు పుడుతూనే అతని అమ్మ 'హరీ' మంది. అతన్ని తన బావమర్ది పోషణలో ఉంచి, ఇంకో పెళ్ళి చేసుకుని, తనకో కొడుకున్నాడనే సంగతే మరిచి పోయాడు అతని తండ్రి.

తన సోదరిపై అమితమైన ప్రేమ ఉన్న కోమలరావు మేనమామ, అతన్ని పువ్వుల్లో పెట్టి పెంచాడు. అతని భార్య అంటే కోమలరావు మేనత్త కూడా అంతే ప్రేమతో చూసుకుంది. దానికి కారణం లేకపోలేదు. ఆమె సుపుత్రులిద్దరూ సర్వగుణ సంపన్నులు! వారికి లేని వ్యసనం లేదు! అందుకే వారిపై ప్రేమను కూడా కోమలరావుపై కురిపించి అతన్ని ప్రయోజకుడిగా తీర్చిదిద్దింది.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి, కోమలరావు కూడా, తనను పెంచిన వారి ఆశలు వమ్ము చేయలేదు. చదువులోనే కాదు, ఇతర సాంస్కృతిక కార్యకలాపాల్లో కూడా ఆరితేరాడు.

యుక్త వయసు రాగానే, తన తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తిని మూలధనంగా పెట్టి, తన చదువుకు తగ్గ ఎగుమతి, దిగుమతి వ్యాపారం మొదలు పెట్టాడతను. పుట్టడంతోనే తల్లిని మింగిన నష్టజాతకుడని లోకులనుకున్నా, వ్యాపారంలో మాత్రం అదృష్టజాతకుడిగా ఎదిగాడు కోమలరావు.



అతను పట్టిందల్లా బంగారమైంది. అనతి కాలంలోనే నగరంలోనే ఒక విజయవంతమైన వాణిజ్యవేత్తగా పరిగణింపబడ్డాడతను.

వ్యాపారంలో పడి, ఇతర విషయాలపై దృష్టి సారించలేదతను. తనకు కూతురు లేదే, అని వాపోయిన అతని మేనత్త మాత్రం, కోమలరావుకు తగిన వధువుని చూసే పనిలో పడింది.

జీవితంలో విజయ విహారం చేస్తున్న అతనికి మొదట్లో ఏ అమ్మాయీ ఆనలేదు.

కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు, చూసిన ప్రతి అమ్మాయిలో ఏదో లోపం వెదికి తిరస్కరించసాగాడు. అలా అతనికి ముప్పై ఐదేళ్లు వచ్చేసరికి బండి రివర్స్ గేర్ లో తిరగడం మొదలైంది. అప్పుడు అమ్మాయిలు అతనికి వంకలు పెట్టడం మొదలుపెట్టారు.

ఒకరు నిలకడలేని వ్యాపారమని 'నో' చెప్పితే, ఇంకొకరు సాఫ్ట్ వేర్ కాదని ముక్కు విరిచారు. ఇంకొందరైతే మరీ దారుణం! అంకుల్‌లా ఉన్నాడని ఎద్దేవా చేశారు.

వాళ్లనీ తప్పు పట్టలేం, ఎందుకంటే కోమలరావు కాస్తా 'ముదురు' రావులా మారాడు. ముఖంలో ముడుతలు, తలపై వెంట్రుకలు లెక్క పెట్టగలిగే స్థితికి చేరుకున్నాయ్.

పుణ్యకాలం కాస్తా మించిపోయిం తర్వాత కళ్లు తెరిచాడు కోమలరావు. అప్పటికే జరగాలసిన నష్టం జరిగింది. ఇక ఏ అమ్మాయైనా తనతో పెళ్ళికి ఒప్పుకుంటే చాలనే స్థితికి వచ్చాడతను.

అప్పుడు వాచాలరావు రంగ ప్రవేశం చేశాడు. అతను యం.బి.ఏ. చేసి, ఏదో ఉద్యోగంలో చేరకుండా, లాభసాటి మ్యారేజ్ బ్యూరో తెరిచాడు.

అతనికి కోమలరావు చిక్కాడు.

మంచి సౌండ్ పార్టీ అని తెలుసుకున్న




రావు: ఎనకటికి విష్ణు మూర్తుల వారు సాయంగా పెత్యక్షమై, ఏం వరం కావాలో కోరుకోరా బక్తా అంటే, మా మేనమామ సెవుల్లో ఎంటికలు మొలిపించు, తతిమ్మాది నేన్జూసుకుంటాను అన్నాట్ట, అట్టాగుంది నీ కత దానికిడాకులూ, నీ కూతురికి పెళ్ళి రెండూ నేనే జేయిస్తాను అంటే అక్కర్లేదు, ఆ మొదటిది చాలు, రెండోది నే జూసుకుంటాను అన్నావు... ఏం జూసుకున్నావూ?

అల్లు:అయ్యా అయిపోయిందేదో అయిపోయింది, కర్తవ్యం ఆలోచించి కాండ జరిపించండి శ్రీవారు అఘటనా ఘటన సమర్థులు. తలచుకుంటే ఏమన్నా చెయ్యగలరు.

రావు:తాళి తెంచటం తేలికే గాని కట్టించడం అంటే మాటలేటి! కర్లవుద్ది. రెండు లచ్చలు గుమ్మరించాల.

ముక్కామల: టూ లాక్స్, టూ మచ్!

రావు: ఇలా రావో... అసలు మన ఎవ్వార మేటి, మనవేటి, మన బతుకేటి అది ఆలోసించాల కదా! ఇంటో ఇంటో మేనరికాన్ని కాదని చెప్పేసి ఆడు పరాయి పిల్లని పెళ్ళి జేసుకున్నాడు. అప్పడే పోయింది మనకీ మన అమ్మాయికీ వున్నయాల్యువేషను, ఆ వచ్చిం దాని తాడు తెంచావే అనుకోం డయ్యా, అప్పడేనా ఆడు దీన్ని పెళ్ళాడ తానన్నాడా? లేదే! ఇహ మరెవడు జేసుకుంటాడు దీన్ని? అసలదలా గుంచు. అసలే మన ఇష్టరీ అంతంత మాత్రం! ఇష్టరీ సింపేత్తే సిరిగీ పోదు, సెరిపేత్తే సేరిగీ పోదు, అంచేత సింపేత్తే సుకం నేదు. అక్కడాడు అలా గుద్దేస్తానే ఉంటాడు, మనకిలాగ వచ్చేత్తానే వుంటాయి.

✦✦✦

సుమతి: అన్నయ్యా, గ్రహచారం అంటే ఏమిటి?

ప్రభాకర్: గ్రహచారం అంటే డబ్బు!

✦✦✦

ధూళిపాళ: పాము తాడనుకొనకు, తాడు పామనుకొనకు. తొందరపడి దేన్నీ నమ్మకూడదు.

✦✦✦

కలసి వచ్చిననాడు కడుపేద రాజగును... అదృష్టం బాగుంటే అమాంతం రైతు రాజయి పోతాడు.

✦✦✦

ధూళిపాళ: వంద పుస్తకాలు చదవడం కన్నా ఒక్క సత్యాన్ని అర్థం చేసుకోవడం గొప్ప.

✦✦✦

భగవంతుడి సృష్టిలోనే తేడాలున్నాయి. పెద్దంతరం చిన్నంతరం, గొప్పా బీదా, పొట్టీ పొడుగూ...

వాచాలరావు, వల విసిరాడు.

అప్పటికే ఎన్నో సంబంధాలు చూసి చూసి విసిగి వేసారిపోయిన కోమలరావు, సులభంగానే వాచాలరావు వేసిన ముగ్గులో దిగాడు.

"సార్! నలుగురు అక్కా చెల్లెళ్ళున్నారు. అందరూ పెళ్ళికెదిగవారే. వారి తల్లీ, తండ్రి చిన్నప్పుడే ఓ ప్రమాదంలో చనిపోతే, పెద్ద కూతురు అష్టకష్టాలు పడి, తాను నిలదొక్కుకోవడమే గాక, తన తోడ బుట్టిన వారికి కూడా ఉన్నత విద్యా బుద్ధులు నేర్పించింది. తాను వత్తిలా కాలి, తన చెల్లెళ్ళ బతుకుల్లో వెలుగులు పంచింది.

అందరూ మంచి ఉద్యోగాల్లో చేరారు. అదే వారి పెళ్లికి ప్రతిబంధకమైంది. వారికా కట్నం ఇచ్చే స్థోమత లేదు, వారి చదువులకు, ఉద్యోగాలకు తగిన వరుల కొరత ఉంది... ఎదో గంతకు తగ్గ బొంత కట్టుకోవడానికి వారు 'ససేమిరా' అంటున్నారు.

అది వారి పెద్దక్కయ్య అమల పాలిటి శాపమయింది." ఆగాడు వాచాలరావు.

"ఇందులో నేనేం చేయగలను?" కోమల రావు సందేహం.

"అక్కడికే వస్తున్నాను... ముందు తన ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళి తర్వాతే తను పెళ్లి చేసుకుంటానని పెద్దామె అమల... భీష్మించుకు కూర్చుంది. వారికి తగిన వరులు కూడా మా బ్యూరోలో సిద్ధంగా ఉన్నారు...

ఐతే కట్న కాను కల దగ్గరే పేచీ వచ్చింది. మీరు గాని పెద్ద మనసు చేసుకొని, ఆ ముగ్గురి కట్నకానుకల సంగతి చూసుకున్నారనుకోండి, వారి పెద్దక్క అమల... మిమ్మల్ని చేసుకోవడానికి మొగ్గ చూపవచ్చు." కోమలరావు ఎగిరి గంతేశాడు.

తన పెళ్లి ఔతుందంటే దేనికైనా 'సై' అనే మనఃస్థితిలో ఉన్నాడతను.

ఇక వాచాలరావు రంగంలోకి దూకి అన్నీ తానై పెళ్ళి పనుల్లో పడ్డాడు.

అమలకి, అతనిపై గురి కుదిరింది. ఒకే ఫంక్షన్ హాల్లో ఆ ముగ్గురి చెల్లెళ్ళ పెళ్లిళ్ళు, కోమలరావు ఖర్చుతో అట్టహాసంగా జరిగాయి.

అమలకి పట్టరాని సంతోషంగా ఉంది.

తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాననే తృప్తి ఆమెది. తన తోడబుట్టిన వారు, వారి వారి భర్తలతో హనీమూన్ యాత్రలకి వెళ్లిం తర్వాత, వాచాలరావుతో, కోమలరావుని కలవడానికి వెళ్లింది అమల.

"మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదంకుల్. ఎటూ దిక్కుతోచని స్థితిలో ఉన్న మాకు, భగవంతునిలా వచ్చి ఆదుకున్నారు. మీరుగాని పూనుకోకపోతే, మా చెల్లెళ్ళ కన్నెచెర వీడేది కాదు. వాచాలరావు చొరవతో నైతేనేమి, మీ దొడ్డ మనసువల్ల నైతేనేమి, మీరు మమ్మల్ని ఆదుకున్నారు. మా చెల్లెళ్ళ పెళ్లిళ్ళ పుణ్యమా అని నేనూ వాచాలరావు దగ్గరయ్యాం. వచ్చే నెల పదవ తేదీనే, అదే ఫంక్షన్ హాల్లో మా పెళ్లి. మీరు తప్పకుండా వచ్చి, మీ పవిత్ర హస్తాలతో మమ్మల్ని దీవించండకుల్." అని, వాచాలరావుతో కలిసి, కోమలరావు కాళ్లకి సాష్టాంగ నమస్కారం చేసింది అమల.




# బెడ్‌రూమ్‌లో బెర్ముడా ట్రయాంగిల్

డా॥ రమణ యశస్వి
9848078807

**క**రోనా డిక్షనరీలో... 'భౌతిక' దూరం అనే పదం పెద్దక్షరాలతో రాసి వుంది .

ఆ మాట రోగి వైద్యుడు సంబంధాలలో 'బహుతిక్క' దూరం అయి కూర్చుంది. రోగిని పక్కన కూర్చో బెట్టుకొని చక్కగా వారు చెప్పింది విని, ధైర్యం చెప్పి, ఆలోచించి మందులు రాసి పంపడం పోయింది . వాళ్ళు వాలి సుగ్రీవుల్లా దూరదూరంగా కూర్చొని (మాస్కుల వల్ల నరులు వానరులయ్యారు) మాట్లాడుకున్న ట్లుంది. డాక్టర్ చిరునవ్వు మాస్క్‌లో మాస్క్ అయిపోయింది.

'తుమ్మితే పోయే ప్రాణాన్ని మాస్క్ ఆపు తుందా?'... అని డాక్టర్ని పల్లెటూరు ఆసామి అడిగినప్పుడు ఉన్న మతి పోయింది డాక్టర్‌కి . మందుల చీటీ తీసుకొని కరోనా కాలం కలికాలం అని నసు క్కుంటూ వెళ్ళిపోయాడు పెద్దాయన.

'నెక్ట్స్' అని పెద్దగా అరిచాడు డాక్టర్ శేషు.

అందరూ ఆన్‌లైన్‌లో అపా యింట్మెంట్ కొనుక్కున్నారు సార్ అని అరిచాడు మాస్కులో నుంచి కాంపౌండర్ అంతలోనే టెలికాల్ వచ్చింది.

'డాక్టర్‌గారు!... వాట్సాప్‌లో చూసి పీడీ మంచం కొనుక్కున్నా ము. అది వాడొచ్చా సార్ ?' అని అడిగాడు అవతలి వ్యక్తి. అంటూనే డాక్టర్ కి వాట్సాప్ లో మంచం బొమ్మపెట్టి చూడ మన్నాడు. చూసి కంగుతిన్నాడు డాక్టర్ శేషు.

డబుల్ కాట్ మధ్య భాగంలో చెక్క పరుపు తీసేసారు. అటు ఇటూ పడుకోవచ్చు మధ్యలో కరోనాకి కట్టబెట్టిన భౌతిక దూరం రూపంలో ఖాళీ జాగా... ఓహో! 'పీడీ' మంచం అంటే 'ఫీజికల్ డిస్టెన్స్' అని కామోసు. అర్థమైపో నాది డాక్టర్‌కి.

"బాబూ! వాట్సాప్ రెండు రకాలు ఒకటి జోకు, రెండు ఫేకు. ఇది జోకుల మంచం. భౌతిక దూరం వుంది కాబట్టి మంచిదే కానీ దొర్లి మధ్యలోకి పడితే?" అడిగాడు డాక్టర్.

"సార్! అన్ని జాగ్రత్తలు తీసుకొని తయారు చేయించా మా ఆవిడక్కూడా నచ్చింది."

"సరే నీ ఇష్టం జాగ్రత్తగా వాడుకోండి!"

మధ్యలో కాల్స్ వస్తూనే వున్నాయి... ఇది బాగుంది అనుకొనే లోపే మళ్ళీ కాల్.

"సార్ మీకు 'బీఎఫ్' హోమ్ తెలుసా?"

'బీ.ఎఫ్' అంటే బూతు కదా?' అనుకొని,

"రాంగ్ నంబర్ పెట్టెయ్యవయ్యా?"

"సార్! గంట కితం మీతో మాట్లాడాను సార్ బీఎఫ్ అంటే బాష ఫర్నీచర్, బాషాని సార్! ఆ మంచం మీక్కూడా ఒకటి చేయించా సార్! డాక్టర్ గారు ఇవి వాడితే కరోనా రాదని చెప్పారు" అని మీరు రికమండ్ చేశారని చెప్పి ఇప్పటికే వంద మంచాలు అమ్మేసాను సార్!"

"నీ అసాధ్యం కూలా!... జోకుని నిజం చేసావే?" అని మెచ్చుకున్నాడు డాక్టర్.

"సార్ ఇది ఫేక్ మెసేజ్ అని పీడీ మంచాలు మా షాప్ పేరుతో వాట్సాప్‌లో పెట్టి పబ్లిసిటీ తెచ్చుకుంటా సార్! అది వైరల్ అయిన తర్వాత మా షాప్‌లో వచ్చి చూడమంటా. చూసి ఇది



ఫేక్ కాదు... రియల్ అని... ఇంకా చాలా మంది కొనుక్కుంటారు. ఫేక్ న్యూస్ మనకు మంచిది సార్! అది పబ్లిసిటీ జిమ్మిక్కు సార్' అని తన ఫేక్ తెలివితేటలు ప్రదర్శించాడు బాషా.

✦ ✦ ✦

నెల రోజుల తర్వాత బాషా వచ్చాడు.

"సార్! నా ప్లాన్ వర్క్ అవుట్ అయింది. మంచాలు బాగా అమ్ముడుపోతున్నాయి. గుజరాత్ కూడా ఒక వంద మంచాలు పంపించాను సార్! అక్కడ ఈ మంచం పేరు 'మోడీ మంచం' అని వాళ్ళే పెట్టుకున్నారు... మోడీ అంటే 'మోర్ డిస్టెన్స్' అన్నట్టు... వాళ్ల అభిమానం మనం కాదనేది ఏముంది సార్!" అని మాస్క్ తీసి నవ్వాడు.

అప్పుడే మొదటిసారి చూసాడు బాషా ముఖ కవళికలు.

రజనీకాంత్ లాగున్నాడు... ఒక్క మంచం నాకు ఇస్తాను అని ఆశ పెట్టి... అలాగే నా పేరు చెప్పి వందల మంచాలు అమ్ముతున్నాడు మనసులో అనుకున్నాడు డాక్టర్.

మొత్తానికి డాక్టర్ శేషుకి ఒక మంచం అంట గట్టాడు. డాక్టర్ ఆయన పెళ్ళాం అటో కళ్లు ఇటొకళ్ళు మంచం అంచుకి అతుక్కొని పడుకున్నారు. మధ్యలో దూరం పాటిస్తూ...

రాత్రి పన్నెండున్నర అయ్యింది.

ఫోన్ మోగింది. ఉలిక్కిపడి లేచి చికాగ్గా సెల్ అందుకున్నాడు డాక్టర్.

"సార్! నిద్రలో నేను మా ఆవిడ... దొర్లి మంచం మధ్యలో ఖాళీలో పడిపోయామండి ఇప్పుడేమి చెయ్యాలి?" అని అడిగాడు.

"ఆ మంచాల బాషాని అడుగు!" అని ఫోన్ పెట్టెయ్యబోయాడు.

"సార్! సార్!!... బాషానే మీ నంబర్ ఇచ్చాడు". అని బతిమాలుతున్నాడు అవతలి సందేహా్రావు.

"బాషా ఇచ్చిన యాప్‌లో చూడు!" అని చెప్పాడు డాక్టర్.

"ఓకే!" అని ఫోన్ పెట్టేసి... యాప్ చూసాడు ఆ సందేహాలరావు.

'మీ భౌతిక దూరం బొత్తిగా తగ్గిపోయింది మీరు బెర్ముడా ట్రయాంగిల్లో పడిపోయారు. బయటికొచ్చి కరోనాకి దూరంగా మంచం అంచులమీద పడుకోండి... లేకపోతే అక్కడే కరొనతో సహజీవనం చెయ్యండి'. అని మెసేజ్ వుంది.

ఒక బలహీన క్షణంలో కరోనాతో సహజీవనం చేసాము ఇక మరణం సారీ మంచం అంచున పడుకుంటాము అని మళ్ళీ పడుకున్నారు సందేహా్రావు జంట.

పావుగంట తర్వాత మళ్ళీ ఫోన్ వచ్చింది.

డాక్టర్ విసిగి పోతున్నాడు.

"సార్! టెలిమెడిసిన్ యాప్‌లో మీ నంబర్ ఇచ్చారు." అన్నాడు అవతల వ్యక్తి.

"బాబు! పొద్దున్న పూట చెయ్యవయ్యా!"

"సార్! ఇది రాత్రి పూట వచ్చే దేహంలో సందేహం!" అని వేడుకుంటుంటే...

"సరే చెప్పు!" అన్నాడు డాక్టర్.

"సార్! మంచాల బాషా బెడ్ రూములో బెర్ముడా ట్రయాంగిల్' అని పాంప్లెట్లు ఇచ్చాడు దీనివల్ల అప్పుడప్పుడు భౌతికదూరం ప్రమాదంలో పడుతున్నది అప్పుడు కరోనా వస్తుందా? రాత్రిళ్ళు మాస్క్ పెట్టుకుని పడుకోవాలా?"

"నువ్వు మూస్కొని పడుకో!"అని డాక్టర్ ఫోన్ కట్ చేసి కట్టేసి పడుకున్నాడు.

గాఢనిద్రలో పక్కకి దొర్లిపోయాడు. అలసిపోయి పడుకున్న 108 కేజీల డాక్టర్ శేషు భార్య కూడా దొర్లి ట్రయాంగిల్‌లో పడిపోయింది.

అదిగో... అప్పుడు శేషు పెట్టిన ఒక గొప్ప ఆర్తనాదం 108 అంబులెన్స్‌కి వినిపించి ఇంటి ముందు ఆగింది.

డాక్టర్ శేషుని 'భౌతికంగా దూరం' అవ్వకుండా కాపాడింది 108 సిబ్బంది.



## ముళ్ళపూడి ముత్యాలు

ముక్కామల: ఏవిటిది? నిన్నిక్కడికి రావద్దనలా?... మళ్ళీ ఎందుకొచ్చావు?

హాలం: పొండీ... పండంటి కాపురాన్ని కాలదన్ని మిమ్మల్నే నమ్ముకుంటే ఇదా?

ముక్కామల: నన్ను నమ్ముకోవడమేమిటి?... నేనేమన్నా తాళి కట్టానా? పో! పో!!

హాలం: ఏంటా పోపోలు! నేనేం రుమాలు గుడ్డని కాను, మడిసిని!

ముక్కామల: తెలుసు తెలుసు, ఓసారి బుద్ధి గడ్డి తిన్నందుకు కట్టానుగా పాతిక వేలు!

రావు: నువ్వు జేసిన పాపానికి పాతికేలే నేటి యిలవ? కొన్నిటికి ఎగస్త్రాగా కరుసవుద్ది మరి!

ముక్కామల: కంట్రాక్టరూ నీకిది ధర్మం కాదయ్యా, కొంప దోచావు, మీరంతా పొండి యిక్కడ్నించి!

రావు: ఊరుకోవయ్యా అయేం మాటలు! నీ కొంపంతా దోచాక నువ్వు పొమ్మనే దాకా వుంటానేటి!... నేనే పోయి... యింకో పని జూసుకోనూ?

ముక్కామల: ఇంకా ఏముందయ్యా నా దగ్గర-ప్రాణాలు తప్ప?

రావు: ఎదవ పాణాలు... ఎవడిక్కావాలయ్యా? అర్దనాకి మూడమ్ముతాను పాణాలు.

✦ ✦ ✦

ధూళిపాళ: ఆశ కొలది పెరుగు - అవని లో నిరాశ. అంటే మనం దేని మీదనయినా ఆశ పడ్డామనుకో, అది రాక పోతే మనకి బాధ కలుగుతుంది... ఏడుపు కూడా వస్తుంది. అసలు ఆశే లేకపోతే ఏడుపు రాదుగా!

ముళ్లపూడి హాస్యకథల పోటీలో **1000 రూపాయలు** బహుమతి పొందిన కథ

# గ్రాండ్ ట్రంక్

కోటమర్తి రాధా హిమబిందు,
7780188651

**"ఇ**దిగో... చెప్తున్నా విను! ఈ ఇంట్లో ఈ పెట్టె అయినా ఉండాలి... లేదా నేను అయినా ఉండాలి ఆలోచించుకో! రేపు మీ చెల్లెలు పెళ్ళికి వెళుతున్నావు కాబట్టి దీన్ని తీసుకొనిపోయి మీవాళ్ళ ఇంట్లో అప్పచెప్పు ఇది ఫైనల్!" అరిచాడు ఆనందరావు.

✦ ✦ ✦

**ఫ్లాష్‌బ్యాక్ లో...**

అలివేలు, ఆనంద్ రావుల పెళ్లి వేడుకగా జరిగింది. మర్యాదలు బాగానే చేశారు. పెళ్లి తర్వాత మూడునిద్రలు కాగానే... ఇద్దరూ బయలుదేరారు. సామాను తీసుకుని బయటకు రాగానే ఎదురుగా పెద్ద ట్రంకు పెట్టె.

"ఇదేమిటి"? చిరాగ్గా అడిగాడు.

"ఇది మా ఇంటి ఆచారం అల్లుడుగారు... మా ఇంటి నుంచి వెళ్లే ఆడపిల్లకు ఈ పెట్టె ఇవ్వాలి... మా అమ్మమ్మ మా అమ్మకు ఇచ్చింది. మాఅమ్మ నాకు ఇచ్చింది... నేను మా అమ్మాయికి ఇస్తున్నాను."

"నేను దీన్ని మీ మనవరాలికి ఇవ్వాలి అంతేగా!" కోపంగా అన్నాడు ఆనందరావు.

"అంతేగా.. అంతేగా...!" అన్నాడు మామ గారు. కొత్తగా పెళ్లి అయిన భార్య చిన్నబుచ్చు కుంటే చూడలేక అత్తవారింటి మొహమాటం తో ట్రంకు పెట్టెను సిటీకి తీసుకొని బయలు దేరాడు.

అప్పుడే ఆనందరావు కష్టాలు మొదల య్యాయి. ఇంటి నుంచి కారు బదులు ట్రాక్టరు లో (కారులో అంత పెద్ద ట్రంకు పట్టదు) బస్టాండ్‌కు చేరారు. దాన్ని చూడగానే అక్కడ ఉన్న హమాలీలు ప్రక్కకు వెళ్లి సిండికేట్ లాగా మారి దీన్ని బస్సు లోపల వేయాలంటే నలుగురు మనుషులు కావాలి ఐదువందలు అవుతాయి అన్నారు. ఆనందరావుకు ఏం చేయాలో తోచలేదు. చేసేదేమీలేక ఒప్పుకున్నాడు.

వాళ్లు ఏడెనిమిది మంది కాళ్లు తొక్కుకుంటూ లోపలికి వెళ్లి దాన్ని అటు ఇటు ఉన్న సీట్ల మధ్య నడిచే తోవలో పెట్టి వెళ్లారు.

పెళ్లిళ్ల టైం కావడంతో బస్సు బాగా రద్దీగా ఉంది. లోపలికి వచ్చిన వాళ్ళు పెట్టె తగిలి బోర్లా పడుతున్నారు... తిట్టుకుంటున్నారు.

బస్సు బయలుదేరింది. కండక్టర్ టికెట్స్ ఇస్తూ ట్రంక్ పెట్టె తగిలి బోర్లాపడ్డాడు. చిల్లర అంతా పడిపోయింది. కోపంగా అరిచి బస్సు ఆపుచేశాడు.

"ఈ ట్రంకు పెట్టె ఎవరిది"? అని అరిచాడు. లాస్ట్‌బెంచ్‌లోస్టూడెంట్‌లాగా ఆనందరావు లేచి నిలబడ్డాడు.

"ఎవర్నడిగి ఈ పెట్టె లోపల వేశారు?! దిగండి!!" అంటూ గద్దించాడు.

ఆనందరావు బిక్క చచ్చిపోయాడు.

గజేంద్ర మోక్షం సీను గుర్తుకు వచ్చింది.

పూనకం వచ్చిన దాని లాగా అలివేలు లేచింది–

"ఏంటి?...అంత గొంతు పెట్టు కొని అరుస్తున్నారు?... ట్రంకు పెట్టె బస్సులో తీసుకు రావద్దని ఎక్కడ రాసి ఉంది? అయినా ఇంత దూరం వచ్చాక దిగమంటే ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి?" అంటూ సత్యభామ లాగా ఫైర్ అయ్యింది.


"అది కాదమ్మా! రద్దీగా ఉంది కదా అని అన్నాను!" అంటూ కండక్టరు సైలెంట్ అయి పోయాడు. ఆనందరావుకు అలివేలు మీద ప్రేమతో పాటు గౌరవం పెరిగింది.

✦ ✦ ✦

సిటీలో బస్సు ఆగింది. ఎట్లాగో తంటాలు పడి పెట్టెను క్రిందికి దింపాడు. దాన్ని చూడ గానే ఆటోవాలాల ముఖంలో ఆనందం వెల్లి విరిసింది.

"సార్! దీన్ని తీసుకు వెళ్లాలంటే క్యాబ్లో పట్టదు ఆటోలో కూడా పట్టదు... టాటా ఏస్ రావాల్సిందే. దానికి రెండు వేలు అవుతాయి. లేదంటే ఓ వెయ్యి రూపాయలు ఇవ్వండి మేము ఉపాయం చేసి ఆటోలో తీసుకొస్తాం!" అన్నారు.

చేసేదేమీ లేక వాళ్ళు చెప్పినట్టు ఒప్పుకొని దాన్ని ఆటో పైన తాళ్లతో కట్టి ఇంటికి చేర్చారు. అక్కడ నుండి దాన్ని ఫస్ట్‌ఫ్లోర్‌కి చేర్చేసరికి ఓనర్



దాన్ని చూసి... ఇంత బరువులు పైన పెడితే రెంట్ పెంచుతానంటూ కిరాయి 200 పెంచేశాడు. ట్రంకుపెట్టెతో వచ్చిన రోజు నుండి పెళ్లయిన ఈ ఆరునెలల్లో ఇప్పటిదాకా ట్రంకు పెట్టెతో నానా ఇబ్బందులు పడ్డాడు.

ఇవన్నీ గుర్తుకొచ్చినప్పుడల్లా ఆనందరావుకు ఒళ్ళు మండిపోసాగింది. మరదలు పెళ్లి కుదిరేసరికి తనకు ఈ ట్రంకు పెట్టె చిరాకు పోతే చాలనుకున్నాడు.

✦ ✦ ✦

**ఇప్పుడు...**

"సరే! ట్రంకుపెట్టె తీసుకెళ్తాను గాని బస్సులోకి ఎక్కించే బాధ్యత మీదే!" అంది అలివేలు.

చేసేదేముంది అని ఒప్పుకొని మళ్లీ ఓ వెయ్యి ఆటోకి ఐదొందలు హమాలీలకు ఇచ్చి బస్సులో పెట్టి హాయిగా ఇంటికి వచ్చాడు.

అలివేలు ట్రంక్ తో బయలుదేరింది.

బస్సులో ఫుల్ రద్దీ.

"అమ్మా! ఈ ట్రంకు ఎవరిదమ్మా"? అరిచాడు కండక్టర్. ఫస్ట్ బెంచీలు స్టూడెంట్‌లాగా

"నాదే!!" అంది అలివేలు.

"ఏమిటీ మీదా? ఎవరో డెబ్బై ఏళ్ల బామ్మది అనుకున్నాను. అయినా దీన్ని ట్రాన్స్‌పోర్ట్‌లో పంపాలి గానీ... బస్సులో తీసుకెళ్తే ఎట్లా?" అన్నాడు కండక్టర్.

"లేదండి! మా చెల్లి పెళ్లి...తనకు దీన్ని ఇవ్వాలి! అందుకే నాతో తీసుకెళ్తున్నాను!" అంటూ కండక్టర్‌కు నచ్చ చెప్పింది. తర్వాత స్టేజీలో ఇద్దరు యువకులు ఎక్కారు. వాళ్ళ చేతిలో చిన్న బ్యాగ్ లాంటిది ఉంది. మెల్లి మెల్లిగా తోసుకుంటూ బస్సు లోపలికి వెళ్లి ట్రంకు మీద కూర్చున్నారు. తర్వాత స్టేజీలో ఇద్దరు పోలీసులు బస్సు ఎక్కారు వాళ్ళని చూడగానే వీళ్ళిద్దరూ వాళ్ళ దగ్గర ఉన్న బ్యాగ్‌ను ట్రంకుపెట్టెలో వేసి కామ్‌గా కూర్చున్నారు.

పోలీసులు మధ్యలో బస్సును ఆపి అందరినీ చెక్ చేశారు. కానీ ఏం దొరకలేదు. ట్రంకు పెట్టెను చూసారు గాని 'దీంట్లో ఏమంటుందిలే' అని వదిలేశారు.

యువకులిద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

బస్సు గమ్యం చేరింది... అలివేలు అడగకుండానే వాళ్ళిద్దరూ సాయం పట్టి పెట్టెను బస్సులోంచి దించారు.

"మేడం మీరు బాత్రూంకి వెళ్లి వస్తే వెళ్ళిరండి! మేమీ పెట్టెను జాగ్రత్తగా చూస్తుంటాం" అన్నారు.

అలివేలుకు ఎందుకో డౌట్ వచ్చింది.

"అబ్బే! అవసరంలేదు!!" అంటూ బస్ స్టేషన్ నుంచి తోపుడు బండి మాట్లాడింది.

"ఏవండీ! మీరు ఒక్కరే కదా మీతో పాటు ఇంటిదాకా వచ్చి సాయం చేస్తాం!" అన్నారు ఆ యువకులు.

"సరే!" అంది అలివేలు.

కొంత దూరం వెళ్ళిన తరువాత వీధి మలుపు తిరగగానే– "అదిగో అదే ఇల్లు!..." అంటూ మూడవ ఇల్లు అలివేలు చూపించేసరికి ఆ యువకులు ఒకరి ముఖం ఒకరు చూసుకుని కంగారు పడిపోయారు.

"ఏమండీ! మీరు వెళ్ళగలరు కదా చిన్న పని ఉంది మర్చిపోయాం... ఏమనుకోకండి!" అంటూ చేతులు జోడించి నమస్కారం పెట్టి వెళ్లిపోతుంటే ఆశ్చర్యంగా చూసింది అలివేలు.

✦ ✦ ✦

ఇంట్లోకి వెళ్లేసరికి ఎవరి మొహంలోనూ పెళ్లి కళ లేదు.

ఏదో పోగొట్టుకున్నట్లు ఉన్నారు. అలివేలుకు ఏం అర్థం కాలేదు. పెట్టె ఇంట్లో పెట్టించి

"ఏంటి అలా ఉన్నారు? ఏం జరిగింది?" అంటూ అడిగింది.

అలివేలు అమ్మ పెద్దగా ఏడుస్తూ చెప్పింది.

"చెల్లి పెళ్లికి చేయించిన నగలు ఈ బీరువాలో పెట్టాము. తెల్లవారి చూసేసరికి నగలు లేవు దొంగలుపడ్డారు" అంటూ చెప్పింది.

"అవునూ.. ఈ ట్రంకుపెట్టె మళ్లీ ఎందుకు వచ్చింది?" అని అడిగింది.

"ఆ ఇంట్లో ట్రంకో... ఆయనో ఉండాలన్నారు! సరే... ఆయనే ఉండనీయిలే అని ట్రంకు తీసుకువచ్చాను!" బాధగా అంది అలివేలు. విస్తుపోతూ చూశారు అంతా.

అన్న కొడుకు బాబీగాడు పెట్టె తలుపు తీశాడు. అలివేలు అమ్మ పెద్దగా అరిచింది.

అందులో బాంబు ఉందని అందరూ తలోవైపు పారిపోయారు. కొన్ని సెకన్ల తర్వాత అలివేలు వాళ్ళ అమ్మ–

"అంతా రండి రా! మన చిట్టి నగలు దొరికాయి. ఇదిగో బ్యాగు!" అంటూ పైకి తీసింది.

అప్పుడర్థమైంది అలివేలుకు.

బస్సులో యువకులు ఎక్కటం, పోలీసులు చెక్ చేయటం, యువకులు తనతో వీధిదాకా రావటం... వాళ్లతో అంతా పూస గుచ్చింది అలివేలు.

"పోన్లే అమ్మా! అల్లుడుగారు ట్రంకు వద్దనటం మనకు మేలే అయింది. దాన్ని నువ్వు తీసుకొచ్చే దానివి కాదుకదా! నగలు దొరికేవి కాదుకదా!! ట్రంకు వల్ల దీని నగలు దొరికాయి! చెల్లి పెళ్లి నిర్విఘ్నంగా జరుగుతుంది. పెద్దవాళ్లు వెళ్ళిపోయినా వాళ్ళు మనల్ని గమనిస్తూ మంచే చేస్తుంటారట!!" అంటున్న భార్యను అలాగే చూస్తుండిపోయాడు అప్పటి రోజుల్లో ట్రంకు పెట్టెతో నానా ఇబ్బందులను ఎదుర్కొన్న ఆనందరావు మామగారు

చిట్టి పెళ్లి కాగానే ఆ ట్రంకుపెట్టె కొత్త అల్లుడు బాధ్యత.

ఆ తర్వాత అతను ఏమంటాడో?



**ముళ్ళపూడి ముత్యాలు**

✦ సృష్టికి బీజం... క్షేత్రం రెండూ అవసరమే... అయినా జన్మించే మొక్క బీజాన్ని బట్టి ఉంటుంది. వరి నాటితే పుట్టే మొక్కని వరే అంటారు గాని గోధుమ అనరు. క్షేత్రం పేరు చెప్పరు.

✦ ఎలుగిచ్చే సూరీడూ, ఎన్నెలిచ్చే సెందురూడూ, నీరిచ్చే ఏరూ, నీడనిచ్చే సెట్టూ... ఇయన్నీ ఉండంగా ఇంకా దేవుడెవరే!

✦ చేతికైదు వేళ్ళూ సమంగా ఉండవు... దేవుడు అందరికీ అన్నీ సమంగా ఇవ్వడు.

✦ ఒక్క వేలు చూపి ఒరులను నిందించ, వెక్కిరించు నిన్ను మూడు వేళ్ళు. ఇతరుల మీద తొందరపడి ఒక్క నింద వేస్తే నీలో మూడు తప్పులు ఉంటాయని మర్చిపోకూడదు అని అర్థం .

ముళ్లపూడి హాస్యకథల పోటీలో **1000 రూపాయలు** బహుమతి పొందిన కథ

# అమ్మ నా పెళ్ళమా!

కొమ్మూల వెంకట సూర్యనారాయణ,
9949602721

**కా**లింగ్ బెల్ మోగటంతో వంటింట్లో ఉన్న అలకానంద ఉరఫ్ అలక విసుక్కుంటూ వెళ్ళి తలుపుతీసి ఎదురుగా ఉన్న ఆవిడని చూసి–

"రండి! రండి... పెద్దమ్మ గారు! " అని పైకి అంటూ... లోపల 'టంచన్‌గా మూడు అవని వ్వదు, ముడేసుకుని తయారయిపోయి ఆ నాలుగు టీ చుక్కలు నోటిలోకి వెళితే కానీ కదలదు' అని మనసులో అనుకుంటూ...

"నత్తా! మీ కోసం వెంకాయమ్మ పెద్దమ్మ వచ్చింది... వచ్చి తగలడి కాళ్ళు కింద పెట్టి కూర్చోండి!" అంది అలక తన అత్తగారి నుద్దేశించి.

"వదినా! విన్నావటే, నత్తా అంటుంది గిత్త లాంటి అత్తను నన్ను పట్టుకుని, నాకు కాళ్ళు నెప్పులు కదా నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొస్తాను కదా! అందుకే ఆ దెప్పుడు. పైగా చూసావటే... వచ్చి తగలడి కాళ్ళు కింద పెట్టి కూర్చోవాలంట!" సాగదీసింది అత్తగారు ఆండాళ్ళు, ఆ మాటలన్నీ కోడలకి వినపడేలా.

"చూసారా! చూసారా పెద్దమ్మగారు, నేనేమో పాపం కాళ్ళు నొప్పులు కదా! వచ్చి తలగడ కాళ్ళు కింద పెట్టి కూర్చోమంటే, వచ్చి తగలడి కాళ్ళు కింద పెట్టి కూర్చోమన్నానంటుంది?... ఎంత సేపూ నన్ను ఆడిపోసుకోవడమే!" అంది అలక వెంకాయమ్మతో.

"సరేలే సంబడం! కాస్త మా ఇద్దరికీ చెరో నాలుగు చుక్కలు టీ తగలెయ్యి!" అంది అత్తగారు అలకతో.

ఎంతకీ వంటింట్లోంచి అలక ఊడిపడకపోవడంతో–

"ఇదుగో ఎలకా!... ఎప్పటికి తెస్తావే టీ... పాపం వదిన వచ్చి అప్పుడే అరగంట అయిందే. ఇద్దరికీ చెరో నాలుగు చుక్కలు టీ ఇవ్వడానికి ఎంత సేపు పడుతుందే..." సాఫీగా సోఫాలో శరీరాన్ని సాచి కాళ్ళు రెండూ బారజాపి తలగడ పై పెట్టి పక్కింటి వదినగారు వెంకాయమ్మతో ఊసుపోని కబుర్లు చెపుతూ అరిచింది ఆండాలమ్మ.

"ఎలకా!...ఎలక ఎవరు ఇక్కడ ఎవరు లేరు నత్తా!..." తిరిగి వంటింట్లోంచే సమాధానమిచ్చింది అలక.

"అయ్యో!అయ్యో!... చూసావటే వెంకాయ మ్మొదినా! నేను ఎలక అన్నానా?... అలకే కదాంటే అన్నాను. పైపెచ్చు నన్నేమో మరల మరల నత్తా అంటూ నంగనాచిలా!" సాగదీసింది ఆండాళ్ళమ్మ.

అలాగే అన్నావే అంటే మళ్ళా టీ ఎక్కడ లేకుండా పోతుందనే భయంతో...

"పోనీలేవే! ఏదో దానికి ఎలకా అని వినిపించిందేమో... అలకే అన్నావులే!..." అంది వెంకాయమ్మ.

హోమియోపతి పిల్స్ వేసుకునే రెండు చిన్న ప్లాస్టిక్ సీసాల మూతలలో చెరో నాలుగు చుక్కల టీ వేసి పట్టుకొచ్చి... వెంకాయమ్మ, ఆండాలమ్మ కూర్చున్న వారి కెదురుగా టీ పాయ్ పై పెట్టింది.





ఇద్దరూ నోరెళ్ళబెట్టి చూస్తుంటే–

"మీరే కదా చెరో నాలుగుచుక్కల టీ ఇమ్మంది!" అంది గడుసుగా.

"చూసావా! చూసావా!! ఎంత యెటకారమే దీనికి? దానంతటికీ కారణం దానమ్మే!" అంది ఆండాళ్ళు వెంకాయమ్మతో.

అంతే! తోక తొక్కిన తాచులా ఎగిసి పడుతూ... "మధ్యలో మా అమ్మ ఏంచేసింది? మా అమ్మని ఏవన్నాఅంటే ఊర్కొనేది లేదు!" అంది.

"విన్నావటే వెంకాయమ్మొదినా, నేనేమ్మ న్నానే, దానంతటికీ కారణం దానిమ్మే కదా నేనంట! ఆ దానిమ్మ గింజలు ఒక్కోటి ఒలుచుకుని నోట్లో వేసుకుంటూ చెప్పిన పని చేయదనే కదే!" అని సమర్ధించుకుంది.

'అమ్మ నా ఆండాళ్ళు!' అని మనసులో అనుకుని "అంతేగా...అంతేగా నువ్వంది!" అని సమర్ధించింది వెంకాయమ్మ.

"పైగా ఈ మధ్యనేం మొదలుపెట్టిందో తెలుసా... దాని కూతురుకి అదే నా మనవరాలికి, నా పేరు ఆండాళ్ళు కలిసొచ్చేలా ఆండాళ్ అని పెట్టిస్తే నా మీదేదో ప్రేమ అనుకున్నా కానీ దాన్ని– "ఏమేవ్! ఆండా, ఎవరి అండ చూసుకునే కదలక మెదలక ఆ సెల్ ఫోన్ వేసుకుని కూర్చొని అనకొండలా శరీరాన్ని పెంచుతున్నావే నీ మొహం మండా!" అని తిడుతుందే, ఇంతకీ అది నన్ను తిడుతుందో, వాళ్ళకూతురుని తిడుతుందో తేల్చుకోలేకపోతున్నానే!!" అంటూ...

"పోనీలే అది పట్టుకొచ్చేదేంటి... నేనే పెట్టి పట్టుకొస్తాలే!" అని టీ పెట్టి పట్టుకొచ్చింది ఆండాళ్ళు.

ఇక ఆ తర్వాత నుంచి వెంకాయమ్మ తన కోడలి లీలలు కథలు కథలుగా వివరించి శెలవు తీసుకుంది.

ఆ రోజు ఆఫీస్ కెళ్ళిన అలకానంద భర్త శేఖర్ కాస్త తలనొప్పి అనిపించి మధ్యాహ్నం శెలవు పెట్టి ఇంటికొచ్చేసాడు.

అతను రావడం తల్లికి తెలియదు.

తన తల్లి, భార్యల మధ్య సంభాషణ అంతా విన్న శేఖర్ చాలా ఆశ్చర్యపోయాడు.

ఎందుకంటే తన భార్య, తల్లి చాలా అన్యోన్యంగా, ఒకరిపట్ల ఒకరు ఎంతో ఆప్యాయంగా ఉంటారు. వీలైనంత వరకు తన తల్లి, వంట పనులలో తన భార్యకు సాయపడటం, అలాగే తన పనులేవో తనే చేసుకోవటం జరుగుతుంది. అటువంటిది ఈ వేళ ఏమయింది ఇలాగ ప్రవర్తిస్తున్నారు? నేను లేని సమయంలో రోజూ ఇలాగే ప్రవర్తిస్తున్నారా? అనే సందేహాలతో కొట్టుమిట్టాడుతూ రాత్రి పక్కకు చేరిన వెంటనే తన సందేహాన్ని బయటపెట్టాడు.

అలక నవ్వుతూ ఇలా సమాధానం చెప్పింది.

"మీ నాన్నగారు పోయినప్పట్నుంచి అత్తయ్య ఒంటరితనం పోగొట్టడానికి అత్తయ్య వయస్కులతో పిచ్చాపాటి మాట్లాడుకుంటే కాలక్షేపం అవుతుందని మన ఇంటికి మీరు, పిల్లలు లేని సమయంలోనే చుట్టుపక్కల వాళ్ళని నేనే రమ్మనేదాన్ని. సహజంగా ఉండే మానవ బలహీనతతో తమకంటే ఎదుటి వాళ్ళు అన్యోన్యంగా ఉంటుంటే ఏవో చాడీలు చెప్పి అన్యోన్యతను చెడగొట్టడానికి ప్రవర్తిస్తారు కదా! అలాగే ఈ వెంకాయమ్మ గారికి, ఆవిడ కోడలికి పడక పోవటంతో మొదట్లో అత్తయ్య, మా మధ్య అన్యోన్యతను చూసి అత్తయ్యతో నా గురించి ఏవో లేనిపోనివి చెప్పేదట! అది చూసి ఇలా కాదని చెప్పి ఆవిడ వచ్చినప్పుడల్లా మేమిద్దరం ఒకరినొకరం దెప్పిపొడుచుకునేలా మాట్లాడుకుందాం... దానివల్ల మనలో మనకి చాడీలు చెప్పటం మానేసి–

'మా కంటే వీళ్ళే బాగా కొట్టుకుంటున్నారనే సంతృప్తితో ఉంటుంది ఆ వెంకాయమ్మ' అని అత్తయ్య చెప్పటంతో అప్పటినుంచి ఆవిడ వచ్చినప్పుడల్లా ఉప్పూ నిప్పూలా చిటపటలాడుతున్నట్లు నటిస్తున్నాం! అంతేనండి!!... ఆవిడకూడా ఇప్పుడు మాలో ఒకళ్ళమీద ఒకళ్ళకి చాడీలు కాకుండా... ఆవిడ కోడలు చిందులు గురించి చెపుతూ కాలక్షేపం చేస్తుంది అదీసంగతి" అని చెప్పేసరికి...

"హమ్మయ్య!" అని ఊపిరి పీల్చుకున్నాడు శేఖర్.




భాను ప్రకాష్ (పంతులు): ఒరే చిట్టాడా! నువ్వు కరణం గారింటికి వెళ్లి కాస్త కరివేపాకు రెబ్బానూ, ఉంటే కాస్త పుల్లమజ్జిగానూ అడగరా!... ఒరే రామిగా...

నాగేశ్వరరావు(గోపీ): ఒరే మునసబు గారింటికి వెళ్లి ములక్కాడలూ, సీతయ్యగారింటికెళ్లి చింతకాయలూ పట్రా, మీకు చదువెందుకులే...

పంతులు:నీకేం బాబూ పూలరంగడివి, అనూ అనూ...

నాగే: లేకపోతే ఈ బడేమిటి మాస్టారూ, ఇదేనా మీరు చెప్పే చదువు?

పంతులు: రోజుకొక్కసారైనా మేత పడక పోతే కామధేనువు వంటి గోవు కూడా ఒట్టి పోక తప్పదు బాబూ!

నాగే: అదేం మాటండి, ఆ ప్రెసిడెంటు గారిని నిలదీసి అడగండి జీతం, తన జేబులో డబ్బు తీసి ఇస్తున్నాడా లేక ఆయనగారి బాబు సొమ్మా?

పంతులు: అంత సత్తా ఉంటే ఇకనేం, బతక లేక బడిపంతులు అన్నారు, నేను బడి పంతులునయి కూడా బతకలేక పోతున్నాను.

పిల్లాడు: బాబాయ్! రాత్రి మాస్టారు అన్నం తినలేదని కస్తూరక్క ఏడ్చింది, అందుకని బామ్మతో చెప్పి దేవుడి ప్రసాదం తెచ్చాం .

నాగే: ఆ ప్రెసిడెంటుగారు ఇంత దారుణంగా ప్రవర్తిస్తున్నాడని తెలియదు.

✦ ✦ ✦

పోలీసు: నేరం చెయ్యడం ఎంత నేరమో, నేరస్తులని పోలీసులకి దొరక్కుండా చెయ్యడం అంతకంటే నేరం.

ముళ్లపూడి హాస్యకథల పోటీలో 1000 రూపాయలు బహుమతి పొందిన కథ

# లాక్‌డౌన్

జె.యస్.వి. ప్రసాద్

**కి**ష్టప్ప దొంగతనాలు మానేసాడు.

అందరిలోనూ ముద్ర పడిపోయిన కారణంగా అతనికెక్కడా పని దొరకడం లేదు. చేతిలో డబ్బులాడడం లేదు. ఏదైనా పని దొరికి ఐదూ పదీ వచ్చినా తిండికి చాలడం లేదు.


ఆ రోజు అతనికి చాలా ఆకలిగా వుంది. డబ్బుల్లేవు. చిన్నప్పుడు తనతో కలిసి చదువుకుని ఇప్పుడు స్వంతంగా ఒక హోటల్ నడుపుతున్న సుందర్రావు దగ్గరికి వెళ్లాడు.

అతను చాలా పిసినారి అని తెలిసి కూడా...!

"సుందరం బాగా ఆకలిగా వుంది. సింగిల్ ఇడ్లీ రెండు ప్లేట్ల సాంబార్ చాలు. ఏదైనా పని దొరికాక నీ డబ్బులిచ్చేస్తా! పోనీ నువ్వే ఏదైనా పని చెప్పినా సరే..." అనడిగాడు అభ్యర్ధనగా.

"ఇప్పుడు మంచి బేరాల టైం. సాయంత్రం రా! ఏమన్నా మిగిలిపోతే పెట్టిస్తాను." అన్నాడు చిరాగ్గా సుందరం.

కిష్టప్ప కాళ్లా వేళ్లా పడి బ్రతిమాలినా అతను కొంచెం కూడా కరగలేదు.



కిష్టప్ప ఉసూరుమంటూ వెళ్లిపోయి పావు గంట తర్వాత మళ్లీ వచ్చాడు.

అతని మొహం మీద నుంచి చెమటలు కారిపోతున్నాయి.

ఖళ్ ఖళ్ మంటూ దగ్గుతున్నాడు. కొందరు అతని వైపు అనుమానంగా చూసారు.

అతను ఏమీ పట్టించుకోకుండా సుందరం కౌంటర్ ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని సర్వర్‌ని పిలిచి నలుగురికి సరిపడా ఆర్డర్ చెప్పాడు.

సర్వర్ అవన్నీ తెచ్చి టేబుల్ పై పెట్టాక అప్పుడొచ్చింది అనుమానం సుందరానికి ఆలస్యంగా.

"ఇందాకల డబ్బుల్లేవన్నావుగా ఇప్పుడెలా వచ్చాయ్ రా దొంగ వెధవా?" అన్నాడు.

"ఇకనుంచీ డబ్బులఖర్లేదు బ్రదర్! ఇందాక కరోనా టెస్ట్ చేయించుకుంటే పాజిటివ్ వచ్చింది. నీ హోటల్లో టిఫిన్ తినాలనిపించి పారిపోయి వచ్చాను... ఇంక పధ్నాలుగు రోజులు క్వారంటైనే. ఆళ్ళే పుద్దూ....బెడ్డూ!" అన్నాడు గట్టిగా.

'పాజిటివ్' అన్న మాట వినగానే టిఫిన్లు ఆర్డర్ చెప్పినవాళ్ళూ, తిన్నవాళ్ళూ, తింటున్నవాళ్ళూ చేతులూ, మూతులూ కడుక్కోకుండానే ప్లేట్లతో సహా పారిపోయారు. ఒక్కడూ బిల్లు కట్టలేదు.


సుందరం మొహం తెల్లగా, కళ్ళు పచ్చగా అయిపోయాయి.

మరో పావుగంటకి తాపీగా తినడం పూర్తి చేసి 'టీ' ఆర్డర్ చేస్తే ఒక సర్వర్ 'టీ' తెచ్చి దూరంగా మరో టేబుల్ మీద పెట్టి కిచెన్‌లోకి పారిపోయాడు.


కిష్టప్ప విలాసంగా టీ తాగుతూ–

"సుందరం! ఈ మిగిలిపోయిన టిఫిన్లన్నీ పార్శిల్ చేయించి ఇచ్చేయ్! మిగిలినవన్నీ నాకే అన్నావుగా!! గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చుకున్నావ్. ఇక పధ్నాల్గు రోజులు నీ హోటల్ లాక్ డౌనే! మనిద్దరం ఫ్రెండ్స్ కదా!... క్వారంటైన్లో కలుసుకుందాం!" అంటూ నవ్వుతూ చంకల్లోని ఉల్లిపాయలు తీసి పారేసాడు.


## లాఫింగ్ మాస్క్



ఓ మాస్కు విసిరేస్తే బయటికి వస్తానన్నా !!...

మాకు ధర్మం సేయకపోయినా పర్లేదులే గానీ..!తమరు మాస్కు ధరించి, తోటి మనుషులకు ప్రాణ దానం సేయండి చాలు బాబయ్యా..!!

మాస్కేది?
ఇదుగోండి సార్ నా మాస్క్!
నా మూతి మీద మీసము వేకుండా గుమ్మము దాటను..
అందుకే సార్ ఇలా
POLICE






పిల్లల కోసం
సరికొత్త
విచిత్ర విందు
ప్రముఖ రచయిత
పుట్టగుంట సురేష్ కుమార్ గారు
బాలల నవలగా
అడవిలోని
చిన్నారుల నేస్తాలు
చేసే
నవ్వుల విన్యాసాలను
నెల నెలా
మనకందిస్తున్నారు.
వచ్చే సంచిక నుండే ప్రారంభం!
సీక్రెట్: మనం కూడా చదువుకుని నవ్వుకోవచ్చండోయ్!


# నెల నెలా నవ్వుల వెన్నెల


**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** అందరూ కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- వ్యాక్సిన్





వ్యాక్సిన్ దొరక లేదట స్వామి!!
ఫస్ట్ డోస్ వ్యాక్సిన్ వేసిన నర్సుతోనే సెకండ్ డోస్ కూడ వేయించుకుంటానని వెళ్తే ఆవిడ డ్యూటీకి రాలేదని వాళ్ళ గోడదూకి వెళ్ళాడట పిన్నీ
కోవిడ్ వాక్సినేషన్ సెంటర్
మిగిల్చిన వాక్సిన్ వల్ల ఒక్క కరోనాతో పోరాడి గెలవడమేనా మరి ఆవిడతో పోరాడి గెలిచే అవకాశం ఏమైనా ఉందా సిస్టర్—!
ఏంటేంటో కరోనాకి 'వ్యాక్సిన్' అవసరం లేదా? ఈయన నాటుమందులోనే ప్రజలకు ఫ్రీగా నయం చేస్తాడా..? నా బొమ్మల్లి కంపెనీ ఏం కావాలి..? ముందిలన్నీ కట్టి లోపల పడేయ్..!!
ప్రజాబంధువు
ఆ.వే.నా.మూర్తి తెలుగు పండితులు
ఆ టీకాలూ తాత్పర్యాలూ మీరే ఇవ్వొచ్చు కదండీ ఆ లైన్లలో నేను నిలబడలేనూ.
Meeting.
వాక్సిన్ ఇంకో రెండునెలలదాకా వచ్చే అవకాశం లేకుంటే.. ఇంకో రెండునెలలవరకు వందసంవత్సరాలు నిండిన వారికి మాత్రమే ఇస్తామని చెప్పండయ్యా బాబూ....
నాన్నారు తీసుకున్నది కోవా కాదు.... కోవాక్సిన్....
కోవా
పెండేల
ఇంకేం చెప్పకు.. నాకర్థమైంది.. అప్పట్లో నువ్వు చెప్పినప్పుడు వాక్సిన్ వేసుకోలేదనేగా?! అది మనసులో పెట్టుకుని ఇప్పుడు తీసుకెళ్ళడంలేదు.
వ్యాక్సిన్ కొరత




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది.

**ప్రస్తుతం...**

**"ఎవరో ఒక అమ్మాయిని చూసి ప్రేమించు." అన్నాడు పోలీసు.**

**"ఇంకా అంత ధైర్యం చేయలేదులెండి. ఏంటి విషయం?" అన్నాడు మైఖేల్ నవ్వుతూ.**

**"ఒక ఇండియన్ లేడీ కిడ్నాప్ అయ్యింది. వెతుకుతున్నాం. ఈ ఏరియాలో ఈమెను చూసారా?" అన్నాడు పోలీస్ తన ట్యాబ్‌లో ఉన్న రచన ఫోటో చూపిస్తూ.**

**మైఖేల్, చూడలేదన్నట్లు తల అడ్డంగా ఊపాడు.**

**"పోనీ ఈ అమ్మాయిని చూసారా?"అన్నాడు పోలీస్ సౌమ్య ఫోటో చూపిస్తూ.**

**"లేదు! ఎవరు వీళ్లిద్దరూ..." అన్నాడు మైఖేల్ ఆసక్తిగా చూస్తూ.**

"మాకు ఉన్న పని చాలదన్నట్లు ఈ కిడ్నాపు కేసులొకటి. నిన్న రాత్రి ఇండియన్స్ ది ఏదో ఫంక్షన్ అయ్యింది... తెలంగాణ ఈవెంట్ అని. అక్కడికి వచ్చిన ఈ ఇద్దరు అమ్మాయిలు ఓ గంట తేడాలో కిడ్నాపుకు గురయ్యారు. ఈ ఇద్దరినీ ఒకే గ్యాంగు కిడ్నాప్ చేసి ఉండొచ్చని అనిపిస్తోంది!" అన్నాడు పోలీస్.

"ఓహ్!..." అన్నాడు మైఖేల్.

"ఒకవేళ చూస్తే... 911కు కాల్ చేసి చెప్పండి!" అన్నాడు పోలీస్ వెళ్ళిపోతూ.

మైఖేల్ సరేనన్నట్లు తలూపుతూ... ఎదురింటి వైపు చూసాడు. ఇంకో పోలీస్ అక్కడ నిలబడి... వాళ్ళకు రచన ఫోటో చూపిస్తూ మాట్లాడుతున్నాడు.

పోలీసులు వెళ్ళిపోగానే తలుపు వేసాడు.

"ఆశ్చర్యంగా ఉంది. సరిగ్గా ఈ కాలనీలోనే ఎలా వెతుకుతున్నారు?" అంది రచన.

"ఈ ఒక్క కాలనీ కాదు. నాకు తెలిసి, ఈ చుట్టుపక్కల మొత్తం అన్ని కాలనీలలో వెతుకుతుంటారు." అన్నాడు మైఖేల్.

"జాగ్రత్త! మిమ్మల్ని పట్టుకుంటారేమో!" అంది.

మైఖేల్ నవ్వి... "నేరం చేసేవాడు ఏనాడైనా పట్టుపడాల్సిందే మేడం! ఐనా... మీ కిడ్నాప్ విషయంలో మీ భర్త వెంటనే పోలీసులకు సమాచారం అందించి... బాగానే యాక్టివ్‌గా

ఉన్నాడు. నా పెళ్ళాన్ని ఎవడైనా ఎత్తుకుపోయి ఉంటే, అసలు ఫీల్ అయ్యేవాడినే కాదు. నా పెళ్ళాం పెట్టే టార్చర్ భరించలేక...దాన్ని ఎవడైనా కిడ్నాప్ చేస్తే బాగుంటుంది అని అప్పుడప్పుడు అనుకుంటూ ఉండేవాడిని!" అన్నాడు.


ఆమె నవ్వి ఊరుకుంది.

"మేడం! మీరు లాయర్ రామం భార్య అని తెలిసాక, మిమ్మల్ని వదిలెయ్యలేను. మిమ్మల్ని ఇక్కడ ఎంతసేపు ఉంచమని నాకు చెప్తారో... అంతసేపు ఉంచుతాను. మీరు ఇక్కడ స్వేచ్ఛగా ఉండొచ్చు!" అన్నాడు.

"కానీ మా ఆయన ఖంగారుపడుతుంటాడు. నా ఫోటో, అన్ని పత్రికలలో వస్తుంది. అది నాకు ఇష్టం లేదు!" అంది.

"మీరు క్షేమంగా ఉన్నారనే సమాచారాన్ని, మీ ఆయనకు చేరవేస్తాను మేడం... అలా






అయినా, ఆయన కాస్త ప్రశాంతంగా ఉంటారు కదా!" అన్నాడు.

"సరే! ఆ పని చెయ్యి!" అంది.

వెంటనే, తన డెస్క్ నుండి, ఓ పాత సెల్ ఫోన్, సిమ్ కార్డ్ తీసుకొని–

"ఇక్కడి నుండి చేస్తే, పోలీసులు పట్టేస్తారు మేడం, కెమెరాలు లేని ప్రాంతాలు ఉంటాయి. అక్కడికి వెళ్ళి, ఈ సిమ్‌ను ఫోన్‌లో వేసి, కాల్ చేస్తాను. ఆ తర్వాత సిమ్‌కార్డ్‌ను, సెల్‌ఫోన్‌ను పారేసి వస్తాను!" అన్నాడు.

"నీ సీక్రెట్లన్నీ నాకు చెప్పేస్తున్నావ్ జాగ్రత్త!" అంది నవ్వుతూ.

"ఈ రోజుల్లో చాలా మంది చాలా తెలుసు అనుకుంటారు మేడం... నా పెళ్ళాం లాగా! కానీ ఏమీ తెలీదు!" అనేసి ఇంటికి తాళం వేసి బయటికి వెళ్ళిపోయాడు.

కారులో చాలా దూరం ప్రయాణించి, కారును కెమెరాలు లేని ఓ కాలనీ లో పార్క్ చేసి, అక్కడి నుండి నడుచుకుంటూ తుప్పల్లోకి వెళ్ళాడు.

కర్చీఫ్‌ను ఉండగా చుట్టి, తన నోటికి అడ్డం పెట్టుకుని, లాయర్ రామానికి ఫోన్ చేసాడు.

అటు నుండి లాయర్ రామం ఫోన్ ఎత్తాడు.

మైఖేల్ నోటికి గుడ్డ అడ్డం పెట్టుకొని...

"హలో..." అన్నాడు.

"హలో మైఖేల్!... బాగున్నావా?" అన్నాడు రామం.

మైఖేల్ కంగారు పడి, ఆ గుడ్డను మరింత గట్టిగా నోటికి నొక్కుకుంటూ,గొంతు మార్చి...

"హా..హలో..." అన్నాడు.

"ఆ మైఖేల్ చెప్పు! ఎలా ఉన్నావ్? నోటికి ఏదో గుడ్డ అడ్డం పెట్టుకొని మాట్లాడుతున్నట్లు వస్తోంది నీ వాయిస్!" అన్నాడు రామం.

రామం, తాను అన్న ఒక్క "హలో" అనే పదాన్ని బట్టి తన ఎలా గొంతు గుర్తుపట్టాడో మైఖేల్‌కు అర్థం అయ్యింది.

''హా..హలో..స..స..సర్...''అన్నాడు మైఖేల్.

"ఫోనే లేదు నీ నుండి?" అన్నాడు రామం నవ్వుతూ.

"సర్! మళ్ళీ మీకు ఫోన్ చేయాలంటే మళ్ళీ విడాకులు తీసుకోవాలనే అవసరం రావాలి కదా!" అన్నాడు మైఖేల్.

"హేయ్! మైఖేల్... కమాన్ మేన్! విడాకులు తీసుకున్న క్లైంట్లు, మళ్ళీ పెళ్ళి చేసుకునేటప్పుడు నన్ను వాళ్ళ పెళ్ళికి పిలుస్తుంటారు. నాకు నువ్వు మళ్ళీ కాల్ చేయలేదేంటి అంటే... అదీ నా ఉద్దేశ్యం!" అన్నాడు రామం.

"మళ్ళీ పెళ్ళా?! లేదు సర్! అంత ధైర్యం లేదు."

"భయపడకయ్య. అందరూ అలా ఎందుకు ఉంటారు? నేనూ, నా భార్య సుఖంగా ఉన్నాం కదా! మంచి అమ్మాయిలే ఎక్కువ మంది ఉంటారు. ఐనా, మొగుడు పెళ్ళాల మధ్య మంచీ చెడు అని కాదు గానీ... సర్దుకుపోయే లక్షణం ఉంటే చాలు! ఇంతకూ ఎందుకు ఫోన్ చేసావ్?" అన్నాడు రామం.

ఠక్కున ఏం చెప్పాలో... మైఖేల్‌కు అర్థం కాలేదు.

"నేను మా ఫ్రెండ్ రామెన్‌కు ఫోన్ చెయ్యబోయి పొరపాటున మీకు చేశాను సర్!" అన్నాడు మైఖేల్.

"ఓహ్...అందుకేనా, నేను హలో అనగానే కంగారు పడ్డావ్!" అన్నాడు రామం.


"అవును సర్! సారీ సర్!"అన్నాడు మైఖేల్.

"దానిదేముంది లేవయ్యా!... తప్పులు అందరూ చేస్తారు!" అన్నాడు రామం.

"ఉంటాను సార్!" అన్నాడు మైఖేల్.

"మంచిది!" అన్నాడు రామం.

మైఖేల్ ఫోన్ కట్ చేసి– 'వామ్మో! ఈ లాయర్



చాలా షార్ప్!' అనుకుంటూ మైఖేల్ వెనుదిరి గాడు.

మైఖేల్ ఇంట్లోకి వచ్చి తలుపేసాడు.

రచన జూస్ తాగుతూ, టివి చూస్తోంది.

"మా ఆయన ఏమన్నాడు?"అడిగింది రచన.

"వామ్మో! వాయ్యో!! మీ ఆయన మామూ లోడు కాదు మేడం. నా గొంతు వినగానే గుర్తు పట్టాడు. నేనిక,ఏమీ చెప్పలేకపోయాను!" అన్నాడు మైఖేల్.

"మా ఆయన తెలివి గురించి, నీలాంటి క్లైంట్లు మెచ్చుకోవాల్సిందే గానీ, నాకు పెద్దగా నమ్మకం లేదు!" అంది రచన నవ్వుతూ.

"ఎందుకు మేడం?"

"అబ్బో! చాలా తప్పులు చేస్తాడు. పొయ్యి మీద పాలు పెట్టి, కాస్త చూడమంటే చూడడు. పాలు పొంగిపోయి పొయ్యి అంతా పాడవు తుంది. షవర్ ఆఫ్ చెయ్యకుండా వస్తాడు... టివి ఆన్‌లో పెట్టి, పడుకుంటాడు!" అంది నవ్వుతూ.

"ఇవే పనులు మేము చేస్తే, మా భార్యలు మాకు విడాకులు ఇస్తారు మేడం...ఇలా నవ్వుతూ ఉండరు!" అన్నాడు.

✦ ✦ ✦

మొదటగా కిడ్నాప్ అయిన సౌమ్య, తనను కిడ్నాప్ చేసిన ఓలేతో అంది–

"స్నానం చేసి, కట్టుకోవడానికి నాకు బట్టలు కావాలి... ఇవే వేసుకోలేను!" అంది.




"స్నానం గీనం ఏమీ చెయ్యకు. నిన్ను వదిలే సాక మీ ఇంటికెళ్ళి చెయ్యి!" అన్నాడు చిరాగ్గా.

"ఏం? ఇక్కడ వాటర్ ప్రాబ్లం ఏమీ లేదే? ఎందుకు చెయ్యకూడదు?" అంది.

"అవసరం లేదు!" అన్నాడు.

"నేను చేస్తాను. నన్ను స్నానం చేయకుండా కూర్చోమని చెప్పే హక్కు నీకు లేదు!" అంది.

"ఈ హక్కులు పోరాటాలు అనే, మా మైఖేల్ గాడిలాంటి అమాయకుడి కొంపముంచింది వాడి పెళ్ళాం!" అన్నాడు ఓలే.

"ఏ మైఖేల్? దిబ్బరొట్టెలా ఉంటాడే? ఆ మైఖేలా? విడాకులు తీసుకున్నాడు... లాయర్ రామం అతని కేసు వాదించాడు. ఆ మైఖే లేనా?" అంది.

"అమ్మా గూగులమ్మ! ఈ ప్రపంచంలో నీకు తెలియని విషయమే లేదా?" అన్నాడు ఓలే ఏడుపు మొహంతో.

"ఇంతకీ... నాకు బట్టలు తెచ్చి ఇస్తావా లేదా?"

"స్నానం చెయ్యకు!" అన్నాడు.

"సరే నీ ఇష్టం. నీ భార్య ఎడినా, ఆమె పాత బాయ్‌ఫ్రెండ్ ఆంటోనియో ఇద్దరూ కలిసి ఒకసారి హవాయ్‌కు వెకేషన్ కోసం వెళ్ళారు. అప్పుడు స్నానం విషయంలో ఇద్ద రికీ గొడవ అయ్యింది. తెలుసుగా... నీ భార్యకు బ్రాండ్ల పిచ్చి. తను వాడే సబ్బు, తను వేసుకునే పర్ఫ్యూం నుంచి అన్నీ తనకు నచ్చిన బ్రాండ్లే ఉండాలి. లేదంటే పీకి పాకం పెడుతుంది. అలా ఒక బ్రాండ్ విషయమై వాళ్ళకు గొడవ అయ్యింది. ఆ గొడవ వల్ల ఇద్దరికీ బ్రేకప్ అయిపోయేది. కానీ, రీసెంట్‌గా జరిగిన ఒక సంఘటన వల్ల వాళ్ళు మళ్ళీ కలుసుకున్నారు." అని ఊరుకుంది సౌమ్య.


"గొడవ ఎందుకు జరిగింది?... మళ్ళీ ఎందుకు కలుసుకున్నారు?"ఆత్రంగా అడి గాడు ఓలే.

సౌమ్య చెప్పకుండా, విజిల్ వేయసాగింది.

"చెప్పు...చెప్పు!"అన్నాడు.

"నేను స్నానం చెయ్యాలి. నాకు బట్టలు తీసుకొని రా! అప్పుడు చెప్తాను!!" అంది.

"లేకపోతే చెప్పవా?" అన్నాడు సీరియస్‌గా ఆమె దగ్గరికి వస్తూ. **(సశేషం)**





# తెలివి ఒకరి సొమ్మా!

శింగరాజు శ్రీనివాసరావు, 9052048706

'చూసిన పాముకు బొక్కన పడనీయదు' అన్న సామెతలా ఉమాదేవి షాపుకు వెళ్ళింది అంటే చాలు ఒకటికి రెండు చీరెలు ఖచ్చితంగా కొనవలసినదే.

ఆమెకై ఆమె షాపుకు వెళ్ళినా, వేరే ఎవరైనా తోడురమ్మని పిలుచుకుని వెళ్ళినా... ఈమె తప్పక చీర కొనవలసిందే.

గ్రంథాలయం బీరువాలలో పుస్తకాలు పేర్చినట్టు, మన ఉమాదేవి కూడ తన చీరెలను ఓ నాలుగు, ఐదు బీరువాలలో పేర్చి పెడుతుంది. బహుశా ఏడుకొండలు సంపాదనలో ఓ యాభై శాతం చీరలకు తగలెట్టి ఉండివుంటాడంటే పెద్దగా ఆశ్చర్యపోవలసిన పనిలేదు.

"కట్టినా వస్త్రంబు కట్టదే రాజు" అని పెద్దవాళ్ళు ధర్మరాజు గురించి పాట పాడినట్లుగా, మన ఉమాదేవి పెళ్ళిళ్ళు, పేరంటాలకు కట్టిన చీర కట్టకుండా పోతుంది. అంత పిచ్చి ఆమెకు చీరలన్నా, చీరెల షాపింగన్నా.

ఆమె చిన్నతనం నుంచి కొన్న చీరెలు కూడ ఇంకా బీరువాలోనే మూలుగుతున్నాయి.

అప్పటికీ ఏడుకొండలు– "ఎందుకే ఇన్ని చీరెలు కొంటావు?" అని ఏటేటా ఏడుస్తూనే ఉంటాడు. దానికి ఉమాదేవి చిరునవ్వే సమాధానంగా ఇస్తుంది.

ఎప్పుడో ఏడాదికి ఒకటి, రెండు చీరెలు తప్ప పనిపిల్లలకు కూడ ఎక్కువ ఇవ్వడానికి మనసొప్పదు ఆమెకు.

ఒక ఏడాది క్రితం ఉమాదేవి ఇంట్లో పనికి కుదిరింది భాగ్యం. వయసు నలభైలో పడ్డా పాతికేళ్ళ పిల్లలా చలాకీగా ఉంటుంది భాగ్యం. తన మాటతీరుతో, ఒద్దికతో, పనిలో వేగంతో ఉమాదేవి మనసును దోచుకుంది... ఏ పని చెప్పినా కుదరదు అని అనకుండా చకచకా చేసుకుపోయే భాగ్యం మీద గురికుదిరింది ఉమాదేవికి.

ఉమాదేవిని మాటల్లో పెట్టి తనకు కావలసిన వాటిని చల్లగా గిల్లుకోవడంలో తెలివిని ప్రదర్శించేది భాగ్యం.

" భాగ్యం ఎలావుందే నాకీ చీర?" అడిగింది ఉమాదేవి తను కొన్న చీర కట్టుకుని.

" ఎలావుందేంటి అమ్మగారు!... మీరు కట్టుకుంటే ఆ చీరెకే అందమొస్తుంది. భలే వుందమ్మ! మీరు సన్నగా నాజూకుగా ఉంటారాయె. ఏ చీరెకట్టినా బొమ్మలో చీరకట్టిన అమ్మాయికి మల్లే ఉంటారు." వంకరలుపోతూ చెప్పింది భాగ్యం.

"చాల్లేవే! నీ పొగడ్తలు నువ్వూను!! ఎలా వుంది చెప్పమంటే నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నావు కదే!!" మనసులో మురుసుకున్నా, ఆ భావాన్ని బయటకు రానీయకుండా మాట్లాడింది ఉమాదేవి.

" అబద్ధాలు కాదమ్మా! సత్తెపెమాణంగా మీరు ఏ చీరకట్టినా భలే సోగ్గా ఉంటది."

"నీకు కూడ అంతేలేవే! ధర తక్కువ చీర కట్టినా నాజూకుగా కట్టుకువస్తావు. నిన్నసలు పనిపిల్ల అనుకోరు ఎవరూ!"

"అంతా మీ అభిమానం తల్లీ! అయినా మాబోటోళ్ళకు మంచి చీరెలు ఎవురిత్తారమ్మా, చింకి చీరలు తప్ప... ఇస్తే గిస్తే మీలాంటి మనసున్నోల్లు తప్ప... మాలాటి మొహాలకు మంచి చీరె కట్టే రాతలుండొద్దూ!" తెలివిగా దెబ్బకొట్టింది భాగ్యం.

"నిజమేనే నువ్వు చెప్పింది. కొందరికంతే మంచి చీరెలు పనివాళ్ళకు ఇవ్వాలంటే చేతులు రావు. ఎన్ని చీరెలు మూలుగుతున్నా, ఇవ్వడానికి బుద్ధిపుట్టదు!" గురివింద తన నలుపు మరిచినట్లు, తన నైజాన్ని దాచిపెట్టి మాట్లాడింది ఉమాదేవి.


"నిజమేనమ్మా! అందరికీ మీలా విశాలమైన మనసుండొద్దూ. ఏదో నా అదృష్టం బాగుంది గాబట్టి మీ ఇంట్లో చేరినా" మనిషికున్న సహజ బలహీనతను తట్టిలేపింది.

భాగ్యం మాటలకు ఉబ్బితబ్బిబ్బయింది ఉమాదేవి.

"అమ్మగారు! ఓ చిన్నమాట అడుగుతా... ఏమనుకోరుగా?" అతివినయం ప్రదర్శించింది భాగ్యం.

"నా దగ్గర నీకు మొహమాటమేమిటే... నువ్వు మా ఇంటి మనిషిలాంటి దానివి... అడుగు నీకేం కావాలో!" భరోసా ఇచ్చింది.

" ఏంలేదమ్మా! మీ ఇంట్లో పనికిజేరి సంవత్సరం దాటిందిగదా... సంక్రాంతి పండగొస్తున్నాది గదా! మరి...మరి..." అడగడానికి తటపటాయించింది భాగ్యం.



" నానుస్తావెందుకే అడుగు!"

"అందరూ పండక్కి పనోల్లకి చీరె కొనుక్కోమని డబ్బులిస్తారు. మీరు కూడ నాకు...."

భాగ్యం పథకం అర్థమయింది ఉమాదేవికి. చల్లగా మాటల్లో పెట్టి డబ్బు తీసుకెళ్ళి కొత్త చీర కొనుక్కోవాలని దీని ఆలోచన. అమ్మో అంత తేలికగా డబ్బులిస్తానా! ఇప్పుడే దీన్ని చూసిన వాళ్ళంతా 'మీ పనిమనిషిని చూస్తుంటే అచ్చు నీ చెల్లెల్లా ఉంటుందే' అంటున్నారు. దీనికి కొత్తచీరె కొనిపెడితే ఇంకేమైనా ఉందా!

ఉహూఁ...దీనికి నాలుగు పాతచీరలు అంటగడతా.

"ఓసి పిచ్చిమొహమా!... దానికేనా ఇంత కంగారు, భయం... దానిదేముంది అలాగే చేద్దాం. కాకపోతే ఒక్కమాట. నేనిచ్చే అయిదు వందలకు మంచి చీరెలేమొస్తాయి. నా పాత చీరెలు నాలుగు ఇస్తాను... చెక్కుచెదరనివి ఉన్నాయి. లక్షణంగా పండగరోజుల్లో రోజుకొకటి కట్టుకో. అవి నా దగ్గరుంటే పాతవి. నీ దగ్గరకొస్తే... నీకు కొత్తవేగా! ఏమంటావు?" అతి తెలివి ప్రదర్శించింది ఉమాదేవి.

ఖంగుతిన్నది భాగ్యం.

'తన తెలివితేటలంతా ఉపయోగించి బుట్టలో వేసినా, మహాతల్లి పైసా కూడ రాల్చటం లేదు. అందుకే కాబోలు ఈమె దగ్గర ఏ పని మనిషీ సరిగా నిలబడదు. ఎన్ని మాయ మాటలు చెప్పాను సంవత్సరం నుంచి, కానీ ఏం లాభం... కనీసం వెయ్యి రూపాయలు అదనంగా తీసుకో లేకపోయాను. నోరుతెరిచి అడిగితే ఈమె దేకిదేకి పారేసిన పాతచీరలు నాలుగు ఇస్తుందట!... 'ఛ!' అని మనసులో శతమానం పెట్టింది ఉమాదేవిని.

"ఏమిటే పలకవు? ఇవ్వనా?!" మరల అడిగింది ఉమాదేవి.

"భలేవారమ్మా! పాతచీరెలంటారు గానీ... మరీ చినిగిపోయినవి ఎందుకిస్తారు. గట్టివే ఇవ్వండమ్మా! మీ పేరు చెప్పుకుని ఓ సంవత్సరం పాటు కట్టుకోవద్దూ!..." చురకలాంటి విసురు విసిరింది భాగ్యం, చచ్చినోడి పెళ్ళికి వచ్చిందే చాలనుకుని.


"తప్పకుండానే! కొత్తకారకం వదలని చీరెలిస్తానుండు" అని లోనికి వెళ్ళింది ఉమాదేవి.

'అమ్మో అమ్మగారు పెద్ద జీడిపాకం' అనుకుంది భాగ్యం.

చెప్పినట్లుగానే నాలుగు చీరలు తెచ్చి ఇచ్చింది ఉమాదేవి.

విప్పదీసి చూసుకుంది భాగ్యం.

మరీ పాతవి కాదుగాని, పర్వాలేదనిపించింది భాగ్యానికి. ఈ మధ్యకాలంలో ఉమాదేవి వంటిమీద మెరిసిన బట్టలే అవి. వాటిని పరిశీలిస్తూనే కొత్త ఆలోచన చేసింది భాగ్యం. అంతే ఆమె ముఖం తామర పువ్వులా వికసించింది.




"బాగున్నాయి అమ్మగారు! శానా థ్యాంక్స్. పండక్కి కొత్తచీర వచ్చింది. ఉంటానమ్మగోరు!" అంటూ మరో మాటకు తావివ్వకుండా ఉడాయించింది భాగ్యం.

✦ ✦ ✦

సంక్రాంతి పండుగ రానే వచ్చింది.

మూడురోజులు సెలవు అడిగిన భాగ్యాన్ని బ్రతిమలాడుకుని సంక్రాంతి నాడు పనికి వచ్చేలా చేసుకుంది ఉమాదేవి.

సంక్రాంతిరోజు ఎనిమిది గంటలకు వచ్చింది భాగ్యం. వంటిమీద సిల్కు చీర మెరిసిపోతున్నది. ఏ మాటకామాట గానీ భాగ్యాన్ని చూస్తూనే–

'ఎంత బాగుంది ఇది ఈ చీరెలో' అనుకుంది ఉమాదేవి. వెంటనే ఆమెకొక అనుమానం వచ్చింది... మొన్న కూడ మాటల్లో చెప్పింది భాగ్యం.

'ఈసారి పండక్కు మీరిచ్చిన చీరే నమ్మా నాకు. వేరే ఏవీలేవని' మరి

ఈ చీర! ఉండబట్టలేక అడిగింది.

"భాగ్యం మొన్న నాతోటి పండుగకు కొత్త చీరెలు లేవమ్మా మీరిచ్చిన చీరెలే కట్టుకోవాలి అన్నావు గదే! మరి ఈ కొత్త చీరేమిటి? అదిరిపోయే నీ అందమేమిటి?"

"ఛీ పొండి! అమ్మగారు మీరు కూడ అదే మాట!" సిగ్గు వొలకబోసింది.

"అంటే!.."

"అదేనమ్మగారు! లిఫ్టు ఎక్కుతుంటే వాచ్‌మెన్ భార్య కూడ అంది ఇదేమాట!"

"సరేగానీ! ఇంతకూ ఈ చీరె కథేమిటి?"

"అదేనమ్మా! మీరిచ్చిన చీరెలు కట్టుకుందామని అనుకుని తీసి ఒకరోజు ఒకచీర కట్టుకున్నా. ఆరోజు నన్ను చూసి మా రంగడు–


"ఎనకనుంచి చూత్తే అచ్చు అమ్మగారిలా అనిపిత్తున్నావు గదే!" అని ఎల్లిపోయాడు... అప్పుడు సంబరపడ్డాగాని, తరువాత నాకు భయమేసింది."

"భయం దేనికే?... వాడికలా అనిపించిందేమో!"

"మీరంటే ఆడికి వల్లమాలిన గౌరవం అమ్మా! ఇబ్బంది వాడితో కాదు. నేను మీ చీరెలు కట్టుకుని తిరుగుతుంటే పొరపాటున అయ్యగారు చూసి నన్ను మీరనుకుని..." మధ్యలో ఆపేసింది భాగ్యం.

"ఆయనకంత సీను లేదు. అయినా నీకంత అనుమానం ఎందుకొచ్చింది?"

"ఛ!ఛ!! అనుమానం కాదమ్మా. అవకాశం




ఇవ్వడమెందుకని..."

సహజంగా ఆడవారిలో ఉన్న అనుమాన బీజానికి నీళ్ళు పోసింది.

"అయితే ఇంతకూ ఆ చీరెలు ఏంచేశావు? స్టీలుగిన్నెల వాడికి ఇచ్చావా?" మాట దాటవేసింది ఉమాదేవి.

"అబ్బే అపచారం! అపచారం!! అంతమంచి చీరెలను అలా ఎందుకు చేస్తాను. మీకు బాధ కలగకూడదని ఆ చీరలను సెకండు హాండు చీరెల కింద అమ్మేసి ఆ డబ్బులతో ఈ కొత్తచీర కొన్నా. అందుకే అమ్మగారు ఇప్పుడు ఇది మీరు కొనిచ్చిన చీరే కదా?!" తెలివిగా సమాధానమిచ్చింది భాగ్యం.


'పండుగకు పాతచీర కట్టడం ఇష్టంలేక, అమాయకులైన రంగడిని, తన భర్తను అడ్డం పెట్టుకుని, పెద్ద పథకమే వేసి కొత్తచీర కొనుక్కుంది... నేరం నోరులేని రంగడి మీదకు నెట్టింది. అందుకే అంటారు 'తెలివి ఒకడి సొమ్మా' అని. నోరెత్తకుండా మధ్యలో తన భర్త ఏడుకొండలును బిగించింది. పెద్ద నెరజాణ ఇది' అని మనసులో అనుకుని...

"ఏదయితేనేమిలే నువ్వు కోరుకున్నట్టు కొత్త చీరే కట్టుకున్నావు. తెలివిగలదానివే!" కడుపు మండిపోతున్నా తమాయించుకుని చిరునవ్వు నవ్వింది ఉమాదేవి.

"మాదేవుందమ్మా! ఆరవ తరగతిలో కూడ చేరనోళ్ళం. అంతా మీలాంటి తల్లుల దగ్గర నేర్చుకున్నదే!" పొగడ్తో, తిట్టో అర్థంకానట్టు మాట్లాడింది భాగ్యం, ఎలాగైతేనేం తన పథకం బాగా పారిందని సంతోషిస్తూ.

"సరేగానీ! అంట్లుతోమిరా టిఫిను పెడతా" అంటూ లోనికి దారితీసింది ఉమాదేవి, ఇక చచ్చినా దీనికి పాత చీరెలు ఇవ్వకూడదని నిర్ణయించుకుని.

"అమ్మగారికి కాక పెరిగినట్టుంది. ఇక ఎంత కాలమో ఈ ఇంటిముద్ద ఋణం. అయితే ఏమయిందిలే ఇది కాకపోతే ఇంకొకటి. కష్టపడేవాడికి పనే దొరకదా. 'పండగనాడూ పాతమొగుడేనా' అన్నట్లు, ఎంతకాలం మేము ఈళ్ళు కట్టిపారేసిన పాత కోకలు కట్టుకుంటాం. మాకు మాత్రం కోరికలు ఉండవా? తీర్చకుంటాం అంతే! తెలివి ఈళ్ళకేనా మాకు లేదా? హు!!" అనుకుని దొడ్లోకి దారితీసింది భాగ్యం.



# తర్కారావు కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-9908445969

## ఎలా సాధ్యం!

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు–**

అప్పటి వరకూ గుటకలు మింగుతూ, అడగాలా వద్దా అని తనలో తానే గొడవపడుతున్న శేఖరం, కొంచెం గొంతు సవరించుకుని–

"మన మధ్య ఉన్న చిన్న నాటి స్నేహం తాలూకూ చొరవతో ఓ మాట అడుగుతాను" తటపటాయిస్తూనే అన్నాడు.




"దానికేవుంది. తప్పకుండా అడుగు... మడుగులో దిగుతున్నట్టు ఎందుకా భయం?" అన్నాడు మధు చిన్న చిరునవ్వుతో.

"ఏవీలేదు! నేనూ బిల్డింగ్ ప్లాన్స్ వేసి ఇస్తూ ఉంటాను... కానీ నీ అంత తక్కువ డబ్బుకి బిల్డింగ్‌ప్లాన్ ఇవ్వలేను. నేననే కాదు... మన సిటీలో చాలామంది నీ అంత తక్కువకి బిల్డింగ్ ప్లాన్, ఆ తర్వాత మెటీరియల్ ఎస్టిమేట్ ప్లాన్ (ఆ బిల్డింగ్‌కి ఎంత సిమెంటు, ఐరన్ అవుతుంది లాంటివి) ఇవ్వడం జరగదు. కానీ ఇలా తక్కువకి బిల్డింగ్ ప్లాన్ ఇస్తూ, నాకన్నా తక్కువ ప్రాజెక్ట్స్ చేస్తున్నావ్. అయినా నా కన్నా చాలా రెట్లు డబ్బు ఎక్కువ సంపాదిస్తున్నావ్! ఎటు నుండి ఎటు చూసినా దీనికి మాత్రం జవాబు దొరకడం లేదురా మధూ! ఇది నేనేదో నిన్ను ఫాలో అయిపోదామనో... లేక నీకన్నా నాలుగు రూపాయిలు ఎక్కువ సంపాదిద్దామనో కాదు. ఏదో తెగని ఆశక్తితో, ఎలా అని తెలుసుకోవాలని అంతే!... నీకు నా మీద నమ్మకం ఉంటే, ఇలా బిల్డింగ్ ప్లాన్స్ తక్కువ రేటుకి ఇస్తూ కూడా ఎక్కువ ఎలా సంపాదిస్తున్నావో మాత్రం చెప్పి నా కడుపుబ్బరం తగ్గించరా నాయనా!" బ్రతిమాలాడు శేఖరం.

"అలాగే చెప్తాను... కానీ నువ్వా విషయం ఇక్కడే మర్చిపోవాలి మరి!" అన్నాడు మధు.

"సరేరా బాబూ! ఎక్కువ సస్పెన్స్ పెట్టకుండా త్వరగా చెప్పు మరి!"

సరే అని మధు చెప్పింది అంతా విన్నాక, తెల్లమొహం వేసాడు శేఖరం.

"ఇన్నాళ్ళూ ఇదా నువ్వు చేస్తోంది?!..." అంటూ బిత్తరపోయాడు.


"ఇప్పుడు చెప్పు!... అతను బిల్డింగ్ ప్లాన్ గీయడానికి అంత తక్కువ తీసుకుంటున్నా, అంత ఎక్కువ ఎలా సంపాదిస్తుండవచ్చు?" అడిగాడు తర్కారావ్.


"అదేం ఉంది సార్! అతనికి ఇతర వ్యాపారాలేవైనా ఉన్నాయేమో సార్!" బుర్ర గోక్కున్నాడు సుబ్బారావ్.


"మళ్ళీ బట్టతలకీ మోకాలికీ ముడేసారు తమరి బొంద! అతను చేసేదేవిటంటే, బిల్డింగ్ ప్లాన్ వేసేప్పుడే... చాలామంది స్థలం కలిసి రావాలని... అపార్ట్‌మెంట్, గ్రూప్‌హౌస్, డూప్లెక్స్ బిల్డర్లు, మున్సిపాలిటీ వారి నిబంధనలని అతిక్రమించేలా బిల్డింగ్ ప్లాన్ వేయిస్తారు. అంటే ఉదాహరణకు పక్కింటి నుండి కొత్తగా కట్టబోయే ఇంటికి మూడు అడుగులు దూరం (సెట్‌బేక్స్) ఆ నిర్మాణం ముందు ఇంత వెడల్పు రోడ్డు ఉండాలి లాంటి మొదలైన నిబంధనలు పక్కన పెట్టేసి దర్జాగా నిబంధనలకి విరుద్ధమైన ప్లాన్‌తో అపార్ట్‌మెంట్ కట్టేసేవారు. తర్వాత ఓ ఆరు నెలలకో, ఏడాదికో మధే మున్సిపల్ సిబ్బందికి ఫోన్ చేసి, నిబంధనలు పక్కకి జరిపి గీసి ఇచ్చిన ఇళ్ళ ప్లాన్లు, ఆ ప్లాటు నంబర్లూ కొందరు మున్సిపల్ అధికారులకి చెప్పేవాడు. దాంతో అందులోని ఆ ఒకరిద్దరు లంచగొండులు ఆ బిల్డింగ్ విజిట్ చేసి, ఆ బిల్డర్ల దగ్గర కొంత డబ్బు దండుకుని, అందులో కొంత మధుకి కూడా ఇచ్చేవారు. ఇలా బిల్డింగ్ ప్లాన్ తక్కువకి ఇచ్చి, బిల్డర్ల లొసుగులు, తను కుమ్మక్కైన కొందరు అధికారులకి చెప్పి, అలా అడ్డగోలుగా సంపాదిస్తున్నాడన్నమాట... ఆ సంగతి తెలిసే కళ్ళు తేలేసాడు అతని స్నేహితుడు శేఖరం. అదీ జరిగింది. నువ్వు దగ్గరగా కూడా చెప్పలేకపోయావు. కనుక ఈసారి కూడా నీ జీతం పెంచడం జరగదు..." అని తర్కారావ్ చెప్పగానే–


"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!" అనుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావు.


# కరోనా కా(మెడీ)లం





Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P



Save Water



With Jaquar Taps

Best Cartoon of the Month



**Sambamurty Enterprises**

12-10-04, Convent Street,


Vijayawada-520 001.

fone: 0866-2563824, 9676444548

Hasyanandam June 2021. RNI No. APTEL 08387/01/1/2003-TC

సంతోషం సగం బలం ఒకప్పుడు...
సంతోషం సంపూర్ణ బలం ఇప్పుడు!
మనసారా నవ్వండి...
కరోనా భూతాన్ని తరమండి!
మనిషి భయం... కరోనాకు జయం...
ధైర్యంతోనే కరోనా పరార్...
స్థైర్యంతో నవ్వండి జరూర్!

-శంకర్‌నారాయణ





హాస్యానందం పాఠకుల హితార్థం
ఈ ప్రకటన జారీ చేసిన వారు:
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణ,**
**విజయవాడ**